ఆధునిక చిత్రకళా రీతులు
రూ॥150/-
పేజీలు:150
నవచేతన పబ్లిషింగ్ హౌస్
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్,
బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★

**కళాకారులను అన్ని విధాలుగా ఆదుకోండి**
ప్రభుత్వానికి పలువురు వక్తలు విజ్ఞప్తి
సమగ్ర సాంస్కృతిక విధానం – కళాకారులకు గుర్తింపు, హెల్త్‌కార్డులు, ఉద్యోగాలు' అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం 03

సంపుటి 09, సంచిక: 88 | గురువారం | 26-02-2026 | ఖమ్మం | Published from: **Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar** | పేజీలు: 12+8 | వెల రూ. 5.00

శతాధిక కమ్యూనిస్టు నేత, స్వాతంత్ర్యయోధుడు

# కామ్రేడ్ నల్లకన్ను అస్తమయం



శోకసంద్రమైన తమిళ నేల

దేశవ్యాప్తంగా సంతాప సూచకంగా సిపిఐ కార్యాలయాల్లో అరుణపతాకం అవనతం

చెన్నైలో నల్లకన్ను భౌతికకాయానికి సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, తమిళనాడు సిఎం స్టాలిన్, టివికె చీఫ్ విజయ్, పలువురు రాజకీయ, సినీ ప్రముఖుల నివాళి

నేడు ప్రభుత్వ లాంఛనాలతో అంతిమయాత్ర

**చెన్నై:** భారత దేశంలో అత్యంత సీనియర్ కమ్యూనిస్టు నాయకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు కామ్రేడ్ ఆర్.నల్లకన్ను(101) అస్తమించారు. వయస్సు సంబంధిత అనారోగ్యానికి గురై చెన్నైలోని మద్రాస్ మెడికల్ కాలేజ్–రాజీవ్‌గాంధీ ప్రభుత్వ ఆసుపత్రిలోఆయన ఫిబ్రవరి 1వ తేదీ నుండీ ఐసియులో చికిత్స పొందుతున్నారు. ముఖ్యమైన అంతర్గత అవయవాలు విఫలం కావడంతో బుధవారం మధ్యాహ్నం 1.55 గంటలకు ఆయన కన్నుమూసినట్లు జనరల్ హాస్పిటల్ ప్రకటించింది. భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించిన తరువాయి 2లో

**కరుణానిధి మరో కన్ను... నల్లకన్ను..**
"నాకు ఒక కంటిలో చూపు సరిగా లేకపోయినా, లోపల మరో కన్ను ఉంది. అది నల్లకన్ను" అని కరుణానిధి ఒకసారి అన్నారు. నల్లకన్నుతో కరుణానిధి జీవితాంతం స్నేహం చేసిన వ్యక్తి.
– తమిళనాడు సిఎం స్టాలిన్



**అణగారిన వర్గాల గొంతుక : ప్రధాని**
తిరు ఆర్.నల్లకన్ను అట్టడుగుస్థాయిలో నెరిపిన సంబంధాలు, అణగారిన వర్గాలు, కార్మికులు, రైతులకు గొంతుకగా నిలవడంలో చేసిన కృషికి గాను ఆయన స్మరించబడతారు. సమాజంలోని ప్రతి వర్గం ప్రజలచే ఆయన విస్తృతంగా గౌరవించబడ్డారు. ఆయన నిరాడంబరత కూడా అంతే ముఖ్యమైనది. ఆయన కుటుంబం, అభిమానులకు నా సానుభూతి
–'ఎక్స్'లో ప్రధాని నరేంద్ర మోదీ

పాఠ్యాంశంలో న్యాయవ్యవస్థపై అవినీతి చాప్టర్

# సుప్రీం సీరియస్

- న్యాయవ్యవస్థ ప్రతిష్ఠను కించపర్చినా, సమగ్రతను కలంకితం చేసినా సహించం
- భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ హెచ్చరిక
- 'ఎన్‌సిఇఆర్‌టి' 8వ తరగతి సోషల్‌లో కొత్త చాప్టర్ తేవడాన్ని సుమోటోగా స్వీకరించిన అత్యున్నత న్యాయస్థానం




**న్యూఢిల్లీ :** నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ & ట్రైనింగ్ (ఎన్‌సిఇఆర్‌టి) 8 వతరగతి సాంఘిక శాస్త్రం పాఠ్యాంశంలో న్యాయవ్యవస్థ అవినీతిపై ఒక కొత్త చాప్టర్‌ను చేర్చడాన్ని భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) సూర్యకాంత్ బుధవారం గట్టిగా ఆక్షేపించారు. ఈ భూమి మీద ఎవ్వరూ న్యాయవ్యవస్థ ప్రతిష్ఠను కించపర్చడం, దాని సమగ్రతను కళంకితం చేసినా సహించమని ఒకింత అసహనంతో గట్టిగా హెచ్చరించారు. సిజెఐ నేతృత్వంలోని జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి, విపుల్ ఎం పంచోలితో కూడిన ముగ్గురు జడ్జిల ధర్మాసనం ఎన్‌సిఇఆర్‌టి పాఠ్యపుస్తకాలలో న్యాయ వ్యవస్థ గురించి అభ్యంతరకర స్టేట్‌మెంట్స్‌ను తరువాయి 2లో

**వివాదాస్పద చాప్టర్ తొలగింపు?**
8వ తరగతి సోషల్ పాఠ్యపుస్తకంలో చేర్చిన కొత్త వివాదాస్పద చాప్టర్‌ను ఎన్‌సిఇఆర్‌టి తొలగించే అవకాశం ఉందని బుధవారం సంబంధిత వర్గాలు వెల్లడించాయి. సీనియర్ న్యాయవాదుల కపిల్ సిబల్, అభిషేక్ సింఘ్వీలు ఈ విషయాన్ని అత్యవసరంగా పరిశీలించాలని వాదనలు వినిపించడంతో సుప్రీంకోర్టు స్పందించింది. ఎన్‌సిఇఆర్‌టిని ఘాటుగా హెచ్చరించింది. కాగా, ఈ అంశంపై చేసిన కాల్స్, మెస్సేజెస్‌కు ఎన్‌సిఇఆర్‌టి చైర్మన్ దినేశ్ ప్రసాద్ సక్లానీ నుంచి ఎలాంటి స్పందనా రాలేదు. ఎన్‌సిఇఆర్‌టి ఒక స్వయంప్రతిపత్తి సంస్థ అయినప్పటికీ ఇలాంటి చాప్టర్స్ జోడించేటప్పుడు అది తప్పక తన ఆలోచనకు లోతుగా పదును పెట్టాల్సి ఉంటుందని ప్రభుత్వవర్గాలు తెలియజేశాయి. ఎన్‌సిఇఆర్‌టి 8వ తరగతి సోషల్ పుస్తకం కొత్త చాప్టర్‌లో న్యాయవ్యవస్థలో అవినీతి, భారీ సంఖ్యలో పెండింగ్ కేసులు, న్యాయమూర్తుల సంఖ్య సరిపోను లేని కారణంగా న్యాయవ్యవస్థ సవాళ్లను ఎదుర్కొంటోందని ఉటంకించిన విషయం తెలిసిందే.



# కేరళ మంత్రిపై కెఎస్‌యు దాడి

ఐసియులో ఆరోగ్య మంత్రి వీణాజార్జ్ చికిత్స

**కన్నూర్:** ఆరోగ్య మంత్రి వీణా జార్జ్‌పై కెఎస్‌యు(కాంగ్రెస్ అనుబంధ విద్యార్థి సంఘం) కార్యకర్తలు దాడి చేశారు. గాయపడిన మంత్రిని కన్నూర్ జిల్లా ఆసుపత్రిలోని ఐసియులో తరువాయి 2లో

బాసర ట్రిపుల్ ఐటిలో

# విద్యార్థిని ఆత్మహత్య



- బలవన్మరణం వెనుక వీడని మిస్టరీ
- ప్రియుడే ఆత్మహత్యే కారణమా..?
- విద్యార్థిని మృతదేహంపై ఉన్న కత్తిగాట్లకు అసలు కారణం ఏమిటో విచారించాలని పలువురు విద్యార్థులు డిమాండ్
- విసి ఛాంబర్‌ను ముట్టడించిన వందలాది మంది
- వర్సిటీ ఆవరణలో తీవ్ర ఉద్రిక్తత

ప్రజాపక్షం/నిర్మల్/ముథోల్

విద్యాకుసుమాలు వికసించాల్సిన నిర్మల్ జిల్లాలోని బాసర ట్రిపుల్ ఐటి(ఆర్.జి.యూ.కె.టి) క్యాంపస్ బుధవారం ఉదయం ఒక్కసారిగా శోక సంద్రంగా మారింది. వనపర్తి జిల్లాకు చెందిన వసంత అనే 19 ఏళ్ల విద్యార్థిని, ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతూ హాస్టల్ గదిలో ఉరివేసుకుని ప్రాణాలు విడవడంతో తోటి విద్యార్థులంతా నివ్వెరపోయారు.ప్రతిరోజు లాగే విద్యార్థినులందరూ ఉదయాన్నే క్లాసులకు వెళ్లగా, యమునా హాస్టల్‌లోని తన గదిలో వసంత విగతజీవిగా వేలాడుతూ కనిపించడం తీవ్ర కలకలం రేపింది. గదిలో వసంతను గమనించిన సిబ్బంది. వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించగా, వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పరిస్థితిని సమీక్షించి, ఆమె అప్పటికే మరణించినట్లు నిర్ధారించారు. ఉజ్వల భవిష్యత్తు ఉన్న విద్యార్థిని ఇలా అర్ధాంతరంగా తనువు చాలించడంతో వర్సిటీ ప్రాంగణం మొత్తం విషాదఛాయలు అలుముకున్నాయి.

**ప్రేమ వ్యవహారం, షాకింగ్ మలుపులు**

ఈ ఆత్మహత్య వెనుక గల కారణాలను విశ్లేషిస్తున్న పోలీసులకు విచారణలో దిగ్భ్రాంతికరమైన విషయాలు వెల్లడయ్యాయి. వసంత గత ఐదేళ్లుగా గణేష్ అనే యువకుడితో గాఢమైన ప్రేమలో ఉన్నట్లు ప్రాథమిక దర్యాప్తులో తెలిసింది. మంగళవారం రాత్రి గణేష్ నుంచి ఆమెకు ఫోన్ కాల్ రావడం,ఆ తర్వాత జరిగిన సంభాషణ ఆమెను తీవ్ర మనోవేదనకు గురిచేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అయితే ఈ కథనంలో అత్యంత తరువాయి 2లో



సాంకేతిక రంగంలో

# రాష్ట్రాభివృద్ధికి సహకరించండి

అడోబ్ సిఇఒ శంతను నారాయణ్‌కు సిఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి

ప్రజాపక్షం/హైదరాబాద్

సాంకేతిక రంగంతో పాటు తెలంగాణను అభివృద్ధి పథంలో ముందుకు నడిపించేందుకు మరింత సహకరించాలని అడోబ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సిఇఒ), తెలంగాణ రైజింగ్ –2047 విజన్ బోర్డు సభ్యులు శంతను నారాయణ్‌ను తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కోరారు. హైదరాబాద్‌లోని సిఎం క్యాంప్ కార్యాలయంలో బుధవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని శంతను నారాయణ్ మర్యాదపూర్వకంగా కలిశారు. గ్లోబల్ మాన్యుఫ్యాక్చరింగ్, గ్రీన్ ఎనర్జీ, ఉద్యోగాలపై ఎఐ ప్రభావం, యువతకు స్కిల్లింగ్, రీస్కిల్లింగ్ వంటి అంశాలపై తరువాయి 12లో



మీడియా అకాడమీ చైర్మన్

# కె.శ్రీనివాస్ రెడ్డి పదవీ కాలం పొడిగింపు

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి పదవీ కాలాన్ని మరో రెండేళ్ల పాటు రాష్ట్ర ప్రభుత్వం పొడిగించింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం 2024 ఫిబ్రవరి 26న రెండేళ్ల కాలానికి గాను తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్‌గా కె.శ్రీనివాస్ రెడ్డి నియమితులయ్యారు. ఆయన రెండేళ్ల పదవీ కాలం ఈ నెల 25వ తేదీన ముగియడంతో ఆయన పదవీ కాలాన్ని పొడిగిస్తూ తరువాయి 2లో

# 'రెవెన్యూ' ఆధునీకరణ




- ప్రజలకు వేగవంతమైన సేవలందించడమే ప్రభుత్వ లక్ష్యం
- తహసీల్దార్, ఆర్‌డిఒ కార్యాలయాలకు శాశ్వత భవనాలు
- రెవెన్యూశాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థను ఆధునికీకరించి,ప్రజలకు వేగవంతమైన సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. రాష్ట్రంలోని తహసీల్దార్, ఆర్‌డిఒ కార్యాలయాలకు శాశ్వత భవనాలను నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలిపారు. మొదటి దశలో అద్దె భవనాల్లో కొనసాగుతున్న 60 తహసీల్దార్ కార్యాలయాలు, 5 ఆర్‌డిఒ కార్యాలయాలకు ఆధునిక సౌకర్యాలతో శాశ్వత భవనాలు నిర్మిస్తామని, రెండవ దశలో శిథిలావస్థలో ఉన్న 170 ఆర్‌డిఒ, తహసీల్దార్ కార్యాలయాలను నిర్మిస్తామన్నారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని భవనాలు ఒకే నమూనాలో, ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా డిజైన్ చేస్తున్నామని,ఈ విషయమై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించిన తర్వాత డిజైన్లకు తుది రూపు ఇస్తామన్నారు. తక్కువ ఖర్చుతో ప్రజలకు అత్యుత్తమ సేవలు అందేలా ఈ భవనాల నిర్మాణం ఉంటుందన్నారు. రాష్ట్రంలో ఎన్ని తహసీల్దార్, తరువాయి 12లో

# రూ.43 కోట్ల ధాన్యం దోపిడీ

- ప్రభుత్వాన్ని దోచిన గ్యాంగ్ అరెస్ట్!
- ప్రభుత్వ ఖజానాకు గండికొట్టిన మిల్లర్ల ముఠా బట్టబయలు
- ప్రభుత్వ బియ్యం మోసం -నల్లగొండలో భారీ అవినీతి
- వివరాలు వెల్లడించిన ఎస్‌పి శరత్ చంద్ర పవర్

ప్రజాపక్షం/నల్లగొండ

ప్రభుత్వానికి చెందిన ధాన్యాన్ని అక్రమంగా విక్రయించి సుమారు రూ.43 కోట్ల మేర నష్టం కలిగించిన ప్రధాన నిందితులను నల్లగొండ పోలీసులు అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవర్ తెలిపారు.బుధవారం నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. కె.శివరాం రెడ్డి పర్యవేక్షణలో మూడు ప్రత్యేక బృందాలు విచారణ చేపట్టి, నల్లగొండ మండలం దోమలపల్లి గ్రామ శివారులో ప్రధాన నిందితులు కందుకూరి మహేందర్, తరువాయి 12లో

# రైతు భరోసా ఎప్పుడు?

ఇంకా అందక రైతుల ఎదురు చూపులు

- డిసెంబర్‌లో విడుదల కావాల్సిన నిధులు
- మూడు నెలలు గడిచినా విడుదల కాని వైనం
- పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలతో ఆలస్యం

ప్రజాపక్షం/హనుమకొండ

యాసంగి సీజన్ రైతు భరోసా కోసం అన్నదాతలు ఆశగా ఎదురుచూస్తున్నారు. యాసంగి సీజన్ ప్రారంభమై ఇప్పటికే మూడునెలలు గడిచిపోయింది. వాస్తవానికి డిసెంబర్ లోనే ఈ డబ్బులు రైతుల ఖాతాల్లో పడాల్సి ఉంది. ఇప్పటి వరకు జమ కాలేదు. పంచాయతీ, మునిసిపల్ ఎన్నికల హడావుడిలో ప్రభుత్వం రైతు భరోసా గురించి పట్టించుకోలేదు. పంచాయతీ ఎన్నికల ముందే రైతు భరోసా డబ్బులు అందుతాయని రైతులు ఆశించారు. కానీ వారికి నిరాశే ఎదురైంది. పంచాయతీ ఎన్నికల తర్వాత ఆ వెంటనే మునిసిపల్ ఎన్నికలు రావడంతో రైతు భరోసా సాయం అందడంలో మరింత జాప్యం తరువాయి 2లో




తగ్గిన నగదు, డెబిట్ కార్డుల వినియోగం

# పెరిగిన యుపిఐ, క్రెడిట్ కార్డుల లావాదేవీలు




**న్యూఢిల్లీ :** దేశంలో వ్యాపార లావాదేవీలలో యుపిఐ, క్రెడిట్ కార్డుల హవా పెరిగిపోయింది. దీంతో నగదు, డెబిట్ కార్డుల వినియోగం తగ్గిపోతోంది. అలాగే ఎటిఎంల సంఖ్య కూడా తగ్గింది. 2023 నుండి యుపిఐ, క్రెడిట్ కార్డుల ద్వారా జరిగిన లావాదేవీలు సంఖ్య, వాటి విలువ... సాంప్రదాయ కార్డు , నగదు వినియోగాన్ని అధిగమించాయి. ఇది వినియోగదారులు, వ్యాపార లావాదేవీలు విధానంలో చోటు చేసుకున్న నిర్మాణాత్మక మార్పును సూచిస్తుందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) డేటా తెలియజేస్తుంది. ఈ కాలంలో యుపిఐ వ్యవస్థ అత్యంత అద్భుతమైన వృద్ధిని చూసింది. యుపిఐ క్యూఆర్ కోడ్ల సంఖ్య 2023లో 24.42 కోట్ల నుండి 2026లో 73.84 కోట్లకు పెరిగింది. ఇది పెరిగిన చిన్న లావాదేవీలను సూచిస్తుంది. 2024, 2025 మధ్య అత్యధిక పెరుగుదల సంభవించింది. ఈ కాలంలో క్యూర్ కోడ్‌ల సంఖ్య 32.14 కోట్ల నుండి 64.01 కోట్లకు రెట్టింపు అయింది. మరోవైపు క్రెడిట్ కార్డుల వ్యాప్తి కూడా బలపడింది. క్రెడిట్ కార్డుల సంఖ్య 2023లో 8.25 కోట్ల తరువాయి 12లో

# ఇరాన్ అణ్వాయుధాన్ని అడ్డుకుంటాం

కాంగ్రెస్ సంయుక్త సమావేశంలో ట్రంప్ శపథం
అమెరికాను దెబ్బతీసేందుకే ఇరాన్ యత్నం
డెమోక్రాట్లు వెర్రివాళ్ళు
మధ్యంతర ఎన్నికల ఏడాది జనాకర్షణ యత్నం



**వాషింగ్టన్:** ఎట్టిపరిస్థితుల్లోనూ ఇరాన్‌ను అణ్వాయుధం తయారు చెయ్యనివ్వనని, అడ్డుకుంటానని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ శపథం చేశారు. ఆ అణు క్షిపణులు అమెరికాను దెబ్బతీస్తాయన్నారు. ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన సైన్యం అమెరికి దగ్గర ఉందన్నారు. రెండోసారి పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత ట్రంప్ కాంగ్రెస్ సంయుక్త సమావేశంలో మొదటిసారి వార్షిక ప్రసంగం చేశారు. పశ్చిమార్థగోళంలో అమెరికా ఆధిపత్యాన్ని పునరుద్ధరిస్తామన్నారు. మార్చినెలాఖరునాటికి ట్రంప్ చైనా పర్యటన నేపథ్యంలో ఎక్కడా ఆయన ఆ దేశం పేరు ఎత్తలేదు. ఉక్రేన్ గురించి చాలా తక్కువగా మాట్లాడారు. అదేవిధంగా ఎక్కడా వివాదాస్పద ఎప్‌స్టీన్ ఫైల్స్‌ను ప్రసావించలేదు. వాటి నిజానిజాలపై దర్యాప్తు గురించి మాట్లాడలేదు. వెనిజులాలో ప్రభుత్వ పనితీరు అమెరికాకు అనుకూలంగా ఉందంటూ ఆ దేశంలో ఎంతో గొప్ప మార్పు వచ్చిందని సంబరపడ్డారు. వాణిజ్య భాగస్వామ్యదేశాల నుండి దిగుమతి టారిఫ్‌లపై సుప్రీం కోర్టు విస్తృత ధర్మాసనం ప్రజాస్వామ్యపద్ధతిలో ఇచ్చిన మెజారిటీ తీర్పును మరోసారి తీవ్రస్థాయిలో విమర్శించారు. మధ్యంతర ఎన్నికల వేళ (నవంబరు) దేశంలో, విదేశీ విధానంలో ఎదురవుతున్న సవాళ్ళను అధిగమించి ప్రజలను ఆకర్షించేందుకు ట్రంప్ తన పరిపాలనలో మార్పులను అమెరికా యుగానికి మలుపుగా పేర్కొన్నారు. ప్రతిపక్ష డెమోక్రాట్లను వెర్రివాళ్ళుగా చిత్రీకరిస్తూ, దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు, ఆరోగ్యసేవల ఖర్చులు, గృహనిర్మాణ వ్యయాలు విపరీతంగా పెరిగిపోవడానికి డెమోక్రాట్లే కారణమని ఆరోపించారు. ఏడాది పరిపాలనా విజయాలను ట్రంప్ ఏకరువుపెట్టారు. రెండోసారి తన పాలనలో దేశం పరివర్తన చెందుతోందన్నారు. అమెరికా గతంకంటే ఎంతో పటిష్టవంతంగా రూపుదిద్దుకుంది, ఆర్థికంగా పెద్దరూపం దాల్చింది, అత్యుత్తమంగా ఉంది అని ట్రంప్ చెబుతున్నప్పుడు మిన్నెసోటాలో రెనీగుడ్, అలెక్స్‌ప్రెట్టీ అనే ఇద్దరు అమెరికన్ జాతీయులను ఐసిఇ ఏజంట్లు అమానుషంగా కాల్చిచంపడాన్ని ప్రస్తావి స్తూ డెమోక్రాట్ సభ్యులు నినాదాలు చేశారు. రిపబ్లికన్‌పార్టీ సభ్యులు ప్రతిసారీ లేచి నిలబడి చప్పట్లతో అభినందనలు తెలియజేయగా, ప్రతిపక్ష డెమోక్రాట్లు మాత్రం మౌనంగా కూర్చుని నిరసన తెలియజేశారు. వాషింగ్టన్ డిసి యునైటెడ్‌స్టేట్స్ క్యాపిటల్ హౌస్ ఛాంబర్‌లో గతంలో ఏ అధ్యక్షుడూ ప్రసంగించనంత సుదీర్ఘ సమయం ట్రంప్ మాట్లాడారు. గతంలో బిల్‌క్లింటన్ సృష్టించిన రికార్డును అధిగమించారు. అమెరికాను దెబ్బతీయాలనే లక్ష్యంతోనే ఇరాన్ క్షిపణి కార్యక్రమానికి పూనుకుంటోందని ఆయన ధ్వజమెత్తారు. ఐతే ఇరాన్‌తో దౌత్య చర్యలకే ప్రాధాన్యతనిస్తానన్నారు. తన పరిపాలనలో దేశం ఆర్థిక విజయాలు సాధించిందని, వలసలకు వ్యతిరేకంగా, నేరాలకు వ్యతిరేకంగా విజయాలు సాధించిందన్నారు. ఏదో ఒకరోజున ఆదాయపన్ను వసూలుస్థానాన్ని టారిఫ్‌లే భర్తీచేస్తాయన్నారు. మధ్యంతర ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని జనం ఆదరణ పొందాలనే ఉద్దేశంతో ట్రంప్ తన ప్రసంగాన్ని తయారు చేసుకున్నారని మీడియా వ్యాఖ్యానించింది.

**నల్లజాతీయులు కోతులు కాదు..**
**ప్రసంగాన్ని బహిష్కరించిన డెమోక్రాట్లు**

నల్లజాతీయులను కోతులుగా అభివర్ణిస్తూ ట్రంప్ గతంలో చేసిన అవమానకరమైన వ్యాఖ్యలకు నిరసనగా, ఆయన విధానాలను వ్యతిరేకిస్తూ సంయుక్త కాంగ్రెస్ సమావేశంలో ట్రంప్ ప్రసంగాన్ని ప్రతిపక్ష డెమోక్రాట్లకు చెందిన పెద్దబృందం బహిష్కరించింది. బరాక్ ఒబామాను ఉద్దేశించి ట్రంప్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. దీంతో ఈ వార్షిక కాంగ్రెస్ ప్రసంగం సందర్భంగా డెమోక్రాట్స్‌కు చెందిన సభ్యులు ప్లకార్డులను ప్రదర్శించారు. 'నల్లజాతీయులు ఏప్స్ కాదు..' అని నినదిస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. ట్రంప్ మొదటి విడతలో కూడా ట్రంప్ వార్షిక ప్రసంగాల్లో వివాదాస్పద ప్రకటనలే చేసేవారు. అప్పుడు కూడా డెమోక్రాట్లు ఆయన ప్రసంగాన్ని బహిష్కరించేవారు. ట్రంప్ తీరు మారలేదు. డెమోక్రాట్లు ఆయన వార్షిక ప్రసంగాలను బహిష్కరించడం మానలేదు. డెమోక్రాట్స్‌లో పెద్ద గ్రూపు బయటకు వెళ్ళిపోగా కొంతమంది మాత్రం కూర్చుని తనదైన పద్ధతిలో నిరసన తెలియజేశారు. సంవత్సరానికి ఒకసారి అధ్యక్షుడు చేసే ఈ ప్రసంగంలో అధ్యక్షుడి కుటుంబ సభ్యులు, సుప్రీంకోర్టు సభ్యులు, కాంగ్రెస్ సభ్యులు, ఇతర అతిథులు పాల్గొంటారు. ఇంటా బయటా అనేక సవాళ్ళ నడుమ ట్రంప్ ఈ కీలక ప్రసంగం చేశారు. ఈ ఏడాది చివరిలో జరిగే ఎన్నికల ఫలితాలవల్ల రిపబ్లికన్‌పార్టీ అమెరికా కాంగ్రెస్‌పై తన పూర్తి నియంత్రణను కోల్పోవడానికి సుప్రీంకోర్టు తీర్పు, విదేశీవిధానం ప్రధానాంశాలుగా దోహదపడే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఈ తరుణంలో డెమోక్రాట్లు చాలా విశ్వాసంతో కనిపిస్తున్నారు. ట్రంప్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. వింటర్ ఒలింపిక్స్‌లో బంగారు పతకాలు సాధించిన మెన్స్ హాకీ టీమ్ సభ్యులు యుఎస్ఎ అని రాసి ఉన్న టీ షర్టులతో సినిమాటిక్ పద్ధతిలో ఈ ఛాంబర్‌లోకి ప్రవేశించారు.

## ప్రధానశ్రేణి శక్తిగా ఎదిగిన చైనా

**జర్మన్ ఛాన్సలర్ మెర్జ్ తొలి చైనా పర్యటన**



**బీజింగ్:** జర్మన్ ఛాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్ రెండు రోజులు చైనా పర్యటన నిమిత్తం బుధవారం బీజింగ్‌కు చేరుకున్నారు. గ్రేట్‌హాల్‌లో చైనా ప్రధానమంత్రి లీ క్వియాంగ్‌ను కలిశారు. ఆయనతో చర్చల్లో పాల్గొన్నారు. మొదటిసారి జర్మన్ ఛాన్సలర్ చైనాలో అధికారిక పర్యటన చేస్తున్నారు. చైనా ప్రధానమంత్రి లీ కియాంగ్, అధ్యక్షుడు జిన్‌పింగ్, ఇతరులతో ఆయన సమావేశాలు జరుపుతారు. చైనాతో వాణిజ్యబంధం పెంపొందించుకోవడం, కీలకమైన ఖనిజాలు, మూలకాల సరఫరాలకు సంబంధించిన ఒప్పందాల ద్వారా ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకోవడం మెర్జ్ పర్యటనలో ప్రధానాంశం. రెండు దేశాలమధ్యా సంబంధాలు మెరుగుపడాలని తాను కోరుకుంటున్నాననీ, ఐతే ఇంకా పరిష్కారం కావాల్సిన సమస్యలు కొన్ని ఉన్నాయని అన్నారు. మొదట ఆయన చైనాకు బయలుదేరేముందు విమానాశ్రయంలో మాట్లాడుతూ, చైనా ఇప్పుడు నూతన సంవత్సర వేడుకలు చేసుకుంటోందని చెబుతూ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. విమానంలో చైనాకు వెళుతూ మీడియాతో మాట్లాడారు. చైనా ప్రపంచంలో ఒక ప్రధానశ్రేణి శక్తిగా ఎదిగిందని, ఎవ్వరూ ఇకమీదట చైనాను దాటవేయలేరని, ఈ విషయాన్ని అందరూ గుర్తించారని, ఇక అందరూ పరిగణనలోకి తీసుకోవాలని అన్నారు. రెండు దేశాలమధ్యా వాణిజ్య సమతుల్యతను తాము కోరుకుంటున్నామన్నారు. జర్మనీ నుండి తక్కువ ఎగుమతులు, చైనా నుండి రెండింతలు దిగుమతులు వస్తున్నందువల్ల దీనిని సమతుల్యం చేయాలని కోరుకుంటున్నట్లు చెప్పారు.

## నేడు అమెరికా-ఇరాన్ అణు చర్చలు



**టెహ్రాన్:** ఇరాన్–అమెరికా వర్గాలు ముందుగానే పేర్కొన్న విధంగా జెనీవాలో గురువారం ఈ రెండు దేశాల మధ్య మరో విడత చర్చలకు రంగం సిద్ధమైంది. ఈ విషయాన్ని ఇరాన్ కూడా ధృవీకరించింది. ఇరాన్ ప్రభుత్వం తరపున అధికార ప్రతినిధిగా వ్యవహరిస్తున్న మహిళ ఫతేమెహ్ మొహాజరానీ బుధవారం టెహ్రాన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. అమెరికా–ఇరాన్ మధ్య మూడో విడత అణు చర్చలు ఫిబ్రవరి 26న జెనీవాలో జరుగుతాయని చెప్పారు. 'నేడు (గురువారం) జెనీవాలో చర్చలు జరుగుతాయి, ఐతే ఈ సంప్రదింపుల పురోగతికి సంబంధించిన విషయాలన్నీ ఇరాన్ విదేశీమంత్రిత్వశాఖ ప్రతినిధులే అధికారికంగా తెలియజేస్తారు' అని చెప్పారు. ఇరాన్ అణు కార్యక్రమం చుట్టూ ఏర్పడిన సంక్షోభంపై పరిష్కారం గురించి సమావేశం జెనీవాలోని ఒమన్ దౌత్యకార్యాలయంలో జరుగుతుందని ఇస్నా వార్తాసంస్థ తెలియజేసింది. ఈ చర్చల్లో పాల్గొనేందుకు ఇరాన్ విదేశీమంత్రి అబ్బాస్ అరాఘ్చి తన సహాయకుల బృందంతో కలిసి బుధవారం సాయంత్రం టెహ్రాన్ నుండి జెనీవా బయలుదేరి వెళ్ళారు. ఇరాన్–అమెరికామధ్య పరస్పర హెచ్చరికలు, ఉద్రిక్తలు, చర్చలు వంటి సుదీర్ఘ పరిణామాలను చైనా ప్రభుత్వం నిశితంగా అధ్యయనం చేస్తోంది. పశ్చిమ ఆసియాలో పరిణామాలు ఏ దేశ ప్రయోజనాలనూ నెరవేర్చబోవని చైనా విదేశీమంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి మావోనింగ్ వ్యాఖ్యానించారు. ఈ పరిణామాలను చైనా క్షుణ్ణంగా పరిశీలిస్తోందన్నారు. చర్చల వాతావరణం మధ్య పశ్చిమాసియా జలాలలోకి ట్రంప్ మంగళవారం మరో విమానవాహక యుద్ధ నౌకను తరలించారు. దాడిచేస్తే ఈ యుద్ధం అంతటితో ఆగబోదని, సర్వత్రా వ్యాపిస్తుందని ఇ రాన్ దౌత్యవేత్త, న్యాయనిపుణుడు, విదేశీవ్యహారాల ఉపమంత్రి కజెం ఘరిబాబాది హెచ్చరించారు. ఇది చాలా విస్తారమైన యుద్ధంగా పరిణమిస్తుందన్నారు.

## సుప్రీం సీరియస్

(మొదటి పేజీ తరువాయి)

తీసుకోవడాన్ని సీనియర్ అడ్వకేట్లు కపిల్ సిబల్ సహా అభిషేక్ సింఘ్వీ ధర్మాసనం ముందు తమ వాదనలను వినిపించడంతో ఈ అంశాన్ని సుమోటోగా స్వీకరించింది. ఈ అంశాన్ని అత్యవసరంగా పరిగణనలోనికి తీ సుకోవాలని కోరారు. 8వ తరగతికి చెందిన ఎన్‌సిఇఆర్‌టి సోషల్ సైన్స్ నూతన పాఠ్యపుస్తకాలలో అవినీతి, పెండింగ్ కేసులు, న్యాయమూర్తులు తగినంత సంఖ్య లో లేకపోవడం న్యాయవ్యవస్థ ఎదుర్కొంటున్న సవా ళ్లు' అని పేర్కొన్న విషయాన్ని కొత్త టెక్ట్స్ బుక్స్‌లలో 'న్యాయవ్యవస్థలో అవినీతి' అనే సెక్షన్ న్యాయమూర్తులు కోర్టులో వారి ప్రవర్తనను మాత్రమే కాకుండా, దాని వెలుపల వారు ఎలా ప్రవర్తిస్తారో కూడా ఒక ప్రవర్తనా నియమావళికి కట్టుబడి ఉంటారని పేర్కొంది. ఎన్‌సిఇఆర్‌టి పాఠ్యపుస్తకంలో 8వ తరగతి విద్యార్థులకు న్యాయవ్యవస్థలో అవినీతి గురించి బోధిస్తున్నారని, న్యాయవ్యవస్థలో భాగమైన మ సభ్యులమైన మేము ఈ చాప్టర్ పట్ల చాలా కలత చెందుతున్నామని, ఈ పుస్తకం కాపీలు మావద్ద కూడా ఉన్నాయని సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ అన్నారు. దీనిగురించి తనకు పూర్తి అవగాహన ఉందని ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ చెప్పారు. తనకు అనేక హైకోర్టు జడ్జిల నుండే కాకుండా ఇతరుల నుంచి కూడా మెస్సేజెస్ చాలా వ చ్చాయని సిజెఐ వివరించారు. ఈ అంశాన్ని సుమోటో నేరంగా పరిగణించాలని ఇప్పటికే ఒక ఆదేశాన్ని జారీచేసానని చెప్పారు. ఎన్‌సిఇఆర్‌టి సెలక్టివ్ విధానాన్ని అవలంభించే అంశాన్ని అభిషేక్ సింఘ్వీ లేవనెత్తారు. అవినీతిఎక్కడా లేదన్నట్లుగా దాని ధోరణి ఉందని, బ్యూరోక్రసీ, రాజకీయాలు, ప్రజా జీవితం, ఇ తర సం స్థల్లో అవినీతి గురించి ఏ ఒక్క పదమూ లేకపోవడం శోచనీయమని ఆయన వాదించారు. ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ దీనిపై స్పందిస్తూ ఈ భూమి మీద న్యాయవ్యవస్థ ప్రతిష్ఠను, సమగ్రతనూ ఎవ్వరూ కించపర్చడం, దాని సమగ్రతను కళంకితం చేయడాన్ని నేను ఎట్టిపరిస్థితుల్లో అనుమతించను. ఈ విషయంలో అది ఎంత ఎత్తుకు చేరుకున్నా చట్టం దాని పని అది చేసుకుపోతుంది. దానితో ఎలా వ్యవహరించాలో నాకు తెలు సు. ఇది చాలా లెక్కలు వేసి లోతుగా ఆలోచించిన చర్యగా కనిపిస్తోంది. దీని గురించి మేము ఇంతకంటే ఏమి చెప్పదలచుకోలేదు' అని సిజెఐ సూర్యకాంత్ అన్నారు. ఈ అంశాన్ని లేవనెత్తినందుకు న్యాయవాదులకు నేను కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని సిజెఐ సూర్యకాంత్ అన్నారు.

# కామ్రేడ్ నల్లకన్ను అస్తమయం

మొదటి పేజీ తరువాయి)

1925 డిసెంబర్ 26వ తేదీనే జన్మించిన శతాధిక పోరాట యోధుడు. నిస్వార్థ, నిరాడంబరతలకు నిలువెత్తు నిదర్శనమైన నల్లకన్నును తమిళ ప్రజలు ఆర్ఎన్‌కె, తమిళనాడు గాంధీ అని ఆత్మీయంగా పిలుచుకుంటారు. ఆయన తమిళనాడులో పార్టీలకు అతీతంగా అత్యంత గౌరవ ఆదరణలు పొందిన నాయకుడు. అణగారిన వర్గాలు, పేదలు, రైతులు, ప్రజలకోసం ఆయన నిత్యం పోరాటాలలో జీవించారు. చిత్తశుద్ధి, అంకితభావం, నిస్వార్థసేవకు పెట్టింది పేరు. దాదాపు 80 సంవత్సరాలు ప్రజలమధ్య క్రియాశీల రాజకీయ జీవితం గడిపారు. 13 సంవత్సరాలు తమిళనాడు సిపిఐ రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. అనేక పోరాటాలు చేశారు. భారత కమ్యూనిస్టుపార్టీ జాతీయ సమితి, జాతీయ కార్యదర్శివర్గం ఆయన మృతికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశాయి. స్వాతంత్ర్య యోధుడు, ప్రజలకోసం పోరాడిన నిస్వార్థ యోధుడు నల్లకన్ను గౌరవార్థం పార్టీ అరుణపతాకాన్ని అవనతం చేసింది. ఆయన పార్థివదేహాన్ని చెన్నైలోని సిపిఐ కార్యాలయానికి తరలించారు. సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, తమిళనాడు రాష్ట్ర కార్యదర్శి ఎం.వీరపాండ్యన్ తదితరులు నల్లకన్ను పార్థివదేహంపై అరుణపతాకం కప్పి, పూలమాలలు సమర్పించి విప్లవ జోహార్లు అర్పించారు. తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్, ఉపముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ తదితర ప్రభుత్వగణం సిపిఐ కార్యాలయానికి వచ్చి ఆయన పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. సిపిఐ(ఎం) తమిళనాడు రాష్ట్ర కార్యదర్శి పి.షన్ముంగం తదితర ప్రముఖులు నివాళులు అర్పించారు. పూర్తి ప్రభుత్వ లాంఛనాలతో గురువారం ఆయన అంతిమయాత్ర, అంత్యక్రియలు నిర్వహిస్తారు. ఆయన మరణవార్త తెలియగానే పార్టీలకు అతీతంగా నాయకులు, ప్రజలు, పెద్దసంఖ్యలో అభిమానులు పార్టీ కార్యాలయానికి తరలివచ్చారు. తమిళనాడు శోకసంద్రంలో మునిగింది. దేశవ్యాప్తంగా సంతాప సందేశాలు వెల్లువెత్తాయి.

**జీవిత సంగ్రహం :** నాటి మద్రాస్ ప్రెసిడెన్సీ, ప్రస్తుత తమిళనాడు రాష్ట్రం తూత్తుకుడి జిల్లా శ్రీవైకుంఠం సమీపంలో ఉన్న పెరుంపట్టు గ్రామంలో 1925 డిసెంబరు 26వ తేదీన ఆర్.నల్లకన్ను జన్మించారు. యువకుడుగా ఉండగా ఆయన కడు పేదరికాన్ని చవిచూశారు. దారుణమైన అణచివేత,దోపిడీలను ప్రత్యక్షంగా చూశారు. చవిచూశారు. కమ్యూనిస్టు కార్యకర్త, నాయకుడు, స్వాతంత్ర్యపోరాట యోధుడు. యుక్త వయసులోనే ఆయన కమ్యూనిస్టు ఉద్యమంలో చేరారు. 1946లో మార్క్సిస్టు సిద్ధాంతం పట్ల ఆకర్షితులయ్యారు. ఆనాటికి భారతదేశం ఇంకా వలసపాలనలోనే ఉంది. రాజకీయాలు ఆయన కోరిక కాదు. అణచివేతకు గురవుతున్న ప్రజలను సమీకరించి వారికి న్యాయం చేయడంకోసం ప్రజలను సమీకరించి, సన్నద్ధులను చేసి అన్యాయానికి వ్యతిరేకంగా పోరాటం చేయడంకోసం రాజకీయాన్ని ఒక మార్గంగా ఆయన భావించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఆయన జనబాహుళ్య నాయకుడుగా ఎదిగారు. ఆయన నిరాడంబరత, మర్యాద, మన్నన, ఉద్యమస్ఫూర్తి, లక్ష్యసిద్ధి, నైతికత యావత్ ప్రపంచం దృష్టినీ ఆకర్షించింది. కొత్త తరాలను ఆయన ఆకర్షించారు. వారికి స్ఫూర్తిగా నిలిచారు. 1950వ దశకంలో ఆయన క్రియాశీల కార్యకలాపాలు అధికారవర్గాల దృష్టిలో పడ్డాయి. 1948లో ఆయన అరెస్టయ్యారు. నెల్లై కుట్ర కేసులో ఆయన ఏడు సంవత్సరాలు జైలు శిక్ష అనుభవించారు. ఆ సమయంలో జైలులో ఆయన దారుణమైన చిత్రహింసలను అనుభవించారు. ఒక సంఘటన చెప్పాలంటే ఒక పోలీసు ఆయన మీసాన్ని సిగరెట్టుతో కాల్చి తీవ్రంగా బాధపెట్టాడు. ఇక ఆయన ఆయన మీస కట్టు తీసేశారు.

**నిత్యపోరాటాలు కోటిరూపాయలు బహుమానం ప్రజలకే..** తమిళనాట రైతులు, వ్యవసాయ కార్మికుల హక్కులకోసం నల్లకన్ను అవిశ్రాంత పోరాటాలు చేశారు. ప్రజలకోసం నిత్యం పోరాటాలలో ఉండేవారు. వివిధ పోరాటాలకు ఆయన నాయకత్వం వహించారు.అనేక బహిరంగసభల్లో ఆయనపాల్గొన్నారు. ఆయనకు 100 సంవత్సరాలు వయసు వచ్చేవరకూ బహిరంగ సభల్లో పాల్గొంటూ వచ్చారు. పేదలను,కార్మికులను దోపిడీకి గురిచేసే భూస్వాములను ఆయన తీవ్రంగా ప్రతిఘటించారు. తమిళనాడు నదీ తీరాల నుండి అక్రమంగా ఇసుక తవ్వకాలకు వ్యతిరేకంగా ప్రచార పోరాటాలు చేశారు. 2018లో మదురై కోర్టులో ఈ విషయంపై ఆయన పోరాటం చేసి విజయం సాధించారు. ప్రజలకు నష్టం కలిగించే ప్రతి చిన్న సమస్యపైనా ఆయన పోరాటం చేశారు. ఆయన నిస్వార్థపూరితమైన సేవలు కోకొల్లలుగా ఉన్నాయి. ఆయన 80వ జన్మదినోత్సవం సందర్భంగాఆ పార్టీ కార్యకర్తలు ఆయనకు ఒక కారు బహుమతిగా ఇచ్చారు. కోటి రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందించారు. కానీ ఆయన తిరిగి అదే వేదికపైనుండి ఆ ధనాన్ని ప్రజలకే అంకితం చేశారు. ఆ ధనం తనకు చెందదనీ, ఆ సొమ్ము ప్రజలకే చెందుతుందని ఆయన ఆ బహుమతిని తిరిగి ఇచ్చేశారు. 2022లో తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం ఆయనకు ''థగైసాల్ తమిగళ్'' పురస్కారాన్ని ఇచ్చి సత్కరించింది. దాంతోపాటు రూ.15 లక్షలు నగదు బహుమతిని అందజేసింది. ఆ ధనానికి మరో రూ.5000లు చేర్చి ఆయన ముఖ్యమంత్రి సహాయ నిధికి తిరిగి ఇచ్చేశారు. భారత కమ్యూనిస్టుపార్టీ నాయకత్వంలో ఆయన తమిళనాడులో బలమైన రాజకీయశక్తిగా మారారు. కార్మికుల హక్కులకోసం పోరాటం చేశారు. వ్యవసాయ సంస్కరణలు కోసం, సాంఘిక సంక్షేమంకోసం పోరాటాలు చేశారు. 25 సంవత్సరాలపాటు నల్లకన్ను రైతు సంఘాలకు నాయకత్వం వహించారు. గ్రామీణస్థాయిలో కార్యకర్తల వ్యవస్థను నిర్మించారు. భావసారూప్యతగల అన్ని శక్తులతో ఆయన మిత్రుత్వాన్ని నెరపారు. వారితో కూటమి కట్టారు. ప్రగతిశీల ప్రజాపోరాటాలను ముందుకు తీసుకువెళ్ళడంకోసం ఆయన ఈ విధంగా భావసారూప్యతగల శక్తులను ఒకచోటకు తీసుకువచ్చారు. ఆయన పార్టీలో జాతీయ కార్యదర్శివర్గ సభ్యుడుగా, సెంట్రల్ కంట్రోల్ కమిషన్ ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు. ప్రజాజీవితంలో ఆయన చేసిన అపరిమితమైన సేవలకు, సాంఘిక సంస్కరణలకుగాను అనేక అవార్డులు ఆయనను వరించాయి.



టుటికోరిన్ జిల్లా శ్రీవైకుంతం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రంజితం అమ్మాళ్‌ను ఆయన వివాహం చేసుకున్నారు. వారికి ఇద్దరు కుమార్తెలు. ఆయన సతీమణి అమ్మాళ్ తన 82వ యేట 2016లో మరణించారు. 1999లో కోయంబత్తూరు పార్లమెంటరీ నియోజకవర్గం నుండి పోటీచేసి 43.21 శాతం ఓట్లు సంపాదించారు. సి.పి.రాధాకృష్ణన్ ఆ నియోజకవర్గంలో గెలిచారు. 1992 మార్చి 7 నుండి 2005 ఏప్రిల్ 15వ తేదీ వరకూ తమిళనాడు కమ్యూనిస్టుపార్టీ రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. ప్రజాపోరాటాలలో అనేకసార్లు నల్లకన్ను నిరాహార దీక్షలు చేశారు. ఒక్కొక్కసారి 20రోజులు వరకూ ఆయన దీక్షలు కొనసాగాయి. చైనాలో పర్యటించారు. బీజింగ్ పర్యటన సందర్భంగా నాటి పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా ఉపాధ్యక్షుడి చేతులమీదుగా పురస్కారాన్ని అందుకున్నారు. ప్రజాజీవితంలో చేసిన కృషికిగాను ఆయన 2007లో అంబేద్కర్ పురస్కారం, అదే సంవత్సరంలో తమిళనాడు గవర్నర్ సూర్జిత్‌సింగ్ బర్నాలా చేతులమీదుగా సహయోగి పురస్కారం,

**నేడు మెడికల్ కాలేజీకి భౌతికకాయం అందజేత**

**నల్లకన్ను భౌతికకాయాన్ని ఆయన కోరిక మేరకు వైద్య విద్యార్థుల పరిశోధన నిమిత్తం చెన్నై మెడికల్ కాలేజీకి అందజేయనున్నారు. 2016లోనే ఆయన మెడికల్ కాలేజీకి ఈ మేరకు అంగీకార పత్రాన్ని ఇచ్చారు. గురువారం సాయంత్రం 5 గంటల వరకు నల్లకన్ను భౌతికకాయాన్ని చెన్నైలోని సిపిఐ కార్యాలయంలో అభిమానుల అంతిమ నివాళి కోసం ఉంచుతారు. ఆ తరువాత అంతిమయాత్ర నిర్వహించి వైద్య కళాశాలకు భౌతికకాయాన్ని అప్పగించున్నారు.**

2008లో మహాత్మాగాంధీ సోషల్ వెల్ఫేర్ ఫోరం నుండి గాంధేయ అవార్డు స్వీకరించారు. 2009లో తిరుచ్చి జిల్లా రచయితల సంఘం నుండి జీవా అవార్డు పొందారు. తమిళనాడులో సిపిఐ(ఎం) ప్రముఖ నేత ఎన్.శంకరయ్య వామపక్షనేతగా శతాధిక సంవత్సరాలు జీవించారు. ఆ తర్వాత తమిళనాడులో ఇప్పటివరకూ శతాధిక సంవత్సరాలు జీవించిన ఏకైక వామపక్షనేత నల్లకన్ను ఒక్కరే.

**ఉద్యమమే ఊపిరిగా ప్రజలకోసమే జీవించిన నల్లకన్ను: స్టాలిన్**

నల్లకన్ను మరణంపట్ల తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. పూర్తి ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తామని ఆయన ప్రకటించారు. వామపక్ష నేత మరణవార్త తెలియగానే దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాల నుండి సంతాపాలు వెలువడ్డాయి. నల్లకన్ను దేశ స్వాతంత్ర్యం కోసం రాజీలేని పోరాటం చేశారని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ తన సంతాప సందేశంలో పేర్కొన్నారు. సామాజిక మార్పుకోసం కామ్రేడ్స్ అందరూ కమ్యూనిస్టు–ద్రవిడియన్ సిద్ధాంతాలకు అనివార్యంగా కట్టుబడి ఒక డబుల్ బ్యారెల్ గన్ తరహాలో పనిచేయాలన్న స్థిరమైన విశ్వాసంతో కడవరకూ దానికే కట్టుబడి పనిచేశారని, ద్రవిడియన్ నమూనా ప్రభుత్వం తరపున ఆ కామ్రేడ్‌కు ''తమిళ శ్రేష్ఠుడు'' (థగైసాల్ తమిగళ్) పురస్కారాన్ని ఇచ్చి సత్కరించే అవకాశం తనకు లభించడం ఒక గొప్ప అదృష్టమని స్టాలిన్ పేర్కొన్నారు. ఆయన శతసంవత్సర జన్మదిన ఉత్సవం సందర్భంగా ఆయన చేసిన వ్యాఖ్యలను ఈ సందర్భంగా స్టాలిన్ గుర్తుచేసుకున్నారు. ''కమ్యూనిస్టు ఉద్యమమే జీవితం''గా బ్రతికానని ఆయన చేసిన వ్యాఖ్య తన స్మృతిపథంలో ఎల్లప్పుడూ మారుమోగుతూనే ఉంటుందన్నారు.ఆయన ప్రజలకోసమే జీవించారని, ఆయన ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు, బంధువులకు, కమ్యూనిస్టు ఉద్యమంలో ఉన్న కామ్రేడ్స్ అందరికీ నా ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నానని పేర్కొన్నారు. మన ప్రియమైన తమిళ శ్రేష్ఠుడికి పూర్తి ప్రభుత్వ లాంఛనాలతో మనందరం వీడ్కోలు పలుకుదామని అన్నారు.

## శ్రీనివాస్ రెడ్డి పదవీ కాలం పొడిగింపు

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం (సాధారణ పరిపాలన శాఖ) బుధవారం ఉత్తర్వులు (జిఓ 289) జారీ చేసింది. మీడియా అకాడమీ చైర్మన్‌గా మరోసారి నియమితులైన కె.శ్రీనివాస్ రెడ్డికి పలువురు సీనియర్ జర్నలిస్టులు, ప్రముఖులు, టియుడబ్ల్యుజె నాయకులు అభినందనలు తెలియజేశారు. కాగా జర్నలిజం రంగంలో సుదీర్ఘ అనుభవం ఉన్న సీనియర్ సంపాదకులు శ్రీనివాస్ రెడ్డి, జర్నలిస్టుల సంక్షేమం కోసం చేస్తున్న విశేష కృషిని ప్రభుత్వం గుర్తించి ఆయన పదవీ కాలాన్ని పొడిగించింది. జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు, ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులు, ఇతర సంక్షేమ పథకాల అమలులో శ్రీనివాస్ రెడ్డి కీలక పాత్ర పోషించనున్నారు.

## కెఎస్‌యు దాడి

(మొదటి పేజీ తరువాయి)

చికిత్స పొందుతున్నారు. కన్నూర్‌లో ఉన్న ముఖ్యమంత్రి పినరయి విజయన్ జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మంత్రి వీణా జార్జ్‌ను పరామర్శించారు. మంత్రిపై దాడి కాంగ్రెస్ నీచ రాజకీయానికి నిదర్శమని ఆయన అన్నారు. కన్నూర్‌లో మంగళవారం వివిధ కార్యక్రమాలకు హాజరైన తర్వాత వందే భారత్ రైలులో తిరువనంతపురం బయలుదేరడానికి స్టేషన్‌కు మంత్రి వీణా జార్జ్ చేరుకున్నారు. మంత్రి వాహనం రైల్వే స్టేషన్‌లోకి ప్రవేశించబోతుండగా, కెఎస్‌యు కార్యకర్తలు నిరసనకు దిగారు. నిరసనకారులు నల్ల జెండాలతో మంత్రిపై దాడి చేయగా ఆమె మెడ, చేతికి గాయాలయ్యాయి. ఆరోగ్య మంత్రిపై దాడికి నేతృత్వం వహించిన కెఎస్‌యు జిల్లా అధ్యక్షుడు ఎం.సి. అతుల్ సహా ఐదుగురిని అరెస్టు చేసినట్లు డిజిపి రావడ చంద్రశేఖర్ ప్రకటించారు. వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. కన్నూర్ రైల్వే స్టేషన్ లోపల దాడి జరిగినందున, నిందితులను రైల్వే పోలీసులకు అప్పగిస్తారు.

## భరోసా ఎప్పుడు?

(మొదటి పేజీ తరువాయి)

జరిగింది. ఇప్పుడు ఈ ఎన్నికల ప్రక్రియ కూడా పూర్తయింది. కనీసం ఇప్పుడైనా ప్రభుత్వం తమను ఆదుకుంటుందా..? లేదా..? అని కలవరపడుతున్నారు. ఏప్రిల్ లో జిల్లా పరిషత్ ఎన్నికలు జరిపే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. కనుక ఈలోగా రైతు భరోసా అందవచ్చునని భావిస్తున్నారు. మంత్రి వర్గ సమావేశంలో రైతు భరోసా నిధుల విడుదలపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంటుందని అందరూ బావించారు. అనంతరం మరుసటి రోజు ఫిబ్రవరి 24నుంచి నేరుగా రైతుల బ్యాంక్ ఖాతాల్లోకి డీబీటీ పద్ధతిలో నగదు బదిలీ ప్రక్రియ ప్రారంభం కానున్నదని బావించినా ప్రభుత్వం ప్రకటన చేయలేదు.మొదట ఒకరం ఉన్నవారికి, తర్వాత 2,3 ఎకరాలు ఉన్నవారికి, ఆ తర్వాత 4ఆపైన ఎకరాలు ఉన్న రైతులకు ద శలవారీగా రైతు భరోసా డబ్బులు జమకావాల్సి ఉంది. గత సీజన్లో సాయం పొందిన అర్హులైన రైతులందరికీ ఈసారి కూడా నిధులు అందజేయాలని ప్రభుత్వం అనుకుంటోంది. జిల్లాలో వ్యవసాయ భూములను సాగు చేసుకుం టున్న రైతులు 1.56లక్షల మంది ఉన్నారు. జిల్లాలో 2,50,000 ఎకరాల భూమి సాగవుతోంది. ఈ లెక్కన యాసంగి సీజన్ కు గాను రూ 150కోట్ల మేరకు రైతులకు భరోసా అందనున్నది.

**భరోసా అందక ఇబ్బందులు**

రైతు భరోసా డబ్బులు సకాలంలో అందక పంట పెట్టుబడికి డబ్బులు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వరి నాట్ల అనంతరం కలుపు, ఎరువుల వినియోగం కోసం నిధులు అవసరం ఉండగా యాసంగి సీజన్ డబ్బులు విడుదల కాలేదు. తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక 1.60 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.5వేల చొప్పున రూ.135కోట్లు జమ అయ్యాయి. 2024–25 వానాకాలానికి నిధులు విడుదల కాలేదు. రైతులు కాని ఖాతా ల్లో రైతు భరోసా డబ్బులు పడుతున్నాయని భావించిన ప్రభుత్వం.. సర్వేను నిర్వహించింది. వాస్తవ సాగుదారులను గుర్తించేందుకు రైతు సమ్మేళనాలు నిర్వహించి అభిప్రాయాలు సేకరించింది. రైతుల సంఖ్యలో, సాగు భూమి విషయంలో కొంత వ్యత్యాసం కనిపించింది. సాగుచేయని భూముల రైతులను రైతు భరోసా జాబితా నుంచి తొలగించింది. ఆ తర్వాత యాసంగిలో ఎకరానికి రూ.6వేల చొప్పున 1.50 లక్షలమంది రైతులకు రూ.150 కోట్లు జమ చేసింది. 2025–26 వానాకాలంలో 1.50లక్షల మంది రైతుల ఖాతాల్లో మరో రూ.150 కోట్లు జమ అయ్యాయి. ప్రస్తుతం యాసంగి సీజన్లో డబ్బుల కోసం రైతులు ఎదురుచూస్తున్నారు.

**అందరికీ సాయం అందేలా..**

రైతులకు నిధుల పంపిణీలో పారదర్శకత కోసం ప్రభుత్వం శాటిలైట్ మ్యాపింగ్ సర్వేను పరిగణలోకి తీసుకుంటారని అధికారులు చెబుతున్నారు. సింథటి క్ ఎపర్చర్ రాడార్ టెక్నాలజీ ద్వారా సాగులో ఉన్న భూములను గుర్తించి, కేవలం పంట వేసిన వారికే రైతు భరోసా అందించాలనే వాదన కూడా వినిపి స్తోంది. అయితే సాగుదారులకు ఇబ్బంది కలగకుండా గతంలో లబ్దిపొందిన అందరికీ సాయం అందించే దిశగా కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ఏడాదికి రెండు సీజన్లకు కలిపి ఎకరానికి రూ.12వేల పెట్టుబడి సాయం అందుతుంది.

## విద్యార్థిని ఆత్మహత్య

(మొదటి పేజీ తరువాయి)

విషాదకరమైన మలుపు ఏంటంటే,వసంతతో మాట్లాడిన కొద్దిసేపటికే గణేష్ హైదరాబాద్ లోని ఒక హాస్టల్‌లో ఉరిరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తన ప్రియుడు బలవన్మరణానికి పాల్పడ్డడన్న విషయం తెలుసుకున్న వసంత,ఆ తీవ్ర దుఃఖాన్ని తట్టుకోలేకపోయిందని పోలీసులు భావిస్తున్నారు. ఆమె మొదట కత్తితో తన చేతిపై, మెడపై గాట్లు పెట్టుకుని తీవ్రంగా గాయపరుచుకున్నట్లు,ఆ తర్వాతే హాస్టల్ గదిలో ఉరివేసుకుని మరణించినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు.

**విద్యార్థుల ఆగ్రహం,వీసీ ఛాంబర్ ముట్టడి..**

వసంత మృతదేహంపై ఉన్న కత్తి గాట్లు చూసిన తోటి విద్యార్థులు ఒక్కసారిగా ఆగ్రహంతో ఊగిపోయారు.కేవలం ప్రేమ వ్యవహారం అని చెప్పి ఈ కేసును మరుగున పడేయవద్దని,ఆ గాయాలకు గల అసలు కారణాలను నిష్పక్షపాతంగా విచారించాలని డిమాండ్ చేశారు. పోలీసులు చెబుతున్న కథనంపై అనుమానాలు వ్యక్తం చేస్తూ వందలాది మంది విద్యార్థులు వీసీ ఛాంబర్‌ను ముట్టడించారు. సరైన కారణం చెప్పే వరకు కదిలేది లేదని భీష్మించుకోవడంతో వర్సిటీ ఆవరణలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. విద్యార్థుల ఆందోళన నేపథ్యంలో భారీగా పోలీసు బలగాలను మోహరించాల్సి వచ్చింది. విద్యార్థిని మృతికి చదువుల ఒత్తిడి కారణమా లేక మరేదైనా వేధింపులు ఉన్నాయా అన్న కోణంలో కూడా స్పష్టత ఇవ్వాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

**పోలీసుల లోతైన దర్యాప్తు...**

ఈ జంట మరణాలకు గల అసలు ప్రేరణ ఏంటి,వారి బంధానికి కుటుంబ సభ్యులు అంగీకరించలేదా లేక ఇతర వ్యక్తిగత కారణాలు ఏమైనా ఉన్నాయా అనే కోణంలో పోలీసులు ప్రస్తుతం లోతైన దర్యాప్తు జరుపుతున్నారు.వీరిద్దరూ బంధువులే అయినప్పటికీ వారిని దూరం పెట్టాలనుకోవడానికి గల కారణాలేంటని పోలీసులు ఆరా తీస్తున్నారు.గణేష్ చివరి ఫోన్ కాల్‌లో ఏం చెప్పాడు.వారి మధ్య ఎలాంటి సంభాషణ జరిగింది.అనే విషయాలను తెలుసుకోవడానికి ఫోన్ కాల్ డేటాను విశ్లేషిస్తున్నారు.చదువుల ఒత్తిడి కంటే వ్యక్తిగత సమస్యలే ప్రాణం తీశాయని అధికారులు చెబుతున్నప్పటికీ,విద్యార్థులు మాత్రం పూర్తిస్థాయి విచాఆరణ జరగాలని పట్టుబడుతున్నారు.ఈ విషాద ఘటన అటు బాసర క్యాంపస్‌లో,ఇటు మృతుల స్వగ్రామాల్లో తీరని వేదనను మిగిల్చింది.

# కళాకారులను అన్నివిధాలుగా ఆదుకోండి

● ప్రభుత్వానికి పలువురు వక్తలు విజ్ఞప్తి ● సమగ్ర సాంస్కృతిక విధానం – కళాకారులకు గుర్తింపు, హెల్త్‌కార్డులు, ఉద్యోగాలు' అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో సమగ్ర సాంస్కృతిక విధానాన్ని రూపకల్పన చేయడంతో పాటు కళారంగానికి తమ జీవితాలను అంకితం చేస్తూ సమాజాన్ని చైతన్యవంతం చేస్తున్న కళాకారులను అన్నివిధాలుగా ఆదుకోవాలని పలువురు వ్యక్తలు ప్రభుత్వాన్ని కోరారు. కళాకారులకు గుర్తింపు కార్డులు, హెల్త్ కార్డులు ఇవ్వడంతో పాటు క్రీడారంగానికి ఇస్తున్న కోటా తరహాలో సాంస్కృతిక రంగానికి కూడా కోటా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ప్రజా నాట్యమండలి ఆధ్వర్యంలో 'సమగ్రమైన సాంస్కృతిక విధానం – కళాకారులకు గుర్తింపు, హెల్త్‌కారులు, ఉద్యోగాలు' అంశంపై రౌండ్ టేండ్ సమావేశం బుధవారం హైదరాబాద్ హిమాయత్ నగర్‌లోని మగ్ధూంభవన్‌లో జరిగింది. తెలంగాణ ప్రజా నాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సాంస్కృతిక సలహామండలి సభ్యులు పల్లె నర్సింహా అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేనిసాంబశివరావు, తెలంగాణ మీడియా అకాడమి చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి, తెలంగాణ సాంస్కృతిక సారధి చైర్‌పర్సన్ డాక్టర్ జి.వి.వెన్నెల, సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం మాజీ వైస్ ఛాన్సలర్, ప్రముఖ కవి ఆచార్య ఎస్.వి.సత్యనారాయణ, ప్రముఖ సినీ నటులు మాదాల రవి, ప్రముఖ కవి యాకూబ్, కాంగ్రెస్ సాంస్కృతిక సేవా విభాగం అధ్యక్షులు, సాంస్కృతిక సలహామండలి సభ్యులు చక్రాల రఘు, దివాకర్, అభ్యుదయ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి రాపోలు సుదర్శన్, సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి బి.స్టాలిన్‌లు హాజరయ్యారు.

**రాష్ట్రంలో సమగ్ర సాంస్కృతిక విధాన రూప కల్పనకు కార్యాచరణ : వెన్నెల**

ప్రపంచం చరిత్రలోనే గోసి, గొంగడి కట్టి ఒక ఆట ఒక పాట, ఒక రచనతో ఒక రాష్ట్రాన్ని సాధించుకున్న చైతన్య వంతమైన సమాజం తెలంగాణ ప్రజలదని డాక్టర్ జి.వి.వెన్నెల అన్నారు. ఆలాంటి సాంస్కృతిక రంగం బలోపేతానికి సమగ్ర విధాన రూపకల్పనకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రక్రియ చేపట్టిందన్నారు. ఇందుకు సంబంధించిన విధివిధానాలపై ఒక నివేదికను సాంస్కృతిక సారధి ప్రభుత్వానికి సమర్పించినట్లు చెప్పారు. గత ప్రభుత్వం సాంస్కతిక రంగం రూపకల్పనకు ఏలాంటి చర్యలు చేపట్టలేకపోయిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సాంస్కతిక రంగానికి సంబంధించి ప్రతి జిల్లాలో కమిటీ ఏర్పాటు చేసి ఆ కమిటీ కలెక్టర్ నేతృత్వంలో కళాకారులను గుర్తించి వారికి గుర్తింపు కార్డులు అందజేయడం ద్వారా వారికి గౌరవాన్ని కల్పించి ఆర్థికంగా తోడ్పాటును అందించేందుకు చర్యలు చేపట్టిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మరో 550 మందికి కళాకారులకు ఉద్యోగాలు ఇవ్వాలని సంకల్పించిందని, ఇందుకు 2014 వరకు ఉన్న కళాకారులకు మాత్రమే అవకాశం కల్పించాలని నిర్ణయించినట్లు తెలిపారు.

**తెలంగాణ కళల కాణాచి, విప్లవాల పురిటిగడ్డ : కూనంనేని సాంబశివరావు**

తెలంగాణ అంటేనే కళలకు కాణాచి, విప్లవాలకు పురిటి గడ్డ అని కూనంనేని సాంబశివరావు అన్నారు. ఒక నాడు రాజ ప్రసాదాలకే పరిమితమైన సాంస్కృతిక రంగాన్ని ప్రజా కలలలో రూపంలో ప్రజల్లోకి తీసుకువచ్చిన చరిత్ర కమ్యూనిస్టులదని తెలిపారు. అదే పాట నిజాం నిరంకుశ పాలనలో ఆనాడు ప్రజలపై జరిగిన అన్ని రకాల అరాచకాలు, దాడులకు వ్యతిరేకంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం రూపంలో వచ్చిన తిరుగుబాటుకు ప్రేరణ అయిందన్నారు. మహోత్తరమైన సాంస్కృతిక రంగానికి సమగ్ర విధానం రూపకల్పనకు ఇప్పటివరకు ప్రభుత్వాలు చర్యలు చేపట్టకపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వం సమగ్ర సాంస్కృతిక విధానం తీసుకురావడంతో పాటు కళాకారుల సమస్యలను పరిష్కరించి వారికి ఆర్థిక తోడ్పాటును అందించే వరకు అవసరమైతే ఉద్యమాలను ఉధృతం చేయాలని సూచించారు.

**ప్రజా కళాకారులకు ప్రభుత్వం చేయూతను ఇవ్వాలి : కె.శ్రీనివాసరెడ్డి**

కళాకారులను, సినిమా, క్రీడారంగాలను ప్రోత్సహిస్తున్నట్లుగా ప్రజా కళాకారులను కూడా ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సహించాలని తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి అన్నారు. కళలు అంటే కేవలం సినిమా రంగం మాత్రమే కాదని, సామాజిక స్పృహతో గొంతెత్తి పాడే వారంతా కళాకారులేనని గుర్తు చేశారు. ప్రజా కళాకారుల పట్ల గత ప్రభుత్వం పాక్షికంగా, పూర్తి పక్షపాత దోరణితో పనిచేయడమే కాకుండా సాహిత్య రంగంలో వేసిన పుస్తకాల్లో కొన్ని అర్ధ సత్యాలు, మరిన్ని పూర్తి అసత్యాలు ఉన్నాయని శ్రీనివాస్ రెడ్డి చెప్పారు. సకల జనులు అనేక త్యాగాల తో సాధించుకున్న తెలంగాణ అసలు లక్ష్యం గత ప్రభుత్వం హాయంలో ప్రతిభింబించలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 1969లో తెలంగాణ ఉద్యమంలో విద్యార్థులు, ఉద్యోగుల పాత్ర ఉండగా, తుది దశ తెలంగాణ ఉద్యమంలో కళాకారుల కీలకపాత్ర పోషించారని, కళాకారులు తమ ఆట, పాటలతో ఈ సమాజాన్ని తట్టి లేపడం ద్వారానే తెలంగాణ రాష్ట్రం సాకారమైందన్నారు. తెలంగాణ ను సాధించామని చెప్పుకుంటున్న కొందరు తెలంగాణ పౌరుషమని వ్యాఖ్యానిస్తున్నారని, అది ఆనాడు కమ్యూనిస్టులు జరిపిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ఈ సమాజానికి ఇచ్చిన స్ఫూర్తి అని శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. సమసమాజం లక్ష్యం కోసం అడవి బాట పట్టి జనస్రవంతిలోకి వచ్చిన మావోయిస్టు పార్టీ అగ్రనేత రాజ్యాంగ పరిధిలో తమ రాజకీయాలు ఉంటాయని ప్రకటించడం ఓ గొప్ప సానుకూల పరిణామన్నారు.

**నిరంతర అధ్యయనం, నిర్విరామ కృషితోనే విజయం: ఎస్‌వి.సత్యనారాయణ**

కవులు, కళాకారులు నిరంతర అధ్యయనం, నిర్విరామ కృషితోనే సమాజాన్ని మేల్కొల్పడం సాధ్యమౌతుందని ఆచార్య ఎస్.వి.సత్యనారాయణ అన్నారు. సాహిత్యం, కళలు ఉద్యమాలను ప్రభావితం చేస్తాయని, ఇవి పరస్పర ప్రభావితాలన్నారు. దేశ స్వాతంత్ర్యోద్యమం కాని తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంగాని, తెలంగాణ తొలి, మలి, తుది దశ ఉద్యమం, ఇతర ఏ ఉద్యమమైనా సాంస్కృతిక, సాహిత్య రంగాల ప్రభావంతో నూతన ఉత్తేజాన్ని పొందాయన్నారు. ఏ దేశంలో కవులు, కళాకారుల సంఖ్య పెరుగుతుందో ఆ దేశంలో నేరస్తుల సంఖ్య తగ్గుతుందన్నారు. మాదాల రవి మాట్లాడుతూ ప్రజా కళలకు మించిన ఆయుధం ప్రపంచంలోనే లేదన్నారు. ఈ ప్రజా కళలే నిరంకుశ నిజాం రాజును తరిమి కొట్టేందుకు స్ఫూర్తిని నిచ్చిందన్నారు. కళాకారులకు ఆ పక్షం, ఈ పక్షం అనేది ఉండరాదని, వారు ఎప్పుడూ ప్రజాపక్షమే ఉండాలని సూచించారు. ఎక్కడ అన్యాయం జరిగితే అక్కడ డప్పు మోగించాల్సిన బాధ్యత కళాకారులదే అన్నారు. పల్లె నర్సింహ, కె.శ్రీనివాస్ మాట్లాడుతూ కళాకారులకు సరైన గుర్తింపు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గత 22 ఏళ్లుగా ఉద్యమం కొనసాగుతోందన్నారు. తెలంగాణ ఉద్యమంలో ప్రజా కళాల ద్వారా ప్రజలను చైతన్యం చేసిన కళాకారులకు అదే తెలంగాణలో పాలకులు తీవ్ర అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా కళాకారులను సమస్యలను పరిష్కరించాలని కోరారు.

యాకూబ్ మాట్లాడుతూ ప్రముఖ సాహిత్యకారులు, కళాకారుల పేరుతో కేరళ, కర్నాటక తదితర రాష్ట్రాల్లో స్మృతి కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలంగాణలో సైతం ఏర్పాటు చేయాలని కోరారు. చక్రాల రఘు, దివాకర్ మాట్లాడుతూ రౌండ్ టేండ్ సమావేశంలో ప్రజానాట్య మండలి లేవనెత్తిన కళాకారుల సమస్యల పరిష్కారాన్ని కోరుతున్నామని, తమ వైపు నుంచి కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళుతామని చెప్పారు. సమావేశంలో ప్రజా నాట్యమండలి కార్యవర్గ సభ్యులు ఉప్పలయ్య, నళిని, ప్రమీలతో పాటు వివిధ జిల్లాలకు చెందిన కళాకారులు పాల్గొన్నారు.



## నిలిచిపోయిన గొర్రెల పథకం వెంటనే అమలు చేయాలి

- పైలట్ ప్రాజెక్టుగా మునుగోడు నియోజకవర్గం ఎంపిక
- ఫ్రీజ్‌లో ఉన్న బ్యాంక్ ఖాతాలను అన్‌ఫ్రీజ్ చేయాలి
- మంత్రి వాకిటి శ్రీహరిని కలిసిన ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు, ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గొర్రెల పంపిణీ పథకాన్ని తక్షణమే అమలు చేసి, ఫ్రీజ్‌లో ఉన్న లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలను వెంటనే అన్‌ఫ్రీజ్ చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు, ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు మంగళవారం పశు సంవర్ధక, పాడి పరిశ్రమ అభివృద్ధి శాఖ మంత్రి వాకిటి శ్రీహరినికలసి వారు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు, నెల్లికంటి సత్యంలు మాట్లాడుతూ తెలంగాణలో యాదవ, కురుమ (గొల్ల) వర్గాల ఆర్థికాభివృద్ధి కోసం, వారి సాంప్రదాయ వృత్తులకు మద్దతు అందించేందుకు గత ప్రభుత్వం 75 శాతం సబ్సిడీతో గొర్రెల పంపిణీ పథకాన్ని ప్రారంభించిందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో వెనుకబడిన వర్గాల జీవితాల్లో సామాజిక, ఆర్థిక పరిపుష్టి సాధించడమే లక్ష్యంగా నల్లగొండ జిల్లా మునుగోడు నియోజకవర్గాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి, 20 గొర్రెలు + 1 పొట్టేలు (మొత్తం 21) కలిగిన యూనిట్‌ను 75 శాతం సబ్సిడీతో అందించేందుకు నిర్ణయించారని తెలిపారు. దీంతో ప్రతి యూనిట్‌కు లబ్ధిదారులు బ్యాంకుల్లో రూ.45,000 డిపాజిట్ చేసినట్లు చెప్పారు. అయితే మునుగోడు ఉప ఎన్నికల సమయంలో లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలను ఫ్రీజ్ చేయగా, ఇప్పటికీ వాటిని అన్‌ఫ్రీజ్ చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ఖాతాలు ఫ్రీజ్‌లో ఉండటంతో బ్యాంకు లావాదేవీలు నిలిచిపోయి, వ్యవసాయ కార్యకలాపాలు, పత్తి విక్రయాల ద్వారా వచ్చిన డబ్బులు కూడా వినియోగించుకోలేక కుటుంబాలు ఆర్థికంగా దెబ్బతింటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కాబట్టి ప్రభుత్వం తక్షణమే స్పందించి, అర్హులైన లబ్ధిదారుల ఖాతాలను అన్‌ఫ్రీజ్ చేసి, గొర్రెల పంపిణీ పథకాన్ని వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. పథకం అమలులో ఆలస్యం జరగకుండా స్పష్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐలయ్య యాదవ్, జగన్ యాదవ్, సురేష్ యాదవ్, అయోధ్య యాదవ్, వెంకటేశ్వర్లు యాదవ్, మంగ వెంకటేశ్వర్లు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# నిరాడంబరజీవి నల్లకన్ను

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు**

**నల్లకన్ను మరణం పట్ల పలువురు సిపిఐ నేతల సంతాపం**



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సిపిఐ అగ్ర నాయకులు, మాజీ జాతీయ కార్యదర్శి ఆర్.నల్లకన్ను మృతి పట్ల సిపిఐ నాయకులు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఆయన మరణం ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. నల్లకన్ను మరణం పార్టీకే కాకుండ దేశంలోని అణగారిన వర్గాలకు తీరని లోటు అని పేర్కొన్నారు. నల్లకన్ను మరణం సంతాప సూచికగా హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో పార్టీ అరుణ పతాకాన్ని అవనతం చేశారు. ఆయన చిత్రపటానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు నివాళ్లు అర్పించారు. సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్, ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్టా లక్ష్మణ్, తెలంగాణ రాష్ట్ర ప్రజా నాట్యమండలి జాతీయ నాయకులు కన్నం లక్ష్మినారాయణ, కొండలరావు, ఎఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రి శ్రీమాన్, సిపిఐ రాష్ట్ర కార్యాలయం కార్యదర్శి గోవింద్, రాష్ట్ర కార్యాలయ ఇన్‌చార్జ్ బోయ శ్రీరాములు, దశరథ్, బోడ అంజయ్య తదితరులు నివాళ్లు అర్పించిన వారిలో ఉన్నారు. నల్ల కన్ను మరణం పట్ల సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు సంతాపం తెలిపారు. ఆయన నిరాడంబర జీవి అని కొనియాడారు. నల్లకన్ను మృతిపట్ల సంతాపాన్ని వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు.

**కమ్యూనిస్టు పార్టీకి, తమిళనాడు రాష్ట్రానికి తీరని లోటు : నారాయణ**

సిపిఐ సీనియర్ నాయకులు స్వాతంత్ర పోరాట సమర యోధులు ఆర్. నల్లకన్ను మృతి యావత్ కమ్యూనిస్టు పార్టీకి, తమిళనాడు రాష్ట్రానికి తీరని లోటు అని సిపిఐ సెంట్రల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ తెలిపారు. 1925 వ సంవత్సరంలో పుట్టిన నల్లకన్ను భారత దేశ స్వాతంత్ర పోరాటం లో బ్రిటిష్ సైన్యానికి ముచ్చమటలు పట్టించారన్నారు. ఆ తరువాత మార్క్స్, లెనిన్ స్ఫూర్తితో కమ్యూనిస్టు పార్టీలో తనను విలీనం చేసుకొని వర్గ, కుల వివక్షకు వ్యతిరేకంగానూ, ప్రజా సమస్యల మీద అలుపెరుగని పోరాటం చేసిన ఎర్ర జెండా ముద్దుబిడ్డ అని కొనియాడారు. నల్లకన్ను మరణం తమిళనాడు రాష్ట్ర ప్రజల గుండెల్లో గాంధీగా పేరుపొందిన నల్లకన్ను లేరనే నిజాన్ని జీర్ణించుకోలేక పోతున్నారని డాక్టర్ కె.నారాయణ పేర్కొన్నారు.

**సిపిఐ అగ్ర నాయకులు నల్లకన్ను మృతి పట్ల శ్రీనివాసరావు సంతాపం**

తమిళనాడు గాంధీ, కమ్యూనిస్టు యోధుడు నల్లకన్ను మృతి పట్ల సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కల్లపల్లి శ్రీనివాసరావు ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. నల్లకన్ను తమ జీవితాంతం పేద ప్రజల కోసం, బడుగు జీవుల కోసం అనేక ఉద్యమాలు చేశారని, తమిళనాడు సిపిఐ రాష్ట్ర కార్యదర్శిగా, జాతీయ కార్యవర్గ సభ్యునిగా, తమ జీవితాన్ని అంకితం చేశారన్నారు. నల్ల కన్ను జీవితం, వారి నిరాడబరత్వం నేటి కమ్యూనిస్టులకు ఆదర్శం అని పేర్కొన్నారు.



ఢిల్లీలోని అజయ్ భవన్‌లో కామ్రేడ్ నల్లకన్ను చిత్రపటానికి నివాళులు అర్పించిన సిపిఐ జాతీయ కార్యదర్శులు పల్లా వెంకట్‌రెడ్డి, కె.రామకృష్ణ

**నల్ల కన్నుకు విప్లవ జోహార్లు : పశ్య పద్మ**

స్వాతంత్ర సమరయోధుడిగా సీనియర్ కమ్యూనిస్టు నాయకుడిగా సంఘసంస్కర్తగా నిరుపేద ప్రజల గుండె చప్పుడుకు ప్రతిస్పందనగా జీవితాన్ని కొనసాగించిన యోధుడు నల్లకన్ను మరణం దిగ్భ్రాంతికి గురి చేసిందని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ పేర్కొన్నారు. నేటి, భవిష్యత్తు తరాలకు మార్గదర్శకంగా నిలిచిన కమ్యూనిస్టు నాయకుడు ఆయన అని కొనియాడారు. నల్ల కన్ను మృతి కమ్యూనిస్టు శ్రేణులకు, దేశ ప్రజలకు తీరనిలోటు అంటూ విప్లవ జోహార్లు అర్పించారు.

**ఆశయాలను ముందుకు తీసుకెళ్తాం: ఎఐవైఎఫ్**

అణగారిన వర్గాల కోసం నల్లకన్ను తన జీవితాన్ని అంకితం చేశారని ఎఐవైఎఫ్ రాష్ట్రఅధ్యక్షుడు వల్లి ఉల్లా ఖాద్రీ, కార్యదర్శి కల్లూరు ధర్మేంధ్ర అన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని వారు అన్నారు.

## అక్షర చిట్‌ఫండ్ బాధితులను ఆదుకోవాలి

● నిందితులను అరెస్టు చేయడంతో పాటు ఆస్తులు జప్తు చేయాలి ● డిజిపిని కలిసి ఫిర్యాదు చేసిన అక్షర చిట్‌ఫండ్ కంపెనీ బాధితుల సంఘం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఖాతాదారుల నుంచి డిపాజిట్లు వసూలు చేసి మోసగించిన అక్షర చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్, అక్షర టౌన్‌షిప్స్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థలపై కఠిన చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని అక్షర చిట్‌ఫండ్ కంపెనీల బాధితుల సంఘం నేతలు తెలంగాణ డిజిపి బి.శివధర్‌రెడ్డిని బుధవారం కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు డిజిపికి వినతిపత్రం అందించారు. డిజిపిని కలిసిన వారిలో అక్షర చిట్‌ఫండ్ కంపెనీల బాధితుల సంఘం గౌరవ అధ్యక్షురాలు పశ్యపద్మ, ప్రధాన కార్యదర్శి వజ్రాల అరుణ, వి.కొండా రెడ్డి, తులసి,మధుసూదన్‌లతో పాటు తదిరులున్నారు. ఈ సందర్భంగా పశ్య పద్మ మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా ఈ రెండు సంస్థలకు ఉన్న ఆస్తులను స్వాధీనం చేసుకోవాలని డిజిపిని కోరారు. ఈ కేసును సమగ్రంగా దర్యాప్తు చేసి, పరారీలో ఉన్న నిర్వాహకులను సైతం వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. పైసంస్థలు తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 60కి పైగా బ్రాంచ్‌లను ఏర్పాటు చేసి, సాధారణ ప్రజల నమ్మకాన్ని ఉపయోగించుకుని చిట్‌ఫండ్ వ్యాపారం, 'భూమిలో అవిభక్త వాటా కొనుగోలు అడ్వాన్స్ పేరుతో డిపాజిట్ స్కీంలను ప్రవేశపెట్టి ఖాతాదారుల నుంచి అక్రమంగా కోట్లాది రూపాయలను డిపాజిట్లు వసూలు చేశారని డిజిపి దృష్టికి తీసుకొచ్చారు. చిట్‌ఫండ్ చట్టం 1982ను ఈ సంస్థలు ఉల్లంఘించాయని పశ్యపద్మ తెలిపారు. నిందితులు కూడా ప్రస్తుతం పరారీలో ఉన్నారని, వెంటనే వారందరిని అరెస్టు చేయాలని ఆమె డిజిపి దృష్టికి తీసుకెళ్లారు.దర్యాప్తు అధికారులు కరీంనగర్ జిల్లాలో ఆ సంస్థలకు చెందిన నామమాత్రం ఆస్తిని మాత్రమే జప్తు చేశారని, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వారి ఆస్తులను జప్తు చేయాలని డిజిపికి సూచించారు. ముఖ్యంగా బ్రాంచ్ మేనేజర్లు, రీజినల్ మేనేజర్లను కూడా నిందితుల జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు.

# ఎఐఎస్‌ఎఫ్‌లో మహిళా విద్యార్థులు








● ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్రకోశాధికారిగా నాగజ్యోతి రెండవసారి ఎన్నిక ● రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా కండె విజేత, బొజ్జ జ్యోతి, ● బసవాడ శైలజ, కట్టి శ్రావణి, అనూష, రాజేశ్వరి, అనూష, శ్రీహారిక

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్‌ఎఫ్) తెలంగాణ రాష్ట్ర కోశాధికారిగా కాసోజు నాగ జ్యోతి రెండవసారి ఎన్నికయ్యారు. నిజామాబాద్‌లో జరిగిన ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర 4వ మహాసభలో నూతన నాయకత్వాన్ని ఎన్నుకున్నారు. ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యులుగా కండె విజేత, బొజ్జ జ్యోతి, బసవాడ శైలజ, కట్టి శ్రావణి, అనూష, రాజేశ్వరి, అనూష, శ్రీ హారిక ఎన్నికయ్యారు. విద్యార్థినుల హక్కులు, భద్రత, విద్యార్థునులకు మెరుగైన సదుపాయాల కోసం ఉద్యమాలను ఉధృతం చేస్తామని వారు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం విద్యారంగం ప్రమాదంలో ఉందని, విద్యార్థుల సమస్యలపై మరింత ఉధృతమైన ఉద్యమాలు అవసరమని ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కోశాధికారిగా నాగ జ్యోతి అన్నారు. హాస్టళ్లు, కాలేజీలలో విద్యార్థినిలకు రక్షణ లేకుండా పోయిందని, మెరుగైన విద్య పేద విద్యార్థులకు అందని స్థితికి చేరుతూ అసమానతలు పెరుగుతున్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ విద్యా విధానంతో విద్యారంగం కార్పొరేట్ల చేతుల్లోకి వెళ్తోందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విద్యా సంస్థలు నిర్వీర్యం అవుతుండగా, ఫీజుల పెంపు, ప్రైవేటీకరణ వల్ల పేద విద్యార్థులు తీవ్రమైన సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. విద్యార్థినులు భద్రతా లోపాలు, హాస్టళ్లలో మౌలిక సదుపాయాల కొరత, స్కాలర్‌షిప్‌ల ఆలస్యం కారణంగా చదువుకు దూరమవుతున్నారని నాగజ్యోతి తెలిపారు.





# మార్చి 1 నుంచి 23 వరకు ఎఐవైఎఫ్ యువజనోత్సవాలు

భగత్ సింగ్ స్ఫూర్తితో మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడుదాం

గోడ పత్రిక ఆవిష్కరణలో ఎఐవైఎఫ్ నాయకులు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేశం కోసం ప్రాణాలర్పించిన షహీద్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్‌ల 95వ వర్ధంతి సందర్భంగా అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) తెలంగాణ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా యువజనోత్సవాలను (స్టాప్ డ్రగ్స్, స్టార్ట్ స్పోర్ట్స్, క్రికెట్, కబడ్డీ, వాలీబాల్ పోటీలు,వ్యాసరచన, చిత్రలేఖన, ఉపన్యాస పోటీలు, రక్తదాన శిబిరాలు, యువ కవి, గాయకుల సమ్మేళనం, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రముఖుల సందేశాలు) మార్చి 1 నుంచి 23 వరకు నిర్వహించనున్నామని, ఈ కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రికను బుధవారం హిమాయత్ నగర్‌లోని సత్య నారాయణ రెడ్డి భవన్‌లో రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్రలు మాట్లాడుతూ షహీద్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్‌లు దేశ స్వాతంత్ర్యం కోసం ఉరికొయ్యలను సైతం లెక్కచేయకుండా, భవిష్యత్తు తరాల కోసం బ్రిటీష్ ముష్కరులను ఎదిరించి, వీరోచిత పోరాటాలు చేసి వీరమరణం పొందరన్నారు. కానీ, భగత్ సింగ్ కలలుగన్న స్వరాజ్య ఆకాంక్షలకు అనుగుణంగా నేటి విద్యార్థులు, యువత పయనించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దేశానికే ఆదర్శప్రాయుడైన భగత్ సింగ్ స్ఫూర్తితో నేటి యువత చెడు మార్గాలను, చెడు అలవాట్లను విడనాడాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ బిజ్జ శ్రీనివాసులు, టి.సత్య ప్రసాద్, పేరబోయిన మహేందర్, యుగంధర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు షేక్ మహమూద్, సల్మాన్ బేగ్, పి.శివ కుమార్, ఎల్లంకి మహేష్, మార్కపూరి సూర్య, మానస్ కుమార్, సురేందర్, మస్క సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ -II, సర్కిల్-44, మెట్టుగూడ.
'ఇ' ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ నోటీసు
NIT No. 07/EE-II/Cir.44/SBZ/GHMC/2025-26 తేది: 24.02.2026
పని పేరు: జిహెచ్‌ఎంసి, ఎస్‌బిజెడ్, మెట్టుగూడ, సర్కిల్-44లో (1) వివిధ ప్రదేశాలలో దెబ్బతిన్న BT స్ట్రెచ్‌ల రీకార్పెటింగ్ కోసం ప్రతిపాదనలు, (2) జోనల్ ఆఫీస్ భవనం (మారేడ్‌పల్లి)లో జాన్సన్ మేక్ లిఫ్ట్‌ల నిర్వహణ & సర్వీసింగ్ అందించడం, (3) జంగిల్ క్లియరెన్స్, ఫ్లోరింగ్ మరియు వైట్ వాషింగ్‌కు హాజరు కావడం (హనుమాన్ జయంతి-2026 దృష్ట్యా). **అంచనా విలువ / ఇసివి :** రూ.44.04 లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం:** 26.02.2026న మ.2.00గం.ల నుండి 02.03.2026న మ.2.00గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, సర్కిల్-44, మెట్టుగూడ, జిహెచ్‌ఎంసి, సికింద్రాబాద్ జోన్. సెల్ నెం. 9704405076. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా@https://www.tender.eprocurement.gov.in లో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, సర్కిల్-44, మెట్టుగూడ, సికింద్రాబాద్ జోన్, జిహెచ్‌ఎంసి.
DIPR R.O. No. : 15977-PP/CL/ADVT/1/2025-26, Date: 25-02-2026


దేవాదాయ ధర్మాదాయ శాఖ
**శ్రీ మల్లికార్జునస్వామి దేవస్థానం**
ఓదెల గ్రామం & మండలం, పెద్దపల్లి జిల్లా.
లేఖ నెం. SMSD/2026 వేలము ప్రకటన తేది: 18.02.2026
ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా తేది: 28-02-2026 శనివారం రోజున ఉదయం 10-00 గం.ల నుండి దేవాలయ ఆవరణలో 2026-27 సంవత్సరమునకు గాను **1)** తలనీలాలు (ధరావత్తు రూ.80,000/-) & **2)** కొబ్బరి ముక్కలు (1,00,000/-) ప్రోగు చేసుకొనుటకు, **3)** కొబ్బరి & గుమ్మడి కాయలు (4,00,000/-), **4)** కిరాణా & పూజాసామాను (7,50,000/-), **5)** ప్యాలాలు - పుట్నాలు (50,000/-), **6)** వంట చెరుకు (1,00,000/-), **7)** కూల్ డ్రింక్స్ (1,00,000/-), **8)** పూలు & పూల దండలు (3,00,000/-), **9)** వాహనాల పార్కింగ్ (3,50,000/-), **10)** తల్లి ఆరాధన (30,000/-), **11)** హోటల్ నడుపుకొను హక్కు (1,00,000/-), **12)** స్వీట్ హౌజ్ నడుపుకొను హక్కు (1,00,000/-), **13)** మానియార్ సామాగ్రి అమ్ముకొను హక్కు (1,00,000/-), **14)** గాజులు అమ్ముకొను హక్కు (1,00,000/-), **15)** దేవుని ఫోటోలు అమ్ముకొను హక్కు (1,00,000/-), **16)** వంట పాత్రలు అమ్ముకొను హక్కు (1,00,000/-), లైసెన్స్ హక్కుల కొరకు టెండరు కం బహిరంగ వేలం నిర్వహించబడును.
ఔత్సాహికులు **తేది: 28-02-2026 ఉదయం 10:00 గం.ల లోపు 500/-** చెల్లించి ధరఖాస్తు ఫారం పొందవలెను. ధరావత్తు సొమ్ము నగదు రూపేణా లేదా శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థానము, ఓదెల పేరున డి.డి. (డిమాండ్ డ్రాఫ్ట్) తీసుకొని టెండరు ఫారానికి జతపరిచి ఉదయం 10-00 గం.ల నుండి 12-00 గం.ల వరకు టెండర్ బాక్స్‌లో వేయగలరు. ఇతర వివరములకై దేవస్థాన కార్యాలయములో సంప్రదించగలరు.
కార్యనిర్వాహణాధికారి
DIPR R.O. No. : 15974-PP/CL/ADVT/1/2025-26, Date: 25-02-2026




## బంజారాల ఆరాధ్య దైవం సేవాలాల్

### ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట** : బంజారాల ఆరాధ్య దైవం, అహింసావాది సంత్ సేవాలాల్ మహరాజ్ బోధనలు సమాజానికి మార్గదర్శకమని తెలంగాణ ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పేర్కొన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం మల్లాపూర్ గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున నిర్వహించిన సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్ హాజరయ్యారు. ఉత్సవాల్లో భాగంగా ముందుగా గిరిజన సంప్రదాయ పద్ధతుల్లో భోగ్ బండార్ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో బీర్ల అయిలయ్య మాట్లాడుతూ గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలను కాపాడిన మహనీయుడు సేవాలాల్ మహరాజ్ అని, గిరిజనులను అహింస వైపు నడిపించడంలో ఆయన కృషి వెలకట్టలేనిదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ అయినాల చైతన్య మహేందర్ రెడ్డి, అడిషనల్ కలెక్టర్ భాస్కర్ రావు, ఆర్డీవో కృష్ణ రెడ్డి, డీఆర్డీఓ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. గిరిజన మహిళల సాంప్రదాయ నృత్యాల మధ్య వేడుకలు అత్యంత వైభవంగా సాగాయి.

## మనిషిని మార్చే శక్తి పుస్తకానిదే



**ప్రజాపక్షం/చౌటుప్పల్** : స్థానిక మున్సిపల్ కేంద్రంలో ఏర్పాటు చేసిన సంచార నవచేతన పుస్తక బస్సును సిపిఐ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్లె శేఖర్ రెడ్డి మాట్లాడుతూ పుస్తకం మనిషిని మార్చే శక్తి కలిగిన ఆయుధమని, జ్ఞానం పెరిగితేనే సమాజం ముందుకు వెళుతుందని ప్రతి గ్రామానికి పుస్తకాలు చేరాలని పేర్కొన్నారు. సాధారణ జ్ఞానం సాహిత్య గ్రంథాలను విస్తృతంగా చదవాలని సూచించారు. చదువుల పట్ల ఆసక్తి పెంచడానికి సంచార గ్రంథాలయాలు ఎంతో ఉపయోగకరమని అభిప్రాయపడ్డారు. గ్రామాల్లోకి పుస్తకాలు తీసుకువచ్చే ప్రయత్నం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మున్సిపల్ కార్యదర్శి పగిళ్ల మోహన్ రెడ్డి, ఉడత రామలింగం, కొండూరు విప్లవ్, బద్దుల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి : కలెక్టర్



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** ఇందిరమ్మ ఇండ్లను త్వరితగతిన పూర్తి చేసి త్వరలో ప్రారంభించేందుకు అందుబాటులోకి తీసుకరావాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. బుధవారం హుజూర్‌నగర్ లోని పణిగిరి రామస్వామి గుట్ట వద్ద ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్లను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల పెండింగ్ పనులను త్వరలో పూర్తి చేయాలని అవసరమైతే రాత్రి పగలు కూడా ఎక్కువ మంది పని చేసి వారిని తీసుకుని పనులు పూర్తి చేసి ప్రారంభించడానికి సిద్ధ పర్చాలని బ్లాక్ మధ్యలో గల అంతర్గత రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, విద్యుత్ సరఫరా, మొక్కలు నాటడం, పెయింటింగ్ పనులు, స్ట్రీట్ లైట్స్ మొదలైన రకాల పెండింగ్ పనులను పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్లను, అధికారులను కలెక్టర్ అదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాసగౌడ్, వైస్ చైర్మన్ తన్నీరు మల్లికార్జున్‌రావు, హౌసింగ్ పిడి సిద్దార్థ, జిల్లా హార్టికల్చర్ అధికారి నాగయ్య, మిషన్ భగీరథ ఇఇ కరుణాకర్‌రెడ్డి, తహసిల్దార్ కవిత పాల్గొన్నారు.

## రబీ ధాన్యం సేకరణకు ముందస్తు ఏర్పాట్లు



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : రబీ సీజన్ ధాన్యం సేకరణకు 2025/26 అవసరమైన అన్ని ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ సంబంధిత అధికారులను ఆదేశించారు.బుధవారం తన చాంబర్లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో సుమారు 8 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉన్నందున కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, గన్నీ బ్యాగుల సమీకరణ, తూకం పరికరాలు, తేమ కొలిచే యంత్రాలు, హమాలీలు,లారీలు తదితర అంశాల్లో ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమీపంలోనే సౌకర్యాలు కల్పించాలని, తాగునీరు, టెంట్లు, టాయిలెట్ వసతులు కల్పించాలని తెలిపారు. పౌరసరఫరాలు, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖలు సమన్వయంతో పనిచేసి పారదర్శకంగా కొనుగోళ్లు నిర్వహించాలని ఆదేశించారు.సమావేశంలో డిఆర్‌డిఓ శేఖర్ రెడ్డి, డిఎస్‌ఓ వెంకటేశం,డిఎంఓ రామ్ పతి నాయక్, మార్కెటింగ్ ఎడి ఛాయాదేవి,బిసిఓ పద్య నాయక్ లీగల్ మెట్రోలాజికల్ అధికారులు శ్రీనివాస్,రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షులు నారాయణ,శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

## అపహరణకు గురైన హుండీ

**ప్రజాపక్షం/మర్రిగూడ:** కేంద్రంలోని శ్రీశంభు రామలింగేశ్వర స్వామి ఆలయంలో హుండీ చోరీకి గురైనట్లు ఆలయ నిర్వాహకులు ఎల్ వి శర్మ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.నాలుగు రోజుల క్రితం శ్రీశంభు రామలింగేశ్వర స్వామి జాతర కార్యక్రమం ముగిసింది. ఇందులో భాగంగా గర్భగుడి ముందున్న హుండీని గుర్తుతెలియని వ్యక్తులు డబ్బులు,హుండీతో సహా మంగళవారం రాత్రి అపహరణకు గురైనట్లు ఆలయ పూజారి మాజీ ఎంపీటీసీ రామారావు,బిసి సంఘం నాయకులు చెరుకు శ్రీరాములు గౌడ్,పోలీస్ స్టేషన్‌లో వ్రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు.

## హనుమంత వాహనంపై 'రామ' నృసింహుడు!

### యాదగిరి లక్ష్మీ నృసింహుడి బ్రహ్మోత్సవాల్లో వైభవం



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట** : నమో నారసింహ.. జయ జయ రామ.. స్మరణలతో యాదగిరి క్షేత్రం మారుమోగింది. కృష్ణశిలల గర్భాలయం నుంచి వెలువడిన శ్రీలక్ష్మీ నరసింహా స్వామి వారు వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీరామ అలంకారంలో భక్తులను పరవశింపజేశారు. భక్తాగ్రేసరుడైన ఆంజనేయుడిపై అధిష్ఠించి, తన 'రామ' తత్వాన్ని చాటుతూ తిరువీధుల్లో విహరించారు. ఉదయం ఆలయ అర్చకులు, వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య స్వామివారిని శ్రీరాముడిగా ముస్తాబు చేశారు. వాల్మీకి రామాయణంలో చెప్పబడిన 'రిపూణాం అపి వత్సలః' (శత్రువుల పట్ల కూడా దయ చూపేవాడు) అనే గుణాన్ని ప్రతిబింబించేలా ఈ అలంకరణ సాగింది. సీతమ్మ వారు రావణుడితో రాముని పరాక్రమాన్ని వివరిస్తూ.. రాముడిని 'నృసింహ భీమ సంకాశం' అని అభివర్ణించారు. అంటే నృసింహస్వామి అంతటి భీకర పరాక్రమవంతుడని అర్థం. ఈ రహస్యాన్ని చాటుతూ నేడు స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. రామదూత, స్వామికి అత్యంత ప్రీతిపాత్రుడైన హనుమంతుడిపై స్వామివారు ఊరేగుతుంటే, క్షేత్రమంతా భక్తి పారవశ్యంలో మునిగిపోయింది. సాయంత్రం వేళ నిత్యారాధనల అనంతరం స్వామివారు, అమ్మవార్లతో కలిసి గజవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఐరావతం వంటి గజంపై జగన్నాథుడు ఊరేగుతున్న తీరు అద్వితీయం.

లోకంలో సింహం (నరసింహుడు), గజం (ఏనుగు) సహజ శత్రువులు. కానీ భగవంతుని సన్నిధిలో ఏ ప్రాణికైనా వైర భావం ఉండదు. 'వైర భావాన్ని వీడి, లోకమంతా శాంతియుతంగా ఉండాలి' అనే గొప్ప ధర్మ సందేశాన్ని ఈ గజవాహన సేవ చాటిచెప్పింది. ఈ విశేష ఉత్సవాల్లో ఆలయ ఇఒ జె. భవానీశంకర్, జిల్లా కలెక్టర్ ఎమ్. హనుమంతరావు, ఆలయ అనువంశిక ధర్మకర్త బి. నరసింహామూర్తి తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన వేలాది మంది భక్తులు స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించి పునీతులయ్యారు.

నేటి విశేషం: బ్రహ్మోత్సవాలలో భాగంగా రేపు స్వామివారు మత్స్యావతార అలంకారంలో దర్శనమివ్వనున్నారు. రాత్రికి శ్రీ లక్ష్మీ నరసింహా స్వామి వారి దివ్య రథోత్సవం కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించడానికి అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

## మొదటి రోజు ప్రశాంతం

### 431 మంది పరీక్షకు డుమ్మా

### ఇంటర్ పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్‌తేజస్ నందలాల్ పవార్, ఎస్పి





**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** మొదటి రోజు బుధవారం తెలుగు, సాంస్కృతం, ఉర్దూ ఇంటర్ పరీక్షలు జిల్లావ్యాప్తంగా ప్రశాంతంగా జరిగాయి. జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, జిల్లా ఎస్పి కె నరసింహులు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. మొత్తం విద్యార్థులు 8,831 మంది పరీక్షలకు హాజరు కావల్సి ఉంది. ఇందులో జనరల్ 7,164, ఒకేషనల్ 1,667 మంది కాగా జనరల్‌లో 257, ఒకేషనల్‌లో 174 మంది మొత్తం 431 మంది పరీక్షకు డుమ్మా కొట్టారు. దీంతో జనరల్‌లో 6,907, ఒకేషనల్‌లో 1,493 పరీక్షలకు హాజరైనట్లు జిల్లా ఇంటర్ బోర్డు అధికారి వి. భాను నాయక్ అధికారికంగా ప్రకటించారు. సూర్యాపేట పట్టణంలోని నారాయణ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ బుధవారం తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రంలోని పలు తరగతి గదులలో పరీక్ష జరుగుతున్న తీరును, పరీక్షా కేంద్రంలో కల్పించిన సౌకర్యాలను అడిగి అక్కడి పరిసరాలను పరిశీలించారు. సిసి కెమెరాల నిఘాలో ప్రశ్నాపత్రాలను ఓపెన్ చేసి ఇన్విజిలెటర్లకు అందజేసే గదిని, పరీక్షా కేంద్రంలో పరీక్షల నిర్వహణ సజావుగా ఉండేలా చర్యలు చేపట్టాలని, పరీక్షల నిర్వహణకు సంబంధించిన పలు సూచనలను చేశారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో ప్రారంభమైన ఇంటర్ వార్షిక పరీక్షల సరళిని జిల్లా ఎస్పి కె నరసింహ పరీక్షా కేంద్రాలకు వెళ్ళి పరిశీలించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని నారాయణ జూనియర్ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాట్లు, విధులు నిర్వహిస్తున్న ఎగ్జామినేషన్ సెంటర్ సిబ్బందికి, పోలీసు సిబ్బందికి సూచనలు సలహాలు అందించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల వద్ద నిషేధ ఆజ్ఞలు 144 సెక్షన్ అమలు చేస్తున్నామని తెలిపారు. పటిష్ట పోలీసు బందోబస్తు నడుమ ప్రశాంతంగా పరీక్షలు కొనసాగుతాయని తెలిపారు. నిషేధ ఆజ్ఞలు ఉన్నందున పరీక్ష కేంద్ర పరిసరాల్లో లౌడ్ స్పీకర్లు, మైకులు, వాహన హారన్‌లు ఉపయోగించరాదని కోరారు. జిరాక్స్ సెంటర్స్, ఇంటర్‌నెట్ కేంద్రాలు మూసివేయాలని సూచించారు. విద్యార్థులు ఒత్తిడికి గురవకుండా పరీక్షలు రాసి మంచి ఫలితాలు సాధించాలన్నారు. ఎస్పి వెంట పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, ఎస్ఐలు శివతేజ, మహేంద్రనాథ్, ఎగ్జామినేషన్ సిబ్బంది ఉన్నారు.

## నకిలీ కంటి వైద్యుల గుట్టురట్టు

### ఐదుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలింపు

### డిఎస్‌పి రాజశేఖర్‌రాజు వెల్లడి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణంలో నకిలీ సర్టిఫికెట్ల ద్వారా కంటి ఆసుపత్రిని నిర్వహిస్తూ ప్రజలను మోసం చేస్తున్న ఐదుగురు నకిలీ వైద్యులను పట్టుకోని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు తెలిపారు. బుధవారం మిర్యాలగూడలోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని డాక్టర్స్ కాలనీలో ఇటీవల తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ఆఫీసర్ల బృందం తనిఖీలు చేపట్టి నకిలీ కంటి వైద్యుల వ్యవహారం గుర్తించినట్లు తెలిపారు. వేములపల్లి మండలం రావులపెంట గ్రామానికి చెందిన పజ్జూరి వికాస్ కుమార్ డిగ్రీ డిస్‌కంటిన్యూ చేశాడు. 2007 నుంచి 2009 వరకు సరోజినిదేవి కంటి ఆసుపత్రిలో డిఏవో కోర్స్ చేసి అనంతరం హైద్రాబాద్‌లో ట్రాన్స్ ఐ, శ్రీ నేత్రాలయలో ఆప్తాల్మిక్ ఆసిస్టెంట్‌గా ఐదేళ్లు, అదేవిధంగా మిర్యాలగూడ హనుమాన్ ఐ క్లినిక్‌లో ఆరేళ్లు పని చేశాడు. ఈ క్రమంలో ఆప్తాల్మిక్ అసిస్టెంట్‌గా పనిచేసేది వదిలేసి 2021లో మిర్యాలగూడలో శ్రీ మహాలక్ష్మి కంటి ఆసుపత్రిని స్థాపించి నాటి నుంచి ఆప్తాల్మిక్ డాక్టర్‌గా పేషెంట్లన పరిచయం చేసుకుంటూ చికిత్స చేస్తున్నాడు. ఆయన ప్రారంభించిన శ్రీ మహాలక్ష్మి కంటి ఆసుపత్రిలో స్పెషలిస్ట్ ఆప్తాల్మిక్ కన్సల్టెంట్‌ను నియమించి అతని పేరి ప్రిస్క్రిప్షన్లను ప్రింట్ చేయించారు. ఆ స్పెషలిస్ట్ కంటి డాక్టర్ వచ్చి ట్రీట్మెంట్ చేస్తున్నట్లుగా నమ్మించారు. ఈ నేపథ్యంలో గత ఏడాది జూన్ 8న కంటి సమస్యపై బైరెడ్డి పద్మ అనే మహిళ ఆసుపత్రికి వచ్చింది. కుడి కన్నును పరీక్షించి కంటిలో చుక్క ఉందని సర్జరీ చేయాలని నిర్ణయించిన వికాస్ కుమార్ డాక్టర్ పిలిపించి టెస్టులు కంప్లీట్ అయ్యాయని సర్జరీ ఖచ్చితంగా చేయాలని సూచిస్తూ అదే రోజు మధ్యాహ్నం సర్జరీ చేయించాడు. సర్జరీ అనంతరం మరుసటి రోజు తన కుడి కన్ను పూర్తిగా కనిపించడం లేదని చెప్పగా వికాస్ కుమార్ డాక్టర్‌కు చెప్పకుండా అతని ప్రిస్క్రిప్షన్‌పై కొన్ని మందులు రాసి ఇచ్చాడు. ఫలితంగా ఆ మహిళ కంటి చూపు పూర్తిగా మందగించింది. ఈ తరహాలో అర్హత లేకుండా నకిలీ వైద్యాన్ని అందించిన తీరుపై అదేవిధంగా తెలంగాణ మెడికల్ కౌన్సిల్ అధికారులు మిర్యాలగూడ పట్టణంలోని డాక్టర్స్ కాలనీలో గల శ్రీ మహాలక్ష్మి, శాలిని, యశస్వి, అన్నపూర్ణ, రూఫా కంటి ఆసుపత్రులను తనిఖీ చేసి వారు ఆప్తాల్మిక్ డాక్టర్లు కాదని వారికి ఆధునీక వైద్యం, నేత్ర వైద్యం చేసే అర్హత లేదని పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆప్తాల్మిక్ డాక్టర్లుగా చెప్పుకుంటూ చలామాణి అవుతున్న వల్కి శ్రీను, పెమ్మి వెంకటేష్, బాణావత్ శివ కోటేశ్వర్‌రావు, పజ్జూరి వికాస్ కుమార్, గడ్డం నాగరాజులపై చేసిన ఫిర్యాదుల మేరకు విచారణ చేపట్టి ఆరుగురిలో ఐదుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించినట్లు చెప్పారు. సమావేశంలో సీఐలు నాగభూషణరావు, సోమనర్సయ్య సిబ్బంది ఉన్నారు.

## డ్రైవర్లు డిఫెన్సివ్ డ్రైవింగ్ చేయాలి

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** వాహనాలను నడిపే డ్రైవర్లు డిఫెన్సివ్ డ్రైవింగ్ చేయాలని సూర్యాపేట జిల్లా ఎస్పి కె.నర్సింహ అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ వాహనదారులు గమ్యం చేరడమే ప్రధాన లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర పోలీస్ డిజిపి ప్రారంభించిన ఆరైవ్, అలైవ్ మహా ఉద్యమం కార్యక్రమం 2వ విడత అవగాహన కార్యక్రమంలో భాగంగా బుధవారం హుజూర్‌నగర్ సర్కిల్ పోలీసుల ఆధ్వర్యంలో టౌన్ హాల్‌లో నిర్వహించిన వివిధ రకాల వాహన డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షల వైద్య శిబిరాన్ని సూర్యాపేట జిల్లా ఎస్పి కె.నర్సింహ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పి మాట్లాడుతూ డ్రైవర్ వృత్తి చాల కష్టతరమైన పని అని, ఈ వృత్తిని ఎంచుకుని నిర్విరామంగా కష్టపడుతూ డ్రైవర్లు ఆరోగ్యాలను లెక్క చేయలేకపోతున్నారని అన్నారు. ఈ శిబిరంలో 500 మందికి పైగా డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక డిఎస్‌పి శ్రీనివాసరెడ్డి, సిఐ చరమందరాజు, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్‌పెక్టర్ రామారావు, స్థానిక ఎస్ఐ బండి మోహన్‌బాబు, గరిడేపల్లి ఎస్ఐ నరేష్, పాలకవీడు ఎస్ఐ కోటేష్, హుజూర్‌నగర్ ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ ప్రవీణ్‌కుమార్, మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ జిలానీ, డాక్టర్లు నాగేంద్రర్, స్థానిక కంటి ఆసుపత్రి డాక్టర్ ప్రవళిక, లైయన్స్ క్లబ్ డాక్టర్లు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.




## సోలార్ సిస్టం ఏర్పాట్లపై పరిశీలన

### నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్

**ప్రజాపక్షం /హాలియా:** పాఠశాల నిర్వహణ, ఉపాధ్యాయుల బోధనా తీరు ..పాఠశాలలో అమర్చిన తాగునీటి కుళాయిలు... మూత్ర శాలలు ఇలా పాఠశాలలో ఉన్న అన్ని సౌకర్యాలపై జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ ఆకస్మికంగా తనిఖీ చేపట్టి ఉపాధ్యాయులకు చెమటలు పట్టించారు. మండలంలోని అనుములలో గల పాఠశాలను జిల్లా కలెక్టర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. అనుముల గ్రామానికి మంజూరైన సోలార్ సిస్టం ఏర్పాటు పై ప్రజలలో ఉన్న వివిధ సందేహాలను అడిగి తీర్చారు. ముందుగా ప్రాథమిక పాఠశాలలో ప్రభుత్వ నిధులతో ఏర్పాటుచేసిన అన్ని సౌకర్యాలను ప్రత్యక్షంగా పరిశీలించి అందులో ఉన్న లోపాలకు గల కారణాలను ఉపాధ్యాయులను అడిగారు. పాఠశాలలో శుభ్రత, పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. తరగతి గదులు శుభ్రంగా ఉన్నాయా లేదా అని గదులు తిరిగి చూశారు. తాగునీటి కుళాయిలు సక్రమంగా పనిచేస్తున్నాయా లేదా అనే అంశంపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. చిన్నారులకు వ్యక్తిగత పరిశుభ్రత ఎంతో అవసరమని వారితో ముచ్చటించి దానిపై అవగాహన కల్పించారు. అనంతరం రెడ్కో ద్వారా పైలెట్ పద్ధతిన అనుముల గ్రామానికి మంజూరైన రూఫ్ టాప్ సోలార్ సిస్టం ఏర్పాట్లపై గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. రూఫ్ టాప్ సోలార్ సిస్టం మంజూరైన గృహ జ్యోతి లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి రూట్ టాప్ సోలార్ సిస్టం ఏర్పాటు గురించి మహిళలను అడిగారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ చింతల చంద్ర రెడ్డి, వైస్ చైర్మన్ గౌని రాజా రమేష్, తాసిల్దార్ రఘు, రెడ్ కో జిల్లా మేనేజర్ సంతోష్ ట్రాన్స్కో అధికారులు తదితరులు పాల్గొన్నారు.



**రూఫ్‌టాప్ సోలార్ పనులు వేగవంతం**

పైలట్ గ్రామాల్లో మార్చి మొదటి వారంలోపు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశం పైలట్ పద్ధతిలో ఎంపిక చేసిన గ్రామాల్లో గృహ జ్యోతి లబ్ధిదారులకు అమలు చేస్తున్న రూఫ్‌టాప్ సోలార్ సిస్టమ్ ఏర్పాటు పనులను మార్చి మొదటి వారం లోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశించారు. బుధవారం కనగల్ మండలంలోని కనగల్ గ్రామంలో టిఎస్ రెడ్‌కో ఆధ్వర్యంలో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు.జిల్లాలో కనగల్, హాలియా,ముదిగొండ గ్రామాలు పైలట్ పద్ధతిలో ఎంపికయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా 81 గ్రామాల్లో అమలు చేయనున్న ఈ పథకంలో జిల్లా నుంచి మూడు గ్రామాలు చోటు దక్కించుకున్నాయి.




## వ్యవసాయ రుణాల వార్షిక బడ్జెట్ రూ.3915.15కోట్లు లక్ష్యంగా...

### 9 నెలల వ్యవధిలో రూ.3568.08కోట్ల వృద్ధి : కలెక్టర్

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : వ్యవసాయ రుణాల వార్షిక బడ్జెట్ రూ.3915.15 కోట్ల లక్ష్యంగా 9 నెలల వ్యవధిలో రూ.3568.08 కోట్ల వృద్ధి సాధించినట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు. బుధవారం తాను చైర్మన్‌గా, లీడ్ బ్యాంక్ మేనేజర్ వెంకట నాగప్రసాద్ కన్వీనర్‌గా 2025 26 ఆర్థిక సంవత్సర మూడవ త్రైమాసికకు సంబంధించి డిసిసి బ్యాంకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యవసాయ రుణాలలో వార్షిక బడ్జెట్‌లో ప్రధానంగా వ్యవసాయ రుణాలు ఎక్కువగా ఇవ్వడం జరిగిందన్నారు. దీర్ఘకాలిక వ్యవసాయ రుణాలలో వార్షిక బడ్జెట్ రూ.2999.48 కోట్లు లక్ష్యంగా పెట్టుకుంటే ఇందులో 9 నెలల వ్యవధిలో రూ.3075.68 కోట్లు వృద్ధి సాధించారన్నారు. ప్రాధాన్యత రంగాలలో వార్షిక బడ్జెట్ రూ.9723.13కోట్లు లక్ష్యంగా పెట్టుకుంటే ఇందులో 9 నెలల వ్యవధిలో రూ.7826.27 కోట్లు ప్రజలకు అందించి 80.49శాతం వృద్ధి సాధించారని మొత్తం వ్యవసాయ రుణాలు వార్షిక బడ్జెట్ రూ.6914.63 కోట్లు లక్ష్యంగా పెట్టుకుంటే ఇందులో రూ.6643.76కోట్లు ప్రజలకు అందించి 96.08 శాతం వృద్ధి సాధించారని వివరించారు. మొత్తం జిల్లా వార్షిక ప్రణాళికలో వార్షిక బడ్జెట్ రూ.11919.74 కోట్లు లక్ష్యంగా పెట్టుకుంటే ఈ బడ్జెట్‌లో రూ.10541.35 కోట్లు ప్రజలకు అందించి 88.44 శాతం వృద్ధి సాధించారని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కె సీతారామారావు, ఆర్‌బిఐ ఎల్‌డిఓ గోమతి, నాబార్డ్ జిల్లా మేనేజర్ రవీంద్ర నాయక్, ఎస్‌బిఐ రీజినల్ మేనేజర్ అనిల్ కుమార్, యూనియన్ బ్యాంక్ డిజిఎం సుధాకర్ రావు, ప్రసన్న కుమార్, శంకర్ రావు, జిల్లా పరిశ్రమల అధికారి సీతారాం నాయక్, సంక్షేమ అధికారులు శంకర్, నరసింహ, నరసింహారావు, జిల్లాలోని రీజినల్ బ్యాంకు మేనేజర్లు హాజరయ్యారు.

## విద్యార్థుల సౌకర్యాలపై రాజీ లేదు

### ఇంటర్ పరీక్ష కేంద్రాలపై కలెక్టర్ చంద్రశేఖర్ ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం/నలగొండ** : జిల్లాలో బుధవారం నుంచి ప్రారంభమైన ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణను పరిశీలించేందుకు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పరీక్ష కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.పరీక్షల నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా,విద్యార్థులకు పూర్తి సౌకర్యాలు కల్పించాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్, విద్యార్థుల హాజరు, తాగునీరు,టాయిలెట్లు, క్లాక్ రూమ్ సౌకర్యాలు, ప్రశ్నపత్రాలు ఆన్సర్ షీట్ల భద్రత వంటి అంశాలపై సమగ్రంగా ఆరా తీశారు.జిల్లాలో ఎక్కడా మాల్ ప్రాక్టీస్ జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.పరీక్షలకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్నా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్ 18004251442 కు సమాచారం అందించవచ్చని తెలిపారు.జిల్లా వ్యాప్తంగా మార్చి 18 వరకు జరిగే ఈ పరీక్షలు ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించబడతాయి.మొదటి రోజు జిల్లాలోని అన్ని కేంద్రాల్లో కలిపి 97 శాతం హాజరు నమోదైనట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి దస్రు నాయక్ తెలిపారు.

## కంటి చూపు సరిగా లేకనే ప్రమాదాలు

### డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య శిబిరం:ఎస్పి శరత్ చంద్ర పవార్




**ప్రజాపక్షం/మాడుగులపల్లి** : డ్రైవర్‌కు కంటి చూపు సరిగా లేకపోతే ప్రమాదాలు సంభవించే అవకాశం ఎక్కువగా ఉంటుందని, ప్రతి డ్రైవర్ నిర్దిష్ట కాల వ్యవధిలో కంటి పరీక్షలు చేయించుకోవాలని జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ సూచించారు.తెలంగాణ పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అరైవ్ అలైవ్ కార్యక్రమం భాగంగా మాడుగులపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈసందర్భంగా డ్రైవర్లకు ప్రత్యేకంగా ఉచిత నేత్ర పరీక్షలు నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పి మాట్లాడుతూ నిర్లక్ష్య డ్రైవింగ్, అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం,హెల్మెట్ సీట్‌బెల్ట్ వినియోగం లేకపోవడం వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు.వాహనం నడిపే ముందు సాంకేతిక పరిస్థితి తనిఖీ చేయాలని,మొబైల్ ఫోన్ ఉపయోగించకూడదని, అలసటతో డ్రైవింగ్ చేయవద్దని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ డిఎస్‌పి రాజశేఖర్ రాజు,ఎస్‌బి సీఐ రాము,మిర్యాలగూడ రూరల్ సీఐ పిఎన్‌డి ప్రసాద్,మాడుగులపల్లి ఎస్‌పి కృష్ణ,డిటిఆర్‌బి రిటైర్ సీఐ అంజయ్య పాల్గొన్నారు.

### ఇజ్రాయెల్ పర్యటనలో...

# ప్రధాని మోదీకి 'రెడ్ కార్పెట్' స్వాగతం

**విమానాశ్రయానికి తన సతీమణితో కలిసివచ్చిన ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ**

**ఆత్మీయ ఆలింగనం చేసుకుని ఉబ్బితబ్బిబ్బయిన ఇరుదేశాల ప్రధానులు**



**టెల్ అవీవ్ :** ఇజ్రాయెల్‌భారతదేశం మధ్య స్నేహ బంధం మరింత వికసించనుంది. ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూ ఆహ్వానంపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ రెండు రోజుల పర్యటన కోసం బుధవారం ఇజ్రాయెల్ దేశంలోని టెల్ అవీవ్‌కు చేరుకున్నారు. టెల్ అవీవ్ ఇజ్రాయెల్ దేశ ఆర్థిక, సాంస్కృతిక, సాంకేతిక హబ్‌గా పేరొందింది. మోదీ తన పర్యటనలో భాగంగా బెన్ గురియన్ విమానాశ్రయం చేరుకోగా అక్కడ ఆయనకు ఘనంగా రెడ్‌కార్పెట్ స్వాగతం, గార్డ్ ఆఫ్ హానర్ లభించింది. తన సతీమణి సారా నెతన్యాహూతో విమానాశ్రయానికి వచ్చిన బెంజమిన్ నెతన్యాహూ మోదీని స్వయ ంగా కలుసుకుని హృదయపూర్వక ఘన స్వాగతం పలికారు. ఇరు దేశాల ప్రధానమంత్రులు వారి వ్యక్తిగత సాన్నిహిత్యానికి గుర్తుగా ఆత్మీయ ఆలింగనంతో సంతోషంతో ఉబ్బితబ్బిబ్బయ్యారు. భారతదేశానికి ఇజ్రాయెల్ రాయబారి రూవెన్ అజార్ కూడా హాజరయ్యారు. రెండు దేశాల మధ్య 'బలమైన, బహుముఖ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడం' లక్ష్యంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ పర్యటనలో పాల్గొన్నారు. తొమ్మిదేళ్లలో మోదీ ఇజ్రాయెల్ పర్యటన ఇది రెండవ సారి. ఆయన తొలి పర్యటన 2017లో జరిగింది. ఈ పర్యటన ఒక గొప్ప మైలురాయిగా నిలిచింది. ద్వైపాక్షిక సంబంధాలు, వ్యూహాత్మక భాగస్వామ్యానికి సోపానంగా నిలిచింది. భారత్‌ఇజ్రాయెల్ దేశాల మధ్య సహకారాన్ని మరింతగా పంచుకునే వేదిక ఏర్పాటుకు మార్గం సుగమమైంది. ఇజ్రాయెల్ పర్యటనకు ముందు ప్రధానమంత్రి మోదీ మాట్లాడుతూ భారతదేశంఇజ్రాయెల్ దేశాల మధ్య స్నేహ బంధం ఇటీవలి సంవత్సరాలలో అద్భుతమైనవృద్ధి, డైనమిజానికి సాక్ష్యంగా నిలిచిందన్న విశ్వాసాన్ని వ్యక్తంచేశారు. ఈ పర్యటన శాశ్వత బంధాలను ఏకీకృతం చేస్తుందని, భాగస్వామ్యం కోసం కొత్త లక్ష్యాలను నిర్దేశిస్తుందని తెలిపారు. స్థితిస్థాపకమైన, వినూత్నమైన భవిష్యత్తు కోసం ఒక దార్శనికతను ముందుకు తీసుకెళుతుందన్న ఆశాభావాన్ని మోదీ వ్యక్తపరిచారు. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం, ఆవిష్కరణలు, వ్యవసాయం, నీటి నిర్వహణ, రక్షణ, సెక్యూరిటీ, ట్రేడ్, ఇన్వెస్ట్‌మెంట్, ఇరు దేశాల ప్రజల మధ్య సంబంధాలను విస్తరించడంపై నెతన్యాహూతో చర్చల కోసం ఎదురుచూస్తున్నానని ప్రధానమంత్రి నరేంద్రమోదీ చెప్పారు. కీలకమైన ప్రాంతీయ, ప్రపంచ పరిణమాలపై ఇరుదేశాల ప్రధానమంత్రులు చర్చించే అవకాశం ఉంది. ఈ పర్యటనలో భాగంగా భారత ప్రధాని మోదీ ఇజ్రాయెల్ ప్రెసిడెంట్ ఐజక్ హెర్జోగ్‌ను కలవనున్నారు.ఇజ్రాయెల్ పార్లమెంట్ నెస్సెట్‌కు హాజరై మోదీ ప్రసంగించనున్నారు. ఇజ్రాయెల్ పార్లమెంట్ నెస్సెట్‌కు హాజరై ప్రసంగించిన పక్షంలో అలా చేసిన తొలిప్రధానమంత్రి మోదీ చరిత్ర కెక్కనున్నారు. ప్రసంగానికి ముందు ఆయన నెతన్యాహూతో సమావేశం కానున్నారు. గురువారం ఇరు దేశాల ప్రధానుల మధ్య విస్తృత చర్చలు జరుగనున్నాయి. అమెరికాఇరాన్ మధ్య సంబంధాలు సహా మధ్య ప్రాచ్యం(మిడిల్ ఈస్ట్)లో కొనసాగుతున్న ఉద్రిక్తతల మధ్య భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇదిలాఉంటే గత కొంతకాలంగా భారతదేశంఇజ్రాయెల్ ఇరుదేశాల మధ్య వాణిజ్యంపెట్టుబడి సంబంధాలు స్థిరంగా అభివృద్ధి చెందుతున్నదశలో ముందుకు సాగడం విశేషం. నవంబర్‌లో భారతదేశ వాణిజ్య శాఖ మంత్రి పియూష్ గోయల్ ఇజ్రాయెల్ పర్యటన సందర్భంగా ఒక ఉచిత వాణిజ్య ఒప్పందంపై చర్చలు ప్రారంభించడానికి సంబంధించిన నిబంధనలపై ఇరుదేశాలు సంతకాలు చేశాయి. ఇరుపక్షాలు ఆర్థిక సహకారాన్ని మరింత విస్తరించడానికి సెప్టెంబరులో ద్వైపాక్షిక ఒప్పందంపై సంతకం చేశాయి. ఇరు దేశాల ప్రజల మధ్య సంబంధాల బలోపేతం ఒప్పందంలో భాగంగా ఉన్నాయి. ఇజ్రాయెల్‌లో 41,000 మందికి పైగా ఉన్న ప్రవాస భారతీయులు దైపాక్షిక సద్భావన, ఒప్పందానికి గణనీయంగా దోహదపడుతున్నారు.

# ఇల్లంతా నోట్ల కట్టలే!

**ప్రభుత్వ అధికారి ఇంట్లో రూ.4 కోట్ల నగదు స్వాధీనం**

**చరిత్రలో ఇదే తొలిసారి!**



**భువనేశ్వర్ :** ఒడిశాలో ఓ చిన్న లంచం కేసు దర్యాప్తు భారీ అవినీతి కుంభకోణాన్ని బయట పెట్టింది. రూ.30వేల లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ప్రభుత్వ అధికారి ఇంట్లో కోట్ల రూపాయల నగదు లభించడంతో రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేగింది. విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్న నగదు పరిమాణం చూసి వారు కూడా ఆశ్చర్యానికి గురయ్యారు. ఒడిశాలోని కటక్ సర్కిల్ గనులశాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న దేబబ్రత మహంతి అవినీతి ఆరోపణలపై అరెస్టయ్యాడు. లైసెన్స్ పొందిన ఓ బొగ్గు వ్యాపారి నుంచి డిపో నిర్వహణ, రవాణా అనుమతుల కోసం రూ.30వేల లంచం డిమాండ్ చేసినట్లు ఫిర్యాదు అందడంతో ఒడిశా విజిలెన్స్ డైరెక్టరేట్ అధికారులు ఉచ్చు వేశారు. మంగళవారం రాత్రి లంచం తీసుకుంటున్న సమయంలోనే ఆయనను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అరెస్టు అనంతరం కేసు నమోదు చేసి, బుధవారం ఉదయం నుంచి మూడు చోట్ల ఏకకాలంలో సోదాలు చేపట్టారు. భువనేశ్వర్‌లోని ఆయన నివాస ఫ్లాట్, భద్రక్ జిల్లాలోని స్వగ్రామ ఇల్లు, అలాగే కటక్‌లోని కార్యాలయంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సోదాల్లో బయటపడిన నగదు చూసి అధికారులు షాక్‌కు గురయ్యారు. భువనేశ్వర్‌లోని అపార్ట్‌మెంట్‌లో ట్రాలీ బ్యాగులు, అల్మారాలు, డ్రాయర్లలో దాచి పెట్టిన నగదును లెక్కించగా రూ.4 కోట్లకు పైగా ఉన్నట్లు గుర్తించారు. లెక్కల్లో చూపించని ఈ మొత్తం నగదును స్వాధీనం చేసుకున్నారు. ఇంకా లెక్కింపు ప్రక్రియ కొనసాగుతుందని విజిలెన్స్ వర్గాలు తెలిపాయి. అదనంగా ఆయన కార్యాలయంలోని డ్రాయర్‌లో మరో రూ.1.20 లక్షల నగదు కూడా పట్టుబడింది. ఇదే కాకుండా మహంతికి చెందిన మరిన్ని ఆస్తులు కూడా వెలుగులోకి వచ్చాయి. భువనేశ్వర్ సమీపంలోని పహాలా ప్రాంతంలో సుమారు 2,400 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న రెండంతస్తుల భవనం, దాదాపు 130 గ్రాముల బంగారు ఆభరణాలను అధికారులు గుర్తించారు. ఇవన్నీ ఆయన అధికారిక ఆదాయానికి మించి ఉన్నాయని అనుమానిస్తున్నారు. స్థిర, చరాస్తుల పూర్తి వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. విజిలెన్స్ అధికారులు చెబుతున్న ప్రకారం, ఒడిశా చరిత్రలో ఒకే అధికారి ఇంటి నుంచి ఇంత పెద్ద మొత్తంలో నగదు స్వాధీనం కావడం ఇదే తొలి సారి. గతంలో కూడా పలువురు అధికారులపై సోదాలు జరిగి కోట్లు బయటపడినప్పటికీ, ఈ స్థాయి నగదు ఎప్పుడూ దొరకలేదని పేర్కొన్నారు. మహంతి ఉద్యోగ ప్రస్థానం కూడా పరిశీలనలోకి వచ్చింది. 2004లో జూనియర్ మైనింగ్ ఆఫీసర్‌గా ప్రభుత్వ సేవలో చేరిన ఆయన బాలంగీర్, బారిపడ, బెర్హాంపూర్, కటక్, భువనేశ్వర్ తదితర ప్రాంతాల్లో విధులు నిర్వర్తించారు. తరువాత ప్రమోషన్లు పొందుతూ ఇటీవలే కటక్ సర్కిల్ డిప్యూటీ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. అయితే కొద్ది కాలంలోనే అవినీతి ఆరోపణలతో చిక్కుకోవడం సంచలనంగా మారింది. భువనేశ్వర్ విజిలెన్స్ విభాగం ఎస్‌పి సరోజ్ కుమార్ సామల్ మీడియాతో మాట్లాడుతూ, మహంతిని స్పెషల్ విజిలెన్స్ కోర్టులో హాజరుపరుస్తామని, అతని ఆస్తులపై సమగ్ర విచారణ చేపడతామని తెలిపారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేసి మరిన్ని వివరాలు సేకరిస్తున్నామని చెప్పారు. రూ.30 వేల లంచం కేసుతో మొదలైన ఈ దర్యాప్తు కోట్ల రూపాయల అక్రమ సంపాదనను బయటపెట్టడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ప్రభుత్వ శాఖల్లో అవినీతి ఎంతగా వేర్లు వేసిందనే ప్రశ్న మళ్లీ ముందుకు వచ్చింది. విజిలెన్స్ శాఖ చర్యలతో ఇతర అవినీతి అధికారులకు ఇది గట్టి హెచ్చరికగా మారింది.

## ఐవైసి నేతల అరెస్టు సిగ్గుచేటు

**కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా**



**న్యూఢిల్లీ :** ప్రజల గొంతును వినిపించినందుకు యూత్ కాంగ్రెస్ కార్యకర్తలపై తీసుకున్న చర్య తీవ్ర ఖండించదగినది, సిగ్గుచేటు అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ప్రభుత్వం ప్రపంచ ఒత్తిడికి తలొగ్గి భారతదేశ ప్రయోజనాలపై రాజీ పడడానికి వ్యతిరేకంగా గళం వినిపించడం 1.4 బిలియన్ల భారతీయుల ప్రయోజనాల కోసం అని ఆమె చెప్పారు. గత వారం ఎఐ సమ్మిట్ వద్ద అర్ధనగ్న నిరసనకు ప్రధాన కుట్రదారు, 'సూత్రధారిగా ఇండియన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఉదయ్ భాను చిబ్ అని ఆరోపిస్తూ ఢిల్లీ పోలీసులు అతన్ని అరెస్టు చేసిన విషయం తెలిసిందే. కోర్టు అతనికి నాలుగు రోజుల కస్టడీ విధించింది. 'సత్యం కోసం శాంతియుత, అహింసా ప్రతిఘటన మన గర్వించదగిన వారసత్వం, ఇది మహాత్మా గాంధీ, లక్షలాది మంది భారతీయ పూర్వీకుల నుండి వారసత్వంగా వచ్చింది' అని ప్రియాంక బుధవారం ఎక్స్‌లో పోస్టు చేశారు. 'ప్రపంచ ఒత్తిడికి తలొగ్గి భారతదేశ ప్రయోజనాలపై రాజీ పడిన ప్రధాన మంత్రి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళం వినిపించడం 1.4 బిలియన్ల భారతీయుల ప్రయోజనాల కోసమే అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ యువజన కాంగ్రెస్ నిర్భయ కార్యకర్తలకు అండగా నిలుస్తుందన్నారు.

### ఛత్తీస్‌గఢ్‌లో లొంగిపోయేందుకు

# మరో ఇద్దరు మావోయిస్టులు సంసిద్ధత



**కాంకేర్ :** ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్ జిల్లాలో ఒక సీనియర్ కార్యకర్తతో సహా ఇద్దరు మావోయిస్టులు హింసను విరమించుకోవాలని నిర్ణయించుకున్నారని, లొంగిపోవడానికి భద్రతా దళాలను సంప్రదించారని పోలీసులు బుధవారం తెలిపారు. గత రెండు సంవత్సరాలలో రాష్ట్రంలో 2,700 మందికి పైగా నక్సలైట్లు ఆయుధాలు విడిచిపెట్టారు. సిపిఐ (మావోయిస్ట్) డివిజనల్ కమిటీ సభ్యుడు మల్లేష్, మరొక పార్టీ సభ్యుడు రాను పోడియం ఇటీవల కాంకేర్ పోలీసులను, సరిహద్దు భద్రతా దళాన్ని (బిఎస్‌ఎఫ్) సంప్రదించి లొంగిపోవడానికి, ప్రభుత్వ పునరావాస విధానాన్ని ఉపయోగించుకోవడానికి తమ సంసిద్ధతను వ్యక్తం చేశారని పోలీసు సూపరింటెండెంట్ నిఖిల్ రఖేచా తెలిపారు. మల్లేష్, పోడియం వెల్లడించిన సమాచారం ఆధారంగా ఈ ప్రాంతంలోని ఇతర క్రియాశీల మావోయిస్టు కార్యకర్తలతో సంబంధాలు ఏర్పరచుకోవడానికి, వారిని ప్రధాన స్రవంతిలో చేరమని ప్రోత్సహించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. మావోయిస్టుల ఉత్తర బస్తర్ విభాగానికి చెందిన మల్లేష్, పోడియంలను సామాజిక ప్రధాన స్రవంతిలోకి తిరిగి చేర్చడం, అధికారికంగా ఆయుధాలను అప్పగించడం తరువాత జరుగుతుందని ఆయన అన్నారు. బస్తర్ రేంజ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సుందర్‌రాజ్ పట్టిలింగం మావోయిస్టు కార్యకర్తలకు హింసను విడనాడి ప్రధాన స్రవంతిలోకి తిరిగి రావాలని విజ్ఞప్తి చేశారు. శాంతియుతమైన, గౌరవప్రదమైన జీవితాన్ని గడపడానికి ముందుకు వచ్చే వారికి రాష్ట్ర ప్రభుత్వ లొంగుబాటు, పునరావాస విధానం కింద అన్ని సహాయం అందించబడుతుందని ఆయన అన్నారు. పొరుగున ఉన్న తెలంగాణలో మావోయిస్టుల పొలిట్‌బ్యూరో సభ్యుడు దేవుజీ అలియాస్ తిప్పిరి తిరుపతి, మరో ముగ్గురు సీనియర్ కార్యకర్తల లొంగుబాటు వామపక్ష తీవ్రవాదం (ఎల్‌డబ్ల్యుఇ)పై పోరాటంలో ఒక కీలకమైన క్షణాన్ని సూచిస్తుందని ఐజిపి మంగళవారం అన్నారు. మావోయిస్ట్ నాయకత్వ నిర్మాణం క్రమంగా బలహీనపడటం సంస్థ చివరికి పతనానికి, దశాబ్దాలుగా సాగిన రక్తపాతానికి ముగింపు పలికిందని ఆయన అన్నారు. గత రెండు సంవత్సరాలలో, ఛత్తీస్‌గఢ్‌లో 532 మంది మావోయిస్టులను తటస్థీకరించారు. 2,704 మంది లొంగిపోయారు. 2,004 మందిని అరెస్టు చేసినట్లు అధికారులు తెలిపారు.

## ఢిల్లీలో దారుణం..

**భార్య, ముగ్గురు పిల్లలను చంపి భర్త పరార్**

**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలో అత్యంత దారుణమైన ఘటన జరిగింది. ఇంట్లో నిద్రిస్తున్న మహిళ, మూడు, నాలుగు, ఐదేళ్ల వయసున్న ఆమె ముగ్గురు పిల్లలు హత్యకు గురయ్యారు. మృతురాలి భర్త పరారీలో ఉన్నాడు. దాంతో అతడే భార్యబిడ్డలను చంపి పారిపోయి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. మంగళవారం అర్ధరాత్రి చందన్ పార్క్ ఏరియాలో ఈ విషాదకర ఘటన చోటుచేసుకుంది. చందన్ పార్క్ ఏరియాలో ముంచన్ కెవాత్ తన భార్య, ముగ్గురు పిల్లలతో నివసిస్తున్నాడు. ఆజాద్‌పూర్ మండిలో కూరగాయలు విక్రయిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో బుధవారం ఉదయం స్థానికులు వారి ఇంటికి వెళ్లి చూసేసరికి.. ముంచన్ భార్య, ముగ్గురు చిన్నారులు రక్తపు మడుగులో విగతజీవులై పడిఉండటం కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా వారు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. హంతకుడు పదునైన ఆయుధంతో వారి గొంతు కోసి చంపేసినట్లు గుర్తించారు. బాధితులు నిద్రలో ఉండగానే ఈ దాడి జరిగిందని, వారు ప్రతిఘటించే అవకాశం లేకుండా నిందితుడు ఈ ఘాతుకానికి పాల్పడ్డాడని ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ఘటన జరిగినప్పటి నుంచి ముంచన్ పరారీలో ఉన్నాడు. అతని ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తుండటంతో కుటుంబ కలహాల కారణంగానే అతడు ఈ దారుణానికి ఒడిగట్టి ఉంటాడని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం తరలించిన అధికారులు, ప్రత్యేక బృందాలతో హంతకుడి కోసం వేట ప్రారంభించారు. సమీపంలోని సిసి టివి దృశ్యాలను సేకరించి నిందితుడి జాడ కోసం వెతుకుతున్నారు.

## ఐడిఎఫ్‌సి 'ఫస్ట్' బ్యాంక్‌లో మోసం

**నలుగురు అరెస్టు**

**చండీగఢ్ :** ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ చండీగఢ్ బ్రాంచ్‌లో 590 కోట్ల రూపాయలు మోసానికి గురైన సంగతి తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి యాంటీ కరప్షన్ బ్యూరో అధికారులు దర్యాప్తును వేగవంతం చేశారు. కేసుతో సంబంధం ఉన్న నలుగురు వ్యక్తుల్ని అరెస్ట్ చేశారు. మాజీ బ్రాంచ్ మేనేజర్ రిభవ్ రిషి, మాజీ రిలేషన్‌షిప్ మేనేజర్ అభయ్, రిభవ్ భార్య స్వాతీ సింగ్లా, ఆమె సోదరుడు అభిషేక్ సింగ్లాలను పోలీసులు అరెస్ట్ చేశారు.
రిభవ్, అభయ్‌లు ప్రధాన నిందితులని అధికారులు తెలిపారు. యాంటీ కరప్షన్ బ్యూరో అధికారులు చెబుతున్న దాని ప్రకారం.. రిభవ్, అభయ్‌లు హర్యానా గవర్నమెంట్ డిపార్ట్‌మెంట్స్‌కు సంబంధించిన ఖాతాల్లోని డబ్బులను టార్గెట్ చేశారు. ఆ డబ్బులను స్వాతీ సింగ్లాకు చెందిన కంపెనీ 'స్వస్తిక్ దేశ్ ప్రాజెక్ట్'కు బదిలీ చేశారు. ఈ కంపెనీ షేర్స్‌లో స్వాతి 75 శాతం వాటా కలిగి ఉంది. మిగిలిన 25 శాతం షేర్స్ అభిషేక్ పేరు మీద ఉన్నాయి. నిందితులిద్దరూ దాదాపు 300 కోట్ల రూపాయలు కంపెనీకి మళ్లించారు. ఆరు నెలల క్రితం బ్యాంక్‌లో ఉద్యోగాలు మానేశారు. హార్యానా ప్రభుత్వానికి చెందిన ఓ డిపార్ట్‌మెంట్ ఆ బ్యాంక్‌లోని తమ ఖాతాను క్లోజ్ చేసి, డబ్బును వేరే బ్యాంక్ ఖాతాలోకి పంపాలని కోరింది. ప్రాసెస్ చేస్తున్న సమయంలో బ్యాంక్ అధికారులు మోసాన్ని గుర్తించారు.
రికార్డ్సలో ఉన్న డబ్బు మొత్తానికి.. బ్యాంక్ ఖాతాలో ఉన్న మొత్తానికి తేడా కనుగొన్నారు. ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ చండీగఢ్ బ్రాంచ్‌లో 590 కోట్ల రూపాయల మోసం జరిగినట్లు ఆదివారం బ్యాంక్ అధికారులు మీడియాకు వెల్లడించారు. ఈ సంఘటనపై దర్యాప్తు చేపట్టిన ఇన్వెస్టిగేషన్ అధికారులు మాజీ బ్రాంచ్ మేనేజర్, మాజీ రిలేషన్‌షిప్ మేనేజర్‌లు ఈ మోసానికి పాల్పడినట్లు గుర్తించారు. వారితో పాటు మరో ఇద్దరిని కూడా అరెస్ట్ చేశారు.

# లగ్జరీ టూర్‌కు బిఎస్‌ఎన్‌ఎల్ అధికారి ప్లాన్..

**షో కాజ్ నోటీస్ జారీ**

**న్యూఢిల్లీ :** బిఎస్‌ఎన్‌ఎల్ అధికారి ఒకరు లగ్జరీ టూర్‌కు ప్లాన్ వేశారు. కుటుంబ సమేత పర్యటన కోసం 50 మంది అధికారులను కేటాయించారు. పలు వాహనాలు, బాత్ కిట్లు, షేవింగ్ కిట్లు, టవల్స్‌తో పాటు లోదుస్తులు వంటివి ఏర్పాట్లు చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఇది వైరల్ కావడంతో కేంద్ర ప్రభుత్వం స్పందించింది. ఆయనకు షో కాజ్ నోటీస్ జారీ చేసింది. 1987 బ్యాచ్ టెలికమ్యూనికేషన్ సర్వీస్ ఆఫీసర్ వివేక్ బంజాల్, బిఎస్‌ఎన్‌ఎల్‌లో డైరెక్టర్. ఫిబ్రవరి 25, 26 తేదీల్లో ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో కుటుంబంతో కలిసి ఆధ్యాత్మిక పర్యటన చేయాలని ఆయన నిర్ణయించారు. కాగా, బిఎస్‌ఎన్‌ఎల్ డైరెక్టర్ వివేక్ బంజాల్, ప్రయాగ్‌రాజ్ పర్యటన కోసం విస్తృత, విలాసవంతమైన ఏర్పాట్లు చేయాలంటూ ఫిబ్రవరి 19న ఆదేశాలు జారీ అయ్యాయి. అందులో పాయింట్ టు పాయింట్ ప్రోటోకాల్ పాటించాలని పేర్కొన్నారు. 50 మందికి పైగా బిఎస్‌ఎన్‌ఎల్ అధికారులు, సిబ్బందికి నిర్దిష్ట బాధ్యతలు అప్పగించారు. ఆ అధికారి ప్రయాణం, ఆతిథ్య ఏర్పాట్లు, స్నానాల వద్ద సౌకర్యాలు, ఆలయాల సందర్శన సమయంలో సమన్వయం గురించి ప్రస్తావించారు. మరోవైపు ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణి సంగమం వద్ద పురుషులు, మహిళల స్నానాల కోసం 8 బాత్ కిట్లు, షేవింగ్ సెట్లు, టవల్స్, లోదుస్తులు, హెయిర్ ఆయిల్, దువ్వెనలు, పేస్ట్‌లు, బ్రష్‌లు వంటి వ్యక్తిగత సంరక్షణ వస్తువులు, వాటర్ బాటిల్స్, స్నాక్స్, రిఫ్రెష్‌మెంట్‌లు, భోజనాలు, ఫొటోగ్రఫీ, ఎస్కార్ట్ సేవలు వంటి ఇతర సౌకర్యాలు, ఏర్పాట్లు చేయాలని బిఎస్‌ఎన్‌ఎల్ అధికారులకు ఆదేశాలు అందాయి. అయితే ఈ ఆర్డర్ కాపీ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఒకవైపు బిఎస్‌ఎన్‌ఎల్ అప్పుల్లో కూరుకుపోగా ఆ సంస్థ డైరెక్టర్ లగ్జరీ టూర్‌కు విస్తృత ఏర్పాట్లపై విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ప్రయాగ్‌రాజ్ పర్యటనను వివేక్ బంజాల్ రద్దు చేసుకున్నారు. కేంద్ర కమ్యూనికేషన్ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా దీనిపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇది ఆమోదయోగ్యం కాదని అన్నారు. ఏడు రోజుల్లో వివరణ ఇవ్వాలంటూ షో కాజ్ నోటీస్ జారీ చేసినట్లు చెప్పారు. ఆయనపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

### బాసర ట్రిపుల్ ఐటిలో

# భారీ నిధుల కుంభకోణం?

**రూ.57కోట్ల లెక్కలపై వీడని మిస్టరీ..?**

**విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం..!**




**ప్రజాపక్షం/నిర్మల్ :** రాష్ట్రంలోనే ప్రతిష్టాత్మకమైన విద్యాసంస్థగా పేరుగాంచిన బాసర ట్రిపుల్ ఐటి (ఆర్.జి.యు.కె.టి) ఇప్పుడు వివాదాలకు నిలయంగా మారింది. అక్షర లక్షల ఆశలతో అడుగుపెట్టిన వేలాది మంది గ్రామీణ విద్యార్థుల భవిష్యత్తు సాక్షిగా..వర్సిటీ పాలనలో నిధుల దుర్వినియోగం పతాక స్థాయికి చేరిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అంకెల్లో మాయాజాలం చేస్తూ కోట్ల రూపాయల ప్రజాధనాన్ని పక్కదారి పట్టించారనే వాదనలకు బలం చేకూరుస్తూ దిగ్భ్రాంతికరమైన వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి. గడిచిన కొన్నేళ్లుగా వర్సిటీలో జరుగుతున్న పరిణామాలు కేవలం నిర్వహణ లోపమే కాదు, ఇది వ్యవస్థీకృత అవినీతి అని విద్యార్థి సంఘాలు బాహాటంగానే విమర్శిస్తున్నాయి.

**బడ్జెట్ లెక్కల్లో భారీ వ్యత్యాసాలు..ఎటు పోయిన నిధులు..?**

ప్రభుత్వం నుంచి ప్రతి ఏటా విడుదలయ్యే బడ్జెట్ రిలీజ్ ఆర్డర్స్ (బిఆర్‌ఒ),యూనివర్సిటీ తన రికార్డుల్లో చూపిస్తున్న కేటాయింపుల మధ్య అగాధమంత తేడా కనిపిస్తోంది. గత ఐదేళ్ల గణాంకాలను లోతుగా పరిశీలిస్తే, దాదాపు 57 కోట్ల రూపాయలకు పైగా నిధులు ఎటు వెళ్లాయో తెలియని గందరగోళ పరిస్థితి నెలకొంది. ఉదాహరణకు 2021–22 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం విడుదల చేసిన నిధులకు,వర్సిటీ అధికారిక లెక్కలకు మధ్య 17 కోట్ల రూపాయల భారీ వ్యత్యాసం ఉండగా, 2023–24 నాటికి అది మరో 18 కోట్లకు చేరింది. ఇలా ఏటా కోట్లాది రూపాయల నిధులు 'మిస్సింగ్' అవుతుండటంపై అడ్మినిస్ట్రేషన్ మౌనం వహించడం అనేక అనుమానాలకు తావిస్తోంది. అసలు ఈ నిధులు విద్యార్థుల అకడమిక్ అవసరాలకు, వసతుల కల్పనకు ఖర్చయ్యాయా, లేక అధికారుల జేబుల్లోకి వెళ్లాయా అన్నది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది.

**ఆర్.టి.ఐ చట్టానికి పాతర..గోప్యంగా ఆడిట్ నివేదికలు**

యూనివర్సిటీలో జరుగుతున్న అక్రమాలపై సమాచార హక్కు చట్టం (ఆర్.టి.ఐ) ద్వారా వివరాలు కోరిన విద్యార్థులకు,సామాజిక కార్యకర్తలకు నిరాశే ఎదురవుతోంది. పారదర్శకతకు మారుపేరుగా ఉండాల్సిన విద్యాసంస్థ, సమాచారాన్ని ఇవ్వడంలో తాత్సారం చేస్తూ రాజ్యాంగబద్ధమైన నిబంధనలను తుంగలో తొక్కుతోంది. ఆడిట్ నివేదికలు, ఇన్కమ్ అండ్ ఎక్స్‌పెండిచర్ స్టేట్‌మెంట్లు,మెస్ టెండర్ల వంటి కీలక పత్రాలను బయటపెట్టకపోవడం వెనుక భారీ కుంభకోణం దాగి ఉందనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా లక్షల రూపాయల విలువైన ప్రొక్యూర్మెంట్ పనులు, మరమ్మతులు, కొనుగోళ్లను బహిరంగ టెండర్లు లేకుండానే, నిబంధనలకు విరుద్ధంగా నామినేషన్ పద్ధతిలో తమకు కావాల్సిన వారికి కట్టబెడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**మెస్ టెండర్లు, అదనపు ఫీజుల దందా.!?**

విద్యార్థుల ఆరోగ్యంతో ముడిపడి ఉన్న మెస్ టెండర్ల విషయంలోనూ భారీ అక్రమాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది.గత ఎనిమిదేళ్లుగా ఒకే భోజన సరఫరా సంస్థకు కాంట్రాక్టులు కట్టబెట్టడం వెనుక ఉన్న మర్మమేమిటని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు. నాణ్యత లేని భోజనం పెడుతూ విద్యార్థులు తరచూ అస్వస్థతకు గురవుతున్నా, సదరు సంస్థపై కఠిన చర్యలు తీసుకోకపోవడం వెనుక ఉన్నతాధికారుల హస్తం ఉందనే ఆరోపణలు ఉన్నాయి.
మరోవైపు,ప్రభుత్వం నుంచి విద్యార్థులకు పూర్తిస్థాయిలో స్కాలర్‌షిప్‌లు అందుతున్నా, వర్సిటీ యాజమాన్యం సెమిస్టర్‌కు రూ.500 చొప్పున అదనంగా పరీక్ష ఫీజులు వసూలు చేయడం గమనార్హం. వేలాది మంది విద్యార్థుల నుంచి వసూలు చేసిన ఈ కోట్లాది రూపాయల ఫీజులు వినియోగంపై కనీసం స్టేట్‌మెంట్లు కూడా ఇవ్వకపోవడం పాలకవర్గ నిర్లక్ష్యానికి పరాకాష్టగా నిలుస్తోంది.

**ప్రశ్నిస్తే వేధింపులు..సర్కార్ స్పందించేనా..?**

ఈ అక్రమాలపై గొంతు ఎత్తే విద్యార్థులను అకడమిక్ పరంగా ఇబ్బందులకు గురిచేయడం, ఇంటర్నల్ మార్కుల్లో కోత విధిస్తామని బెదిరించడం వంటి చర్యలకు పాలకవర్గం పాల్పడుతోందని సమాచారం. "ఇది రాజకీయం కాదు,ప్రజాధనానికి జవాబుదారీతనం" అంటూ విద్యార్థులు చేస్తున్న పోరాటం ఇప్పుడు రాష్ట్రవ్యాప్త చర్చకు దారి తీసింది. కోట్ల రూపాయలు లెక్కల్లో తేడాలు ఉన్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్న తరుణంలో, ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఉన్నత స్థాయి విజిలెన్స్ విచారణ లేదా థర్డ్ పార్టీ ఆడిట్ నిర్వహిస్తేనే అసలు నిజాలు నిగ్గుతేలుతాయని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. బాసర ట్రిపుల్ ఐటి పూర్వ వైభవం సంతరించుకోవాలంటే, ఈ 'నిధుల నివేదికల' మిస్టరీకి తెరపడాలి.


**CHANGE OF NAME**

I, **KAPPALA BESLEN**, **S/o. KAPPALA VENKANNA,** (old Name) H.No. 3-72/1, Bikkumalla (V), Nuthankal (M), Suryapet Dist., Telangana - 508221, has changed my name as **KAPPALA HARSHA VARDHAN**, **S/o. KAPPALA VENKANNA** (New Name) for all purposes

SHRIRAM Finance

**వాహనముల బహిరంగ వేలం ప్రకటన**

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీన పరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించనైనది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | TS26G 9047 | Shekar Kanuganti | SWARAJ 843 XM | 2018 |
| 2 | TS10EH 9789 | Bolla Mallesh | SWIFT DZIRE VDI DIESEL 5 SEATER | 2016 |
| 3 | TS24B 5793 | Naresh Mancharla | MAHINDRA 475 DI | 2016 |
| 4 | AP25X 8782 | Santhosh Rajulapati | TATA ACE | 2013 |
| 5 | TS10UB 7788 | Krishna Radavath | TATA ACE GOLD | 2018 |

**AUCTION DATE 28-02-2026**

VENUE : SHRIRAM AUTOMALL INDIA LTD, PUNNEL CROSS ROAD, BOLLIKUNTA, WARANGAL

గమనిక : ప్రకటన తేది నుండి బండి అమ్ముడు అయే వరకు వర్తించును

**SHRIRAM FINANCE LIMITED**

H.No :15-1-237, Shop No. 1, 2 & 3, 2nd Floor Warangal City Center, Beside Guarduan Hospital, Opp : L B College, Mulugu Road , Cell : .9000230006 & 8008900443

# న్యాయవ్యవస్థ ప్రతిష్టపై దాడి!

దేశ భవిష్యత్తు విద్యార్థులపై ఆధారపడితే, వారిని నడిపించేది విద్య. పాఠ్యాంశాలు విద్యార్థుల మనోవికాసాన్ని పెంచేవిగానూ, స్ఫూర్తిమంతంగానూ ఉండాలే తప్ప, ద్వేష భావనలను ప్రేరేపించి, ఉద్రిక్తతలను పెంచేవిగా ఉండకూడదు. దేశ విద్యా వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న ఎన్‌సిఇఆర్‌టి పాఠ్య పుస్తకాల్లో చోటు చేసుకుంటున్న విపరీత ధోరణులు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. నిజానికి ఎన్‌సిఇఆర్‌టి రూపొందించే పాఠ్యపుస్తకాలు భారతదేశంలో కోట్లాది విద్యార్థుల ఆలోచనా నిర్మాణాన్ని, రాజ్యాంగ అవగాహనను, శాస్త్రీయ దృక్కోణాన్ని, ప్రజాస్వామ్య విలువలపై నమ్మకాన్ని ప్రభావితం చేసే ప్రాథమిక సాధనాలు. ఈ నేపథ్యంలో పాఠ్యాంశాల చేర్పులు, తొలగింపులు, లేదా నిర్మాణ మార్పులు కేవలం తరగతులు, పరీక్షలు, మార్కులు అనే చట్రంలో ఉండవు. అవి సామాజిక మానసికతను, సంస్థాగత విశ్వాసాన్ని, జాతీయ సమగ్రతను కూడా ప్రభావితం చేస్తాయి. గతంలో డార్విన్ మానవ పరిణామ సిద్ధాంతానికి సంబంధించిన అంశాలను తొలగించడం శాస్త్రీయ దృక్కోణం పట్ల విద్యా వ్యవస్థ వైఖరిపై చర్చను ప్రారంభించింది. శాస్త్ర విద్యలో ఆధారభూతమైన పరిణామ సిద్ధాంతం వంటి అంశాలపై సందిగ్ధత విద్యార్థుల విమర్శాత్మక ఆలోచనను దెబ్బతీస్తుందనే విమర్శలు వెల్లువెత్తాయి.

తాజాగా ఎనిమిదో తరగతి సామాజిక శాస్త్ర పుస్తకంలో న్యాయ వ్యవస్థలో అవినీతి అనే అంశం చేర్చడం, విద్యా విధాన నిర్ణయ ప్రక్రియపై మరింత లోతైన ప్రశ్నలను లేవనెత్తింది. ఈ అంశంపై భారత అత్యున్నత న్యాయస్థానం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయడం పరిస్థితి తీవ్రతకు నిదర్శనం. ఒక రాజ్యాంగ సంస్థపై 'అవినీతి' ముద్ర వేయడం ఆషామాషీ విషయం కాదు. అధికార విభజన సూత్రం, ప్రాథమిక నిర్మాణ సిద్ధాంతం, న్యాయవ్యవస్థ స్వతంత్రత వంటి అంశాలపై ప్రతికూల సంకేతాలను వ్యాప్తి చేయడం ప్రమాదకరం. భవిష్యత్తులో న్యాయ వ్యవస్థను కూడా మిగతా రాజ్యాంగ వ్యవస్థల మాదిరిగానే చెప్పుచేతుల్లో ఉంచుకునే దుర్మార్గం. మనది భిన్న భాషలు, మతాలు, కులాలు, ప్రాంతాలు, సంప్రదాయాలతో కూడిన సంక్లిష్ట సమాజం. ఈ విభిన్నతను రాజ్యాంగం ప్రతిపాదించిన న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే విలువలు సమన్వయపరుస్తాయి. పాఠ్యపుస్తకాలు ఈ విలువలను సమగ్రంగా, సమతుల్యంగా, సాక్ష్యాధారాలతో బోధించాలి. ఒకే సంస్థను లక్ష్యంగా చేసుకొని, అవినీతి ఆరోపణలు చేయడమంటే, ఆ సంస్థ పై విద్యార్థుల మనసుల్లో ప్రతికూల భావనను నాటడమే. ఇతర ప్రజాస్వామ్య సంస్థలపై సమాన స్థాయిలో చర్చ లేకపోవడంతో ఈ ప్రతికూల ప్రభావం మరింతగా పెరుగుతుంది.

సుప్రీం కోర్టులో వేలల్లో, వివిధ రాష్ట్రాల ఉన్నత న్యాయస్థానాల్లో లక్షల్లో, జిల్లా, ఉపన్యాయస్థానాల్లో కోట్లలో కేసులు అపరిష్కృతంగా ఉన్నమాట వాస్తవం. అదే సమయంలో న్యాయమూర్తుల కొరత, మౌలిక వసతుల లేమి వంటి సమస్యలను కూడా ప్రస్తావించుకోవాలి. మూలకారణాలను విస్మరించడం ఉద్దేశపూర్వక ప్రయత్నమేనన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. వివిధ స్థాయిల్లో కేసులకు సంబంధించిన గణాంకాలను ప్రస్తావించడం, అవినీతి పేరుకుపోయిందనే వాదనను విద్యార్థుల మనసుల్లో విష బీజాలు నాటడంగానే భావించాలి. ఒకే సంస్థను లక్ష్యంగా చేసుకోవడం అనేది ప్రజాస్వామ్య వ్యవస్థపై సమగ్ర నమ్మకాన్ని దెబ్బతీసే ప్రమాదం ఉంది. విద్యార్థులు చిన్న వయస్సులోనే ప్రజాస్వామ్య వ్యవస్థలోని లోపాలు, సవాళ్లు, సంస్కరణల అవసరం గురించి తెలుసుకోవడం అవసరం. అదే సమయంలో సంస్థల బలం, ఆత్మసంస్కరణా యంత్రాంగాలు, నైతిక నియమావళి, జవాబుదారీ విధానాల గురించి కూడా సమగ్ర అవగాహన కలిగి ఉండాలి. విద్యా విధాన నిర్ణయ ప్రక్రియ పారదర్శకంగా, నిపుణుల భాగస్వామ్యంతో, బహుళ దృక్కోణాలతో సాగాలి. రాజకీయ వాతావరణం, సమకాలీన సంఘటనలు, లేదా తాత్కాలిక భావోద్వేగాలు పాఠ్యాంశాల నిర్మాణాన్ని ప్రభావితం చేస్తే, అది దీర్ఘకాలికంగా సామాజిక విభజనలకు దారితీసే ప్రమాదం ఉంది.

గతంలో పలువురు చారిత్రక పురుషులతోపాటు కొన్ని సంఘటనలు, కొన్ని సంస్థల ప్రస్తావనలను ఎన్‌సిఇఆర్‌టి మార్చడం లేదా తొలగించడం వివాదాస్పదమయ్యాయి. ఈ తరహా పరిణామాలు విద్యా వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని క్రమంగా దెబ్బతీస్తాయి. ఒక వర్గం లేదా ప్రాంతం లేదా సిద్ధాంతానికి అనుకూలమని స్పష్టమయ్యే రీతిలో జరిగే మార్పులు, ఇతర వర్గాల్లో అనుమానాలను, భయాందోళనలను పెంచుతాయి. భారతదేశం వంటి విభిన్న సమాజంలో సామరస్యాన్ని కాపాడటానికి విద్యా వ్యవస్థ తటస్థత విధానాన్ని అనుసరించాలి. శాస్త్రీయతను, రాజ్యాంగ స్ఫూర్తిని తప్పనిసరిగా పాటించాలి. విమర్శనాత్మక ఆలోచన ప్రజాస్వామ్యానికి మూలాధారం. విద్యార్థులు ప్రశ్నించాలి, విశ్లేషించాలి, సాక్ష్యాలను పరిశీలించాలి. అయితే, విమర్శను బోధించే విధానం సంస్థాగత గౌరవాన్ని దెబ్బతీయకుండా ఉండాలి. ఒకే వ్యవస్థను లేదా వర్గాన్ని లేదా ప్రాంతాన్ని లక్ష్యంగా చేసుకున్నట్లుగా కనిపించే అధ్యాయాలు, ప్రత్యేకించి చిన్న వయస్సు విద్యార్థులకు, సమగ్ర సందర్భం లేకుండా అందించడం భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టడమే. ఇలాంటి ప్రయత్నాలు రాజ్యాంగ సంస్థలు, వ్యవస్థలపై విద్యార్థుల్లో అపనమ్మకాన్ని పెంచుతాయి.

న్యాయవ్యవస్థపై నమ్మకం తగ్గితే, చట్టపరమైన పరిష్కారాలపై విశ్వాసం బలహీనమవుతుంది. అదే విధంగా శాస్త్రీయ సిద్ధాంతాలపై సందిగ్ధత సృష్టిస్తే, శాస్త్రీయ దృక్కోణం దెబ్బతింటుంది. ఈ రెండు ధోరణులు కలిసివస్తే, సమాజంలో తార్కికతకు బదులుగా భావోద్వేగాలు, అపోహలు, విభజనాత్మక చర్చలు బలపడే ప్రమాదం ఉంది. అవినీతి వంటి అంశాలను చర్చించేటప్పుడు అన్ని ప్రజాస్వామ్య సంస్థలలో ఉన్న సవాళ్లు కూడా ప్రస్తావించాలి సంస్కరణల అవసరాలను పేర్కోవాలి. జవాబుదారీ వ్యవస్థల గురించి సమగ్రంగా చర్చించాలి.

ఒక రాజ్యాంగ వ్యవస్థను, ముఖ్యంగా న్యాయవ్యవస్థకు మాత్రమే ప్రస్తావించడం ప్రమాదకర పరిణామాలకు దారితీసే అంశం. పాఠ్యాంశాల రూపకల్పనలో శాస్త్రీయత, రాజ్యాంగ విలువల పట్ల నిబద్ధత, సామాజిక సమగ్రత ప్రధాన ప్రమాణాలుగా ఉండాలి. విద్యార్థులు ప్రజాస్వామ్య వ్యవస్థలోని లోపాలను తెలుసుకోవాలి. అదే సమయంలో, ఆ వ్యవస్థను బలపరచే విధానాలను, సంస్కరణలను, నైతిక ప్రమాణాలను కూడా అర్థం చేసుకోవాలి. వివక్షను, ఎంపికాత్మక విమర్శను, లేదా రాజకీయ ప్రభావాన్ని విద్యా వ్యవస్థలో నివారించడం దేశ భవిష్యత్తు కోసం అత్యవసరం. సమతుల్యమైన విద్య మాత్రమే విభిన్నతతో నిండిన ఈ దేశంలో స్థిరమైన సామరస్యాన్ని, ప్రజాస్వామ్య నమ్మకాన్ని, రాజ్యాంగ పరిరక్షణను నిర్ధారిస్తుంది. ఈ దిశగా ప్రయత్నాలు జరగకుండా, విద్యార్థుల మనస్సులో విష బీజాలు నాటడం ప్రజస్వామ్యానికి చేటు. దేశ భవిష్యత్తుకు ప్రమాదం.



## జవాబు ఇవ్వకుండా జారుకున్న మోదీ

**'భారతదేశం-అమెరికా మధ్యంతర వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేయాలని నేను ప్రధానమంత్రి నరేంద్రమోదీకి సవాల్ చేశాను. 24గంటలకు పైగా సమయం గడిచిపోయింది. అయితే ప్రధాని మోదీ మరోసారి సైలెంట్‌గా ఇజ్రాయెల్‌కు జారుకున్నారు. మీరు చేసుకున్న ఒప్పందం రైతులకు వ్యతిరేకం. ఆ ఒప్పందం 'రైతుల గుండెల్లో బాణం'. ఈసారి ఎవరి ఆదేశాల మేరకు ఇజ్రాయెల్‌లో మీరు దేశ ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఒప్పందం కుదుర్చుకుని తిరిగొస్తారు?. 'ఎప్‌స్టీన్ ఫైల్స్' ను విడుదల చేస్తామని బెదిరింపు, అమెరికాలో పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీపై కొనసాగుతున్న క్రిమినల్ కేసుతో ముడిపడి ఉన్న బాహ్య ఒత్తిడితోనే మోదీ మధ్యంతర వాణిజ్య ఒప్పందాన్ని ఆమోదించి ఉంటారు'.**

-లోక్‌సభలో ప్రతిపక్షనేత
రాహుల్‌గాంధీ



# పశు సంపదను పెంపొందిస్తేనే స్వచ్ఛమైన పాల ఉత్పత్తులు

ప్రస్తుతం ప్రచారంలో ఉన్న వార్త కల్తీ పాలు ఇప్పుడు రెండు తెలుగు రాష్ట్రాల ప్రజల మదిలో మెదులుచున్న సందేహం. పిల్లలు త్రాగే పాల మొదలు ఇంట్లో వంటకు వాడే పదార్థాల వరకు కల్తీనే అని చెప్పవచ్చు. పెద్ద పెద్ద హోటల్స్ కూడా ప్రామాణికాలు పాటించడం లేదని ఫుడ్ కమీషన్ వారే తెలిపారు. మనం తీసుకునే ఆహార పదార్థాల నుండి ఆరోగ్యానికై వేసుకునే మందుల వరకు కల్తీ. దీంట్లో ఇప్పుడు ప్రధానమైన అంశం కల్తీ పాలు. అవును నిజమే వివిధ రసాయనాలతో నాసిరకం పదార్థాలతో పాలు తయారు చేస్తున్నారని ఆరోపణ. దాంట్లో భాగంగానే ఆంధ్రప్రదేశ్‌లో కల్తీ పాలు తాగి ఆస్పత్రి పాలు అయిన చిన్నారుల, పెద్దల పరిస్థితి చూస్తూనే ఉన్నాం. అనారోగ్యులు శక్తి కోసం పాలు తీసుకుంటారు, ఆ పాలలో కూడా నాణ్యత లేదు అంటే వారి ఆరోగ్య పరిస్థితి ఏంటో మనమే అర్థం చేసుకోవాలి. పెరిగిన ప్రపంచీకరణలో అంతరించి పోతున్న పశు సంపద పెరుగుతున్న జనాభాకు సరిపోను మంచి పాలు అందడం లేదు. వీటిలో స్వచ్ఛమైన పాలు ఏవో కల్తీ ఏవో తెలియకా కల్తీపాలు త్రాగి అనేక రోగాల బారిన పడుతున్నారు. స్వచ్ఛమైన గేదే పాలు చూద్దామన్న కనిపించడం లేదు. దాదాపు రెండు దశాబ్దాల క్రితం గ్రామీణ ప్రాంతాల్లో పశు సంపద, వ్యవసాయంతో తులతూగుతూ రైతులకు ఆర్థిక ఆదాయంతో వెన్నుదన్నుగా నిలిచింది. క్రమంగా పెరిగి ప్రపంచీకరణలో వ్యవసాయ భూమి తగ్గడంతో పాటు వ్యవసాయం చేసేవారు కూడా తగ్గుతున్నారు. రైతులకు జీవనాధారమైన వ్యవసాయం భూమిని నమ్ముకొని సాగు చేసిన అధిక దిగుబడి రాక తప్పని పరిస్థితులలో అనేక రసాయన ఎరువులు వాడుతున్నారు, ఇలా వాడకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సేంద్రియ ఎరువులు రైతులకు అందుబాటులోకి తీసుకు వచ్చి వాటిపై అవగాహన కల్పించాలి. భవిష్యత్‌లో సేంద్రీయ వ్యవసాయానికి డిమాండ్ పెరిగే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.. ఎందుకంటే ఇప్పటికీ సేంద్రియ ఎరువుల ద్వారా పండించిన కూరగాయలు, పంటకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రజలు, భవిష్యత్తు కాలంలో కూడా రసాయనాలు లేకుండా పండించిన పంటకు మంచి ఆదరణ ఉంటుంది. పశు సంపదను ప్రోత్సహించడానికి ప్రభుత్వాలు రైతులకు రాయితీలు ఇస్తున్న సద్వినియోగం చేసుకోవడం లేదు. భవిష్యత్తు యువ రైతులదే కాబట్టి వారు సంపూర్ణ అక్షరాస్యులు. వారికి పరిజ్ఞానంతో అభివృద్ధి గడించాలని కోరుకుంటూ, రైతులు నష్టపోకుండా సేంద్రీయ వ్యవసాయం, పశు సంపదను పెంచుతూ పోతే లాభాల బాటలో ముందుకు పోయే అవకాశం ఉంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ప్లాస్టిక్‌ను రసాయనాలను అదుపు చేయాలని చెపుతూనే సేంద్రీయ వ్యవసాయానికి పెద్ద పీట వేస్తుంది. ప్రతి గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీలలో రైతు సదస్సులు నిర్వహించాలి. పశు సంపద పెంపుదలకు లక్ష్యంతో పని చేయాలి ప్రభుత్వాలు. కల్తీని నియంత్రిస్తేనే నిజమైన పాడి రైతులకు న్యాయం జరుగుతుంది. కల్తీ పాలతో పాటు కల్తీ ఆహార పదార్థాలను తయారు చేసే వారిపై కఠినమైన చర్యలు తీసుకునే విధంగా కొత్త చట్టాలు తీసుకు వచ్చినప్పుడే ప్రజలకు నాణ్యమైన పోషకాహారం అందించగలం. వ్యవసాయ ఆధారిత ప్రాంతాలైన ఆంధ్ర, తెలంగాణలో కూడా స్వచ్ఛమైన పాలకొరత ఉందని చెప్పడానికి ప్రస్తుత సంఘటనలే నిదర్శనం. గేదె పాలు సాధారణమైన ధర ఉన్నా ఆవు, మేక, గొర్రె పాలకు విపరీతమైన డిమాండ్ ఉంది.భవిష్యత్తులో ఉమ్మడి తెలుగు రాష్ట్రాలు పశు, వ్యవసాయంతో వెల్లి విరియాలని ఆశిద్దాం.

మిద్దె సురేష్, 9701209355

# భారత్‌కు విశ్వసనీయ ఎఐ టూల్స్ అవసరం

**నంటూ బెనర్జీ**

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) స్వీకరణ, పరిమితులు, సంభవించే పరిణామాల గురించి ప్రపంచం సందేహాలు వెలిబుచ్చుతున్న తరుణంలో గత వారం ఢిల్లీలో గ్లోబల్ ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్ – 2026 సరైన సమయంలో జరిగింది. ఎన్‌విడియా, మైక్రోసాఫ్ట్, గూగుల్, అమెజాన్, మెటా, ఆంథ్రోపిక్ వంటి సంస్థల ప్రారంభ కృషికి ధన్యవాదాలు. అమెరికా ప్రధానంగా ఫౌండేషన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, జనరేటివ్ ఎఐ(జెన్ ఎఐ), ఇంటిగ్రేషన్ , ఎంటర్‌ప్రైజ్–చైడ్ అప్లికేషన్ ద్వారా గ్లోబల్ ఎఐని వినియోగిస్తుంది. గత మూడు సంవత్సరాలుగా ఎఐ వినియోగం విపరీతంగా పెరిగింది. అయినప్పటికీ, ఎఐ స్వీకరణకు సంబంధించి విస్తృతమైన సందేహం ఉంది. ఎఐ పరిమితులు, నైతిక పర్యవసానాలు, దీర్ఘకాలిక పరిణామాలపై ఆందోళనలు ఉన్నప్పటికీ, జాగ్రత్తగా, దాదాపు సంకోచంగా, అక్కున చేర్చుకోవటం కనిపిస్తోంది. యూరోపియన్ యూనియన్ సభ్య దేశాలు, జపాన్, చైనా ఇప్పటికీ ఎఐ అభివృద్ధిలో జాగ్రత్తగా, నియంత్రిత విధానాన్ని అవలంబిస్తున్నాయి.

ఎఐ స్వీకరణ పరంగా భారతదేశం ప్రపంచంలోని అతిపెద్ద మార్కెట్లలో ఒకటిగా అంచనా వేయబడుతున్నది. ఇక్కడ ఉపాధి, డేటా గోప్యత, నైతిక ఆందోళనలకు సంబంధించిన నష్టాలను నియంత్రిస్తూనే, వ్యవసాయం, ఆరోగ్య సంరక్షణ వంటి రంగాలలో ఆర్థిక వృద్ధికి దాని సామర్థ్యాన్ని ఉపయోగించుకునే లక్ష్యం తో ఈ ప్రక్రియలో కీలకమైన సమతుల్యతతో ముందుకు సాగుతోంది. అధిక విద్యుత్ వినియోగం, కార్మిక మార్కెట్ మార్పుల కారణంగా నెమ్మదిగా, మరింత జాగ్రత్తగా వ్యవహరించాలని కొందరు సూచిస్తున్నారు. ఎఐ వినియోగం నెమ్మదిగా కాకుండా దేశం బాధ్యతాయుతమైన స్వీకరణపై దృష్టి సారించి, లోతైన ఉత్పాదకత సమస్యలను పరిష్కరించడానికి ఎఐని ఉపయోగించాలని మరికొందరు భావిస్తున్నారు. భారతదేశం ప్రస్తుతం తీవ్రమైన ప్రతిభ కొరత, విదేశీ సాంకేతికత/చిప్‌పై ఎక్కువగా ఆధారపడటం, డేటా భద్రతా దుర్బలత్వాలు, అధునాతన సైబర్ దాడుల నుండి రక్షణ (ఏజెంటిక్ ఎఐ)లతో పాటు ముఖ్యంగా ఐటి రంగంలో ఉద్యోగ స్థానభ్రంశం నివారణ వంటి సమస్యలను పరిష్కరించాలి,

ఐబిఎం, ఆక్సెంచర్, పాలంటిర్ టెక్నాలజీస్, అబోడ్, డాటారోబోట్ వంటి ప్రపంచ దిగ్గజాలు సామర్థ్యం పెంపుదల నిర్ణయాలు తీసుకోవడాన్ని మెరుగుపరచడానికి వ్యాపార ప్రక్రియలలో ఎఐని సమీకృతం చేయడంపై దృష్టి సారించాయి. సంస్థలు ఇప్పటికే (బ్యాంకింగ్, ఇంధన, ప్రభుత్వం) నియంత్రిత పరిశ్రమలను నిర్వహించే, బాధ్యతాయుతమైన ఎఐ వినియోగంలో ప్రత్యేకతను అనుభవిస్తున్నాయి. అమెజాన్, ఆంథ్రోపిక్, గూగుల్, ఐబిఎం, మెటా, మైక్రోసాఫ్ట్, ఎన్‌విడియా, ఓపెన్ ఎఐ వంటి ప్రధాన అమెరికా సంస్థలు స్థిరమైన అభివృద్ధి కోసం ఎఐని అమలు చేయడానికి భాగస్వామ్యాన్ని ఎఐ(పిజిఐఎఐ)గా ఏర్పాటు చేశాయి. ఎఐ ఇకపై ఎంత మాత్రం భవిష్యత్ భావన కాదు. ఇది శక్తివంతమైన, అపరిపక్వమైన సాంకేతికత అయినప్పటికీ, దీనికి అత్యవసరమైన, కఠినమైన నిర్వహణ అవసరం. ప్రస్తుత సందేహం పరిశ్రమ 'హ్యూమన్ –ఇన్–లూప్(మనిషిని వెనక్కి నెట్టే)' విధానం వైపు నెట్టివేస్తోంది, ఇక్కడ ఎఐ మానవ నిర్ణయాధికారాన్ని భర్తీ చేయడానికి బదులుగా పెంచడానికి ఉపయోగించబడుతుంది. గుడ్డిగా స్వీకరించటం కంటే బాధ్యతాయుతంగా వ్యవహరించడం లక్ష్యంగా పెట్టుకుంది. ఎఐ మానవ మేధస్సును పూర్తిగా భర్తీ చేయదు, కానీ ఇది రొటీన్ పనులను దానంతట అదే చేయడం ద్వారా,శక్తివంతమైన, పరిపూరక సాధనంగా పనిచేయడం ద్వారా పరిశ్రమలను గణనీయంగా పునర్నిర్మిస్తుంది. ఎఐ వేగం, డేటా ప్రాసెసింగ్, సామర్థ్యంలో రాణించినప్పటికీ, దీనికి స్పృహ, భావోద్వేగ మేధస్సు, సృజనాత్మకత, నైతిక తార్కికం లేవు.

తాజా ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్ ముఖ్యంగా భారతదేశం వంటి వేగంగా అభివృద్ధి చెందుతున్న కొత్త ఆర్థిక వ్యవస్థలలో, అలాగే అభివృద్ధి చెందిన దేశాలలో ఎఐ స్వీకరణలకు సంబంధించిన సమస్యలను అర్థం చేసుకోవడానికి చాలా ఉపయోగకరంగా ఉంది. ఇవి వారి వ్యక్తిగత అవసరాలు, సమస్యలు, అవకాశాలకు అనుగుణంగా వారి స్వంత కథను రచించుకోగలగాలి. ఎఐ మానవ మేధస్సును పూర్తిగా భర్తీ చేయదు.

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ఫ్రెంచ్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మాక్రాన్, యుఎన్ సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్, ఆల్ఫాబెట్ , గూగుల్ సిఇఒ సుందర్ పిచాయ్, ఓపెన్ ఎఐ సామ్ ఆల్ట్‌మాన్, డీప్‌మైండ్ సిఇఒ డెమిస్ హస్సాబిస్, ఆంథ్రోపిక్ సిఇఒ డారియో అమోడీ వంటి గ్లోబల్ లీడర్‌లు బాధ్యతాయుతమైన, సమగ్రమైన కృత్రిమ మేధస్సు పాలన కోసం అంతర్జాతీయ ప్రణాళికను వెల్లడించడం ఆనందంగా ఉంది. భారతదేశం ఎఐ సామర్థ్యాన్ని ప్రశంసిస్తూనే, టెక్ లీడర్‌లు 'ఎఐ డివైడ్( విభజన)'కు వ్యతిరేకంగా హెచ్చరించారు, నైతిక ఆవిష్కరణ, పిల్లల భద్రత, ప్రపంచ సహకారం కోసం పిలుపునిచ్చారు.




ప్రస్తుతం భారతదేశం వేగంగా స్వీకరించేందుకు సంబంధించిన ముఖ్యమైన ఆందోళన అదనపు విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన భారీ పెట్టుబడులపై దృష్టి సారించటం. అలాగే కీలకమైన, విస్తరిస్తున్న ప్రతిభ అంతరాన్ని తగ్గించడం (మూడు శాతం కంటే తక్కువ ఇంజనీర్లు ఎఐ కోసం సిద్ధంగా ఉన్నారు), ఎఐ ఆధారిత సైబర్ బెదిరింపులకు వ్యతిరేకంగా డేటా భద్రతను నిర్ధారించడం, విదేశీ హార్డ్‌వేర్‌ల అధికధరలపై ఆధారపడటాన్ని తగ్గించడం కూడా ముఖ్యమే. ఎఐ విస్తరణ కారణంగా ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు పొందిన భారతదేశంలోని ఇన్ఫోటెక్ కంపెనీలు, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్), ఇన్ఫోసిస్, హెచ్‌సిఎల్ టెక్, విప్రో, టెక్ మహీంద్రా ఎల్ఐ మైండ్‌ట్రీ వంటి ఐటి సంస్థల వ్యాపార అదృష్టం తారుమారయ్యే అవకాశం కూడా ఆందోళన కలిగిస్తుంది. ఎందుకంటే పరిశ్రమకు సేవలందిస్తున్న వేలాది మంది సాఫ్ట్‌వేర్ సిబ్బంది తమ ఉద్యోగాలను కోల్పోయే ప్రమాదం ఉంది. వేగవంతమైన ఎఐ స్వీకరణ భారతదేశ సాంప్రదాయ ఐటి సేవల పరిశ్రమకు అస్తిత్వ మార్పును కలిగిస్తుంది. దీని వలన రాబోయే మూడు నుండి నాలుగు సంవత్సరాలలో వారి ఆదాయంలో గణనీయమైన కోత ఏర్పడుతుంది. మానవ శ్రామిక శక్తి గతంలో నిర్వహించే సాధారణ పనులను పెంచడం కంటే ఆటోమేట్ చేయడానికి ముప్పు కలిగించే 'ప్రతి ద్రవ్యోల్బణ'(డిఫ్లేషనరీ) శక్తిగా ఎఐ పనిచేస్తుంది.

సార్వభౌమ ఎఐ (సావరిన్ ఎఐ) మౌలిక సదుపాయాలను నిర్మించడంలో, సమ్మిళిత వృద్ధిని నిర్ధారించడంలో,వేగవంతమైన ఆటోమేషన్ మధ్య ఉద్యోగ స్థానభ్రంశాన్ని నిరోధించడంలో దేశం గణనీయమైన సవాళ్లను ఎదుర్కొంటుంది. ఎఐకి సిద్ధంగా ఉండటానికి, భారతదేశ డేటా సెంటర్లకు అవసరమైన మౌలిక సదుపాయాలకు విద్యుత్ డిమాండ్‌లో పెద్ద పెరుగుదలను ఎదుర్కొంటుంది. 2030 నాటికి అదనంగా 4050 టిడబ్ల్యుహెచ్ (టెరావాట్ గంటలు) విద్యుత్ అవసరమని అంచనాలు సూచిస్తున్నాయి. వేగంగా ఎఐ స్వీకరణ ద్వారా దేశ డేటా సెంటర్ సామర్థ్యం 2024లో దాదాపు 1.6 జిడబ్ల్యు నుండి 2030 నాటికి 8–10 జిడబ్ల్యుకి పెరుగుతుందని అంచనా. గౌతమ్ అదానీ గ్రూప్, రిలయన్స్ ఇండస్ట్రీస్‌తో సహా దేశంలోని కొన్ని అగ్రశేణి పారిశ్రామిక సంస్థలు ఎఐ మౌలిక సదుపాయాలను నిర్మించడానికి ఇప్పటికే పెద్ద మౌలిక సదుపాయాల పెట్టుబడులపై పని చేస్తున్నాయి. దశాబ్దంలో దేశం లో అదానీ గ్రూప్ ఎఐ మౌలిక సదుపాయాల వ్యవస్థను సృష్టించడానికి 250 బిలియన్ల డాలర్లు పెట్టుబడులు అంచనా వేసింది. రిల్, దాని డిజిటల్ అనుబంధ సంస్థ జియో ప్లాట్‌ఫామ్‌లు ఏడు సంవత్సరాల కాలంలో సార్వభౌమ మౌలిక సదుపాయాలలో 110బిలియన్లను పెట్టుబడి పెట్టాలని యోచిస్తున్నాయి. ముఖ్యంగా, భారతదేశంలో ఎఐ స్వీకరణ వేగవంతమైన వృద్ధిని చూస్తోంది. ఈ వృద్ధికి దోహదపడే కీలక రంగాలు బ్యాంకింగ్ (బిఎఫ్ఎస్ఐ), ఆరోగ్య సంరక్షణ, రిటైల్, కన్స్యూమర్ ప్యాకేజ్డ్ గూడ్స్ (సిపిజి),పారిశ్రామిక/ఆటోమోటివ్ రంగా లు ఎఐ విలువజోడింపులో దాదాపు 60 శాతం దోహదపడుతున్నాయి. ప్రధాన రంగాలలో కస్టమర్ సేవ కోసం జనరేటివ్ ఎఐ, నిర్ణయం తీసుకోవడం కోసం డేటా అనలిటిక్స్, వ్యవసాయం/పాలనలో ఎఐ ఉంది. బ్యాంకింగ్, ఆర్థిక సేవలు స్వీకరణలో (68 శాతానికి పైగా) ముందంజలో ఉన్నాయి. ఆ తర్వాత ఆరోగ్య సంరక్షణ, ఫార్మా ఔషధ ఆవిష్కరణ, డయాగ్నస్టిక్ ఇమేజింగ్, టెలిమెడిసిన్ కోసం వినియోగంతో 52 శాతానికి పైగా స్వీకరణ రేటును చూపిస్తున్నాయి. పనిలో జెన్ ఎఐ స్వీకరణ, సంభాషణ సాధనాలలో అధిక వినియోగం ద్వారా. జనరేటివ్ ఎఐ నేతృత్వంలో భారతదేశం మొదటి స్థానంలో ఉంది. ప్రభుత్వం స్టార్టప్‌లు, పరిశోధకుల కోసం జిపియు మార్కెట్ ప్లేస్‌లను కలిగి ఉన్న జాతీయ ఎఐ కంప్యూట్ మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేస్తోంది. భారతదేశం ఎఐని ఒక కొత్త అవకాశంగా చూస్తుంది. ఇది మానవులు, తెలివైన వ్యవస్థలు కలిసి సృష్టించడం, కలిసి పనిచేయడం, కలిసి అభివృద్ధి చెందడం, పనిని తెలివిగా, మరింత సమర్థవంతంగా, మరింత ప్రభావవంతం గా చేసే యుగాన్ని సూచిస్తుంది. మనం సహేతుకంగా సురక్షితమైన, పారదర్శకంగా ఉండే 'విశ్వసనీయ' ఎఐ సాధనాలను స్వీకరించాలి.

# అరుణమయ చరిత అమరం

చిత్తశుద్ధి, నిబద్ధత, నిస్వార్థతకు ఆయన నమూనా. ఆయనది అత్యంత సాధారణమైన జీవన శైలి, నిరాడంబరతకు మారుపేరు. ఆయన వ్యక్తిత్వం భావితరాలకు ఆదర్శప్రాయం, స్ఫూర్తిదాయకం. కమ్యూనిస్టు నైతిక విలువలకు ఆయన సజీవమైన నిలువుటద్దం. ఆయనే ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) తమిళనాడు రాష్ట్ర సీనియర్ నాయకుడు ఆర్.నల్లకన్ను. ఆయన జీవితం మహోన్నత ప్రేరణ. కమ్యూనిస్టు నాయకునిగా ఆయన సేవలు నిరుపమానం. తమిళనాడు రాష్ట్ర చరిత్రకు ఘనమైన జీవితాన్ని అందించిన అమరుడు ఆయన. రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ మొదలుకొని అన్ని రాజకీయ పార్టీల నేతలు ఆయనకు ఎదురొచ్చి నమస్కరిస్తారు. తమిళనాడుకు పెరియార్ ఒక కన్ను అయితే, నల్లకన్ను మరొక కన్ను అని మాజీ ముఖ్యమంత్రి ఎం కరుణానిధి వ్యాఖ్యానించారంటే నల్లకన్ను గొప్పతనం ఎంతో అర్థమౌతుంది. ఉత్తమమైన, ఉన్నతమైన మానవ జీవితాన్ని ఎలా జీవించాలో ఆయన జీవిత చరిత్రను చూసి తెలుసుకోవచ్చు. సీటు కోసమో, ఓటు కోసమో, పదవి కోసమో, పైసాకోసమో మాటను, బాటనూ మార్చుకునే నేటి రాజకీయ విన్యాసాల వేళలో అంకిత భావం, నిబద్ధమైన ఆశయ ప్రస్థానంగల నల్లకన్ను స్మరణ కారు చీకట్లో కాంతి రేఖలా కనపడుతుంది. డిసెంబరు 26న 101వ పుట్టినరోజు వేడుక జరుపుకున్న నల్లకన్ను రక్తపోటు, మూత్రపిండాల సమస్య, ఆహారం మింగలేకపోవడం తదితర సమస్యలతో చెన్నైలోని రాజీవ్‌గాంధీ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో కొద్ది రోజులుగా చికిత్స పొందుతున్నారు. సోమవారం రాత్రి ఆయన ఆరోగ్య పరిస్థితి అకస్మాత్తుగా క్షీణించడంతో ఐసియుకు మార్చి కృత్రిమ శ్వాస అందించారు. బుధవారం మధ్యాహ్నం తుదిశ్వాస విడిచారు.

తమిళ ప్రజల హక్కులు, సామాజిక సమానత్వం కోసం పోరాడే ద్రావిడ ఉద్యమంలో అనుభవజ్ఞుడైన రాజకీయ నాయకుడు, కీలక నాయకుడు. సమాజంలోని అట్టడుగు, అణగారిన వర్గాల ముఖ్యంగా దళితులు, బలహీనవర్గాల వారి హక్కుల కోసం అవిశ్రాంత పోరు సల్పిన వ్యక్తి నల్లకన్ను. కులవివక్షతకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరులో ఆయన అగ్రభాగాన నిలిచాడు. నిరంతర అధ్యయనశీలి. భూపోరాటయోధుడు. కమ్యూనిస్టు ఉద్యమకారుడు ఆయిన నల్లకన్నుకు ఎటువంటి వ్యక్తిగత ఆస్తి లేదు. భారత కమ్యూనిస్టు పార్టీ ఇచ్చే రూ.2,000 నెలవారీ భత్యంతోనే ఆయన జీవించారు. అద్దె వసతి గహంలోనే ఆయన జీవనం సాగింది. వ్యక్తిగత ప్రయోజనాల కోసం ప్రజా వనరులను ఎన్నడూ ఉపయోగించని వ్యక్తిగా పేరు పొందారు. ఆయన గదిలో ఒక పాత చెక్క మంచం, కొన్ని పుస్తకాలు, రెండు జతల ఖాదీ ధోతీలు మాత్రమే కనిపిస్తాయి. మానవీయ విలువలకు, ఆచరణీయవాదానికి నల్లకన్ను చిరునామా. దాదాపు ఎనిమిది పదుల రాజకీయ జీవితంలో బడుగుల గొంతుకగా మారి, వారిని గెలిపించేందుకు అలుపెరగని కృషి చేసిన మహోన్నత మానవతామూర్తిగా, ఆ కాలపు మహనీయుడిగా వెలుగొందారు. మధ్యతరగతి కుటుంబంలో జన్మించినప్పటికీ అభ్యుదయ భావాల సంస్కారంతో పెరిగారు. కమ్యూనిజం వికాసానికి పట్టుదలతో పనిచేశారు. ప్రజాసేవను, కుటుంబ జీవితాన్ని రెండు కళ్లుగా భావించారు సుదీర్ఘ రాజకీయ ప్రయాణంలో అన్యాయాలను ఎదిరించి నిలిచారు. ఆయన జీవితం స్ఫూర్తిదాయకం...ఆదర్శనీయం.



అన్ని పార్టీల రాజకీయనాయకులు అమితంగా గౌరవించే వ్యక్తిత్వం ఆయనది. పార్టీ సిద్ధాంతమే ఆయన సిద్ధాంతం. ప్రజాసమస్యలపై పోరే ఆయన ఊపిరి. పదవులపై...నజరానాలపై, సన్మానాలు, సత్కారాలపై ఏమాత్రం ఆసక్తి లేని మహనీయుడు. తమిళనాడు రాజకీయ, సామాజిక చరిత్రకు సజీవ చిహ్నం భారత కమ్యూనిస్టు పార్టీ తమిళనాడు రాష్ట్ర పూర్వ కార్యదర్శి, శతవసంతాల నల్లకన్ను. దిగువ మధ్య తరగతి కుటుంబం నివసించే ఇంట్లో నివసిస్తూ, సాధారణమైన జీవితాన్ని గడుపుతున్న నల్లకన్ను జీవితం కమ్యూనిస్టులకే కాదు, నైతిక విలువలతో జీవించాలనుకునే ప్రతీ ఒక్కరికీ ఆదర్శనీయం. తమిళనాడులోని తూత్తుకుడి జిల్లాలోని శ్రీవైకుంతంలో జన్మించిన నల్లకన్ను రామసామి, కరుపాయి దంపతుల 10 మంది సంతానంలో మూడవవాడు. పాఠశాల విద్యార్థిగా ఉన్నప్పుడు జాతీయోద్యమం ఆయనపై తీవ్ర ప్రభావం చూపించింది. తండ్రి వ్యతిరేకించినప్పటికీ లెక్కచేయకుండా స్వాతంత్ర్య సమరంలో భాగంగా కాంగ్రెస్ కార్యకలాపాలలో పాల్గొనడం ప్రారంభించారు. కమ్యూనిస్టు భావజాలానికి ఆకర్షితుడై, 1943లో తిరునెల్వేలిలోని మదురైలోని హిందూ కళాశాలలో చదువుతున్నప్పుడు 17 సంవత్సరాల వయస్సులో సిపిఐలో చేరాడు. 1948లో, స్వతంత్ర భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీపై నిషేధం విధించిన తర్వాత, 1949 డిసెంబర్ 20న నల్లకన్నును అరెస్టు చేసి, పోలీసు కస్టడీలో చిత్రహింసలకు గురిచేశారు. ఒక అధికారి తన మీసాలను సిగరెట్‌తో కాల్చడంతో సహా అమానవీయంగా ప్రవర్తించినా నల్లకన్నులో పోరాటపటిమ ఏమాత్రం తగ్గలేదు. నెల్లై కుట్రకేసులో పి. మాణిక్యం, మయాండి భారతి వంటి ఇతర కమ్యూనిస్టు నాయకులతో పాటు నల్లకన్నును కూడా ఇరికించారు. ఈ కేసులో ఆయనకు జీవిత ఖైదు విధించారు. అయితే, 1956లో జైలు నుంచి విడుదల కావడానికి ముందు ఏడు సంవత్సరాల జైలు జీవితం గడిపారు.

తమిళనాడులో రైతు ఉద్యమాలను నిర్మించడంలో నల్లకన్నుది కీలకపాత్ర. కొంతకాలం జర్నలిజం రంగంలో కూడా నల్లకన్ను పనిచేశారు. పార్టీ తమిళనాడు రాష్ట్ర పత్రిక జనశక్తి బాధ్యతలు కొంత కాలం నిర్వహించారు. రైతు సంఘంలో క్షేత్రస్థాయిలో పనిచేసేందుకు 1946లో ఆయన పత్రికారంగం నుంచి రైతు సంఘానికి వచ్చారు. దాదాపు 25 సంవత్సరాలపాటు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించారు. సిపిఐ ప్రజాసంఘమైన ఒడుక్కపట్టార్ వజవురిమయి ఇయక్కం (జీవించే హక్కు కోసం అణగారిన ప్రజల ఉద్యమం)కు కూడా ఆయన నేతృత్వం వహించారు. అంటరానితనానికి వ్యతిరేకంగా జీవితకాలం పోరాడారు. కులాంతర, మతాంతర వివాహాలను ప్రోత్సహించారు. దక్షిణ తమిళనాడును కులఘర్షణలు అతలాకుతలం చేసినప్పుడు శాంతి పునరుద్ధరణ కోసం ఘర్షణలు జరిగిన అన్ని జిల్లాల్లోనూ నల్లకన్ను పాదయాత్ర చేపట్టారు. అల్లర్లలో ఆయన మామగారైన అన్నసామి హత్యకు గురయ్యారు. అల్లర్లలో మరణించిన వారి కుటుంబాలకు ప్రభుత్వం ఇచ్చిన ఎక్స్‌గ్రేషియాలో భాగంగా మామ మృతి కారణంగా ఇచ్చిన మొత్తాన్ని రెండు బాధిత వర్గాల పిల్లల ఆర్థిక సహాయానికి వినియోగించిన దానశీలి నల్లకన్ను. కులసంబంధిత ఉద్రిక్తతలు తగ్గించడంలో భాగంగా నల్లకన్ను సూచన మేరకు డీఎంకే ప్రభుత్వం జిల్లాలకు, రవాణా సంస్థల పేర్లను రాజకీయ నాయకుల పేర్లతో మార్చింది.

చాలామంది రాజకీయ నాయకులలాగా నల్లకన్ను ఎప్పుడూ వ్యక్తిగత సంపద కోసం వెంపర్లాడలేదు. ఆయన 80వ జన్మదినం సందర్భంగా సిపిఐ తమిళనాడు రాష్ట్ర సమితి కోటి రూపాయలు నిధి వసూలు చేసి ఇస్తే అదే వేదికపైనే తిరిగి పార్టీకి ఇచ్చేసిన త్యాగశీలి నల్లకన్ను. మరో దఫా 2008లో అంబేద్కర్ అవార్డు కింద లక్ష రూపాయలు నగదు బహుమతిగా ఇవ్వగా ఆ మొత్తాన్ని వేదికపైనే సిపిఐకి, రైతు సంఘానికి ఇచ్చివేశారు.''కడిగిన ముత్యం తుప్పు పట్టని నిజాయితీ'' అన్న అభిమానుల మాటలు తరచుగా గుర్తుండిపోయేలా ఆర్.నల్లకన్ను సంపద లేదా ఆస్తిని కాదు, ప్రజా జీవితంలో చెడిపోని సమగ్రత వారసత్వాన్ని నేడు వదిలివెళ్లారు. నల్లకన్ను ఆచరించిన కమ్యూనిస్టు నైతిక విలువలు పునరుత్తేజం కలిగిస్తాయి. తమిళనాడులో ప్రముఖ వ్యక్తిగా నిలిచారు, సామాజిక న్యాయం, అట్టడుగు వర్గాల హక్కుల కోసం చేసిన కృషికి నల్లకన్ను గుర్తింపు పొందారు.

ఎం.మురళీకృష్ణ, సీనియర్ జర్నలిస్టు
9949264036

## 'అరైవ్ అలైవ్ -2026'లో భాగంగా కుబీర్‌లో అవగాహన సదస్సు

ఎస్‌పి జానకి షర్మిల, ఐపిఎస్



**ప్రజాపక్షం/బైంసా :** ప్రజల ప్రాణ భద్రతను ప్రధానంగా దృష్టిలో ఉంచుకొని చేపట్టిన రెండవ దశ ''అరైవ్ అలైవ్ 2026''కార్యక్రమంలో భాగంగా ఈ రోజు బైంసా సబ్ డివిజన్ పరిధిలోని కుబీర్ పోలీస్ స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల పాల్గొని ''అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించి 30 మందికి హెల్మెట్ లను పంపిణీ చేశారు.అనంతరం ద్విచక్ర వాహన దారుల హెల్మెట్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు.ప్రతి ద్విచక్ర వాహనదారుడు బయటకెళ్ళేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని,హెల్మెట్ లేకుండా ప్రయాణించడం వల్ల జరిగే రోడ్డు ప్రమాదాలు,తలకు కలిగే తీవ్ర గాయాలు,ప్రాణ నష్టం వంటి ప్రమాదాల గురించి ప్రజలకు వివరించారు.హెల్మెట్ ఉపయోగించడం వల్ల జరిగే ప్రాణ నష్టాన్ని తగ్గించవచ్చని తెలిపారు.డ్రైవ్ చేయరాదని హెచ్చరించారు.హెల్మెట్ అనేది జరిమానా తప్పించుకోవడానికి కాదు.మన ప్రాణాలను కాపాడుకునే రక్షణ కవచం.జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్ తో పాటు,బైంసా ఏఎస్పీ రాజేష్ మీనా ఐపీఎస్,నిర్మల్ ఏ ఎస్పీ సాయి కిరణ్ ఐపీఎస్,ఇన్స్పెక్టర్లు,ఎస్ఐ లు,సిబ్బంది,చుట్టూ పక్కనా గ్రామాల్లోని సర్పంచులు,పెద్ద ఎత్తున స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## మొదటి రోజు ఇంటర్ పరీక్ష ప్రశాంతం

ఇంటర్ పరీక్షలకు 99.42 శాతం హాజరు





**ప్రజాపక్షం మెదక్ :** మెదక్ జిల్లాలో ప్రథమ సంవత్సరం ఇంటర్ పరీక్షలు మొదటి రోజు ప్రశాంతంగా ముగిసింది. బుధవారం జరిగిన పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 99.42 శాతం విద్యార్థులు హాజరయ్యారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించారు. జిల్లాలో మొత్తం 21 మండలాలు, నాలుగు మున్సిపాలిటీలు ఉండగా 28 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు.జిల్లాలో 6660 మంది విద్యార్థులు ప్రథమ సంవత్సరం వార్షిక పరీక్షలు రాయనుండగా, అందులో మొదటి రోజు 38 మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారు. మిగితా 6622 మంది విద్యార్థులు (ఒకేషనల్ కోర్స్ కలుపుకుని విద్యార్థులు) పరీక్షకు హాజరయ్యారు. జిల్లాలో ఎలాంటి ఆటంకాలు లేకుండా పరీక్షలు సాఫీగా నిర్వహించారు. పరీక్ష రాసే అభ్యర్థులకు ఎలాంటి సమస్యలు లేకుండా కేంద్రాలు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పరీక్షలకు సంబంధించి విద్యార్థుల సందేహాలను నివృత్తి చేసేందుకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూంను ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు.

## సబ్సిడీపై వ్యవసాయ యంత్రాల పంపిణీ



**ప్రజాపక్షం / కౌటాల :** రైతులకు అవసరమైన ఆధునిక సాగు యంత్రాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి పి. ప్రేమలత అన్నారు. బుధవారం కౌటాల మండల కేంద్రంలో సబ్ మిషన్ ఆన్ అగ్రికల్చరల్ మెకనైజేషన్ పథకం ద్వారా మంజూరైన వ్యవసాయ యంత్ర పరికరాలను రైతులకు పంపిణీ చేశారు.ఈ పథకం కింద 7 పెట్రోల్ పంపులు, 2 రోటోవేటర్లను లబ్ధిదారులకు అందజేశామని తెలిపారు. రోటోవేటర్లు, కల్టీవేటర్, పవర్ వీడర్, పవర్ టిల్లర్, వరి గడ్డి కట్టలు కట్టే బేలర్ వంటి పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వివరించారు. మండలానికి కేటాయించిన కోటా వివరాలను వెల్లడిస్తూ.. మొత్తం 78 బ్యాటరీ పంపులు, 31 పెట్రోల్ పంపులు, 12 రోటోవేటర్లు, 13 కల్టివేటర్లు, 3 బ్రష్ కట్టర్లు, 2 పవర్ టిల్లర్లు మంజూరైనట్లు పేర్కొన్నారు. ఎస్‌సి, ఎస్‌టి రైతులకు 50 శాతం సబ్సిడీ, జనరల్ రైతులకు 40 శాతం సబ్సిడీపై ఈ యంత్రాలు అందజేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఆసక్తి గల రైతులు మండల వ్యవసాయ కార్యాలయం లేదా ఏఇఓలను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు సిహెచ్ అంజన్న, జిఘన్ శ్యామ్, ఆర్ రేష్మిత లబ్ధిదారులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** 8వ వార్డులో బుధవారం సిసి రోడ్డు నిర్మాణ పనులను మున్సిపల్ చైర్మన్ బోదిరే నాగమణి (స్వామి) పనులను ప్రారంభించి మాట్లాడారు. టియుఎఫ్ఐడీసీ పథకం ద్వారా 11 కోట్లు మంజూరైన నిధుల్లో భాగంగా పట్టణంలో వివిధ వార్డులలో సిసి రోడ్లు, సిసి డ్రైనేజీల నిర్మాణం కల్వర్టులు, బిటి రోడ్ల నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు .అందులో భాగంగానే 8వ వార్డులో సిసి రోడ్ల పనులు ప్రారంభించటంజరిగిందని తెలిపారు. పట్టణంలో అన్ని వార్డులలో నిర్మించటం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ సంటి లత (జెజె నర్సయ్య)కౌన్సిలర్ సందీప్ నాయకులు పాల్గొన్నారు.

## బాధ్యతలు స్వీకరించిన చైర్మన్, వైస్‌చైర్మన్

**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** మున్సిపల్ చైర్‌పర్సన్‌గా బోదిరే నాగమణి (స్వామి), వైస్‌చైర్మన్‌గా సంటి లత (నర్సయ్య)లు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమీషనర్ గోపు గంగాధర్ చైర్మన్‌చే తొలి సంతకం చేయించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర విత్తనాభివృద్ధి కార్పోరేషన్ చైర్మన్ అన్వేష్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్‌లు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పాలకవర్గ సభ్యులను సన్మానించారు. చైర్‌పర్సన్ నాగమణి మాట్లాడుతూ భీమ్‌గల్ పట్టణ అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా పని చేస్తామని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు పట్టణంలో నెలకొన్న సమస్యలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పరిష్కరిస్తామని, నిలిచిపోయిన 100 పడకల ఆస్పత్రి పనులన్ని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకవస్తామని అన్వేష్‌రెడ్డి, సునీల్‌కుమార్‌లు ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌డీసీసీ వైస్‌చైర్మన్ రమేష్‌రెడ్డి, ఎఎంసి చైర్మన్ పాలెపు నర్సయ్య, కౌన్సిలర్లు పర్స కుశ లత అనంతరావు, ఆరేపల్లి శ్రీజ నాగేంద్ర బాబు, తోట సతీష్ సందీప్, సంగ్యానాయక్, అంజుమ్ అలీ, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కన్నె సురేందర్, మల్లెల లక్ష్మణ్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# పుష్కరాల్లో భక్తులకు లోటు లేకుండా తగిన సౌకర్యాలు : కలెక్టర్



**ప్రజాపక్షం/నిజామాబాద్/ఎడపలి:** రెంజల్ మండలంలోని కందకుర్తి పుష్కరఘాట్‌ను కలెక్టర్ ఇలా త్రి పాఠి బుధవారం సంబంధిత శాఖల అధికారుల తో క లిసి పరిశీలించారు. వచ్చే యేడాది 2027 లో జరగనున్న గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని జిల్లాలోని ప్రధానమైన ఈ పుష్కర ఘాట్‌ను క్షేత్రస్థాయిలో సందర్శించి అందుబాటులో ఉన్న సౌకర్యాలను పరిశీలించారు. పుష్కరఘాట్ పరిసరాలు పరిశుభ్రంగా ఉండటాన్ని గమనించిన కలెక్టర్ సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పుష్కరాల సమయంలోనే కాకుండా ఈ ప్రదేశానికి సాధారణ సమయాలలోనూ భక్తులు తరలి వస్తారని, వారి సౌకర్యార్థం పరిసరాల పరిశుభ్రతతో పాటు కనీస స దుపాయాలు భక్తులకు అందుబాటులో ఉండే లా చూడాలన్నారు. గోదావరి పుష్కరాలకు ఈ ఘాట్ వద్ద వీవీఐపీలు, లక్షలాదిగా భక్తులు పు ణ్యస్నానాలకు తరలివచ్చే అవకాశాలున్నందున ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా సౌకర్యా లు కల్పించాలని అధికారులను ఆదేశించా రు. ముఖ్యంగా వాహనాల పార్కింగ్, మరుగుదొడ్లు, తాత్కలిక గదులు, భక్తులు బస చేసేందుకు వీలుగా తగిన వసతి, షామియానాలు, వ ంటివి పక్కాగా అందుబాటులో ఉండాలన్నారు. భక్తులకు పూర్తిస్థాయిలో పటిష్ట భద్రత కలిగి ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. భక్తులు వంటలు చేసుకునేందుకు వీలుగా కిచెన్ షెడ్ నిర్మించాలని సూచించారు. ఘాట్ వద్ద ప్రమాదాలకు ఆస్కారం లేకుండా అన్ని జాగ్రత్త లు చేపట్టాలని హైమాక్స్ లైట్లు ఏర్పాటు చేయాలని, రహదారికి మరమ్మతులు జరిపించాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట బోధన్ సబ్‌కలెక్టర్ వికాస్ మహతో, దేవాదాయ శాఖ సహా య కమీషనర్ విజయరామారావు, అధికారులున్నారు.

## 'పది' మూల్యాంకన కేంద్రం ఏర్పాటు

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన పిఆర్‌టియు నేతలు

**ప్రజాపక్షం మెదక్ :** మెదక్ జిల్లా కేంద్రంలో పదవ తరగతి మూల్యాంకన కేంద్రంను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. మూల్యాంకన కేంద్రంను ఏర్పాటు చేసేందుకు సహకరించిన మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావు, జిల్లా కలెక్టర రాహుల్ రాజ్ కు మెదక్ జిల్లా పీఆర్టీయూ అధ్యక్షులు మేడి సతీష్ రావు, జనరల్ సెక్రటరీ సౌమ్య నాయక్ లు జిల్లా బాద్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టెన్త్ స్పాట్ వ్యాల్యేషన్ కేంద్రం సంగారెడ్డి జిల్లాలోని బిహెచ్ఈఎల్ ఉండేదని అందువల్ల మెదక్ ఉపాధ్యాయులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారని తెలిపారు. ఈ సంవత్సరం మెదక్ జిల్లాలో పదవ తరగతి పరీక్షల మూల్యాంకన కేంద్రం ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. దింతో ఉపాధ్యాయులకు మేలు జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ బాద్యులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ పరీక్షా కేంద్రాల్లో

కలెక్టర్ కుమార్ దీపక్ తనిఖీ



**ప్రజాపక్షం / మంచిర్యాల :** జిల్లాలో ఇంటర్మీడియట్ వా ర్షిక పరీక్షలను పకడ్బంధీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆల్ఫోర్స్ జూనియర్ క ళాశాల, వేంపల్లిలోని ఎస్‌ఆర్ఆర్ కళాశాల పరీక్షా కేంద్రాలను ఆయన సందర్శించి తనిఖీ చేశారు.జిల్లాలో ఫిబ్రవరి 25 నుంచి మార్చి 16 వరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని, ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా 23 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. పరీక్షల విధుల్లో భాగంగా ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను నియమించామని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తుతో పాటు 163 బిఎన్ఎస్ఎస్ సెక్షన్ అమలు చేయాలని, సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని, విద్యార్థుల కోసం టిజిఎస్ఆర్టిసి బస్సులు ఏర్పాటు చేయాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని సూచించారు. ప్రతి కేంద్రంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి మందులు అందుబాటులో ఉంచాలని, పారిశుద్ధ్య నిర్వహణ పక్కాగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు.జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి అంజయ్య, హాజీపూర్ మండల తహసీల్దార్ శ్రీనివాస్ రావు దేశ్ పాండే, అధికారులు పాల్గొన్నారు.

## పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



**ప్రజాపక్షం / గజ్వేల్ :** పేదల సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం కాగా, అర్హులైన ప్రతి కుటుంబానికి పథకాలు వర్తింప చేస్తామని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. బుధవారం వర్గల్ మండల కేంద్రంలో ఇందిరమ్మ నూతన గృహప్రవేశాలు చేయించిన సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. గజ్వేల్ నియోజకవర్గంలో 3 వేల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా, అర్హులైన ప్రతి ఒక్కరికి ఇండ్లు కేటాయిస్తామని స్పష్టం చేశారు. ముఖ్యంగా మహిళా సాధికారత లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి దృష్టి సారించగా, మహిళల చేతుల్లోనే కుటుంబ ఆర్థిక స్థితిలో బాగుంటాయనే లక్ష్యంతో ప్రభుత్వ పథకాలను మహిళల పేరిటనే కేటాయిస్తున్నట్లు చెప్పారు. అలాగే కొత్త రేషన్ కార్డుల మంజూరుతో పాటు పాత కార్డులలో సభ్యులను చేర్చి సన్న బియ్యం పంపిణీ చేస్తున్నట్లు స్పష్టం చేశారు. అంతే కాకుండా పంట రుణ మాఫీ, రైతు భరోసా, సన్నధాన్యానికి రూ. 500 బోనస్ తదితర సాహసోపేత నిర్ణయాలతో పాటు గృహ జ్యోతి పథకం కింద 200 యూనిట్ల లోపు ఉచిత కరెంట్, రూ 500కే వంట గ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, మహిళలకు వడ్డీ లేని రుణాలు తదితర అందజేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ మోహన్, వైస్ చైర్మన్ ప్రభాకర్ గుప్త, ఉప సర్పంచ్ గోవర్ధన్ రెడ్డి, మాజీ సర్పంచ్ గోపాల్ రెడ్డి, పంచాయతీ రాజ్ సంఘటన్ జిల్లా అధ్యక్షులు కడపల నర్సింహారెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షులు బాల్రెడ్డి, నేతలు తవిటి కిష్టయ్య గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, ప్రవీణ్ గౌడ్, అరవింద్ రెడ్డి, మహేందర్ గౌడ్, వహీద్, యాదయ్య యాదవ్, అయ్యగళ్ళ ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# చిత్తడి నేలల పరిరక్షణతోనే పర్యావరణ సమతుల్యత

ఉమ్మడి సర్వేలు చేపట్టి గుర్తింపు ప్రక్రియ పూర్తి చేయాలి : జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్..



**ప్రజాపక్షం/నిర్మల్ :** ప్రకృతి సమతుల్యతను కాపాడటంలో చిత్తడి నేలలు(వెట్ ల్యాండ్స్)అత్యంత కీలకపాత్ర పోషిస్తాయని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పేర్కొన్నారు.బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో చిత్తడి నేలల గుర్తింపు, సంరక్షణపై సంబంధిత శాఖల అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,జిల్లాలో ఉన్న చిత్తడి నేలలను శాస్త్రీయంగా గుర్తించి,వాటిని అభివృద్ధి పరిచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ ప్రక్రియలో భాగంగా అటవీ,రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించి,సంయుక్తంగా క్షేత్రసాయి సర్వేలు నిర్వహించాలని సూచించారు. చిత్తడి నేలల వల్ల భూగర్భ జలమట్టం పెరగడమే కాకుండా,జీవవైవిధ్యం పెంపొందుతుందని వీటిని కాపాడుకోవడం మనందరి బాధ్యత అని స్పష్టం చేశారు.జిల్లాలో గుర్తించిన చిత్తడి నేలలను కేవలం పర్యావరణ దృక్కోణంలోనే కాకుండా,పర్యాటక కేంద్రాలుగా కూడా తీర్చిదిదే అవకాశం ఉందని కలెక్టర్ అభిప్రాయపడ్డారు.దీని వల్ల స్థానికంగా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు.ఈ గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేసి,సమగ్ర నివేదికను అందజేయాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా అటవీ శాఖాధికారి (డిఎఫ్ఓ) సుశాంత్ సుఖదేవ్ బోబడే,జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి విజయలక్ష్మి ,జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్,జెడ్పీ సీఈవో శంకర్,జిల్లా పరిశ్రమల మేనేజర్ నరసింహ రెడ్డి,మత్స్య శాఖ ఏడి రాజ నర్సయ్య,అధికారులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ ఆస్పత్రిలోయువకుడి అనుమానాస్పద మృతి

వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటున్నబాధితుల ఆరోపణ



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** నగరంలో ప్రైవేట్ ఆస్పత్రిలో ఓయువకుడు అనుమానాస్పదంగా మృతిచెందిన సంఘటన జిల్లా కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. ఆస్పత్రిలో మత్తు వైద్యుల నిర్లక్ష్యం కారణంగా ఈ ఘటన జరిగిందని మృతుని బంధువులు ఆరోపిస్తున్నారు. బాధిత కుటుంబసభ్యులు గంగం రాజమణి, నర్సయ్య తెలిపిన వివరాల ప్రకారం నగరంలోని ఖలీల్ వాడిలోని ద్వారకా ప్రైవేట్ ఆస్పత్రిలోభీమ్‌గల్ మండలంపల్లికొండకు చెందిన గంగం అజయ్(22) చెవినొప్పితో మంగళవారం సాయంత్రం ఆస్పత్రిలో అడ్మిట్ చేయగా బాధితుడు అజయ్‌ను పరిశీలించిన చెవి వైద్య నిపుణుడు ఆపరేషన్ చేయాలని చెప్పటంతో ఆపరేషన్ కోసం అన్ని సిద్ధం చేసుకుని మత్తు వైద్యుడిని పిలిపించారని తెలిపారు. ప్రైవేట్ ఆస్పత్రికి మృతదేహాన్ని చికిత్స అందించిన ఆస్పత్రి ఎదుట ఉంచి ఆందోళన చేస్తున్నారు. మత్తు ఇంజక్షన్‌తోనే అజయ్ మృతి చెందాడని తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తప్పు జరిగిందనివైద్యులు ఒప్పుకున్నట్లు తెలుస్తుంది.

## బివిఆర్ఐటిలో భాజా సే బగ్గి పోటీలు షురూ

ఈ పోటీలను ప్రారంభించిన జెఎన్‌టియు వైస్ ఛాన్స్ లర్ ప్రొఫెసర్ టి కిషన్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/నర్సాపూర్:** నర్సాపూర్ పట్టణ సమీపంలోని బివిఆర్ఐటి ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం జాతీయ స్థాయి మెకానికల్ బాజా సే ఇండియా 2026 భగ్గి పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు దేశవ్యాప్తంగా 51 ఇంజనీరింగ్ కళాశాల నుంచి 1500 కు పైగా విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు. అయితే ఈ బగ్గి పోటీల ప్రారంభోత్సవ నికి ముఖ్యఅతిథిగా హాజరైన జేఎన్‌టి యూ హైదరాబాద్ వైస్ ఛాన్స్ లర్ డాక్టర్ ప్రొఫసర్ టి కిషన్ కుమార్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి ఈ బగ్గి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ అంతర్గత దహన యాత్రల నుంచి ఎలక్ట్రిక్ వాహనాలకు మారుతున్న నేటి యుగంలో అభివృద్ధి చెందుతున్న ఈవీ టెక్నాలజీల చుట్టూ ఉన్న అనిశ్చితుల గురించి వివరించారు. ముఖ్యంగా ఏ ఎల్ గా అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీల ప్రభావంతో వేగవంతంగా మారుతున్న ప్రకృతి దృశ్యంలో విద్యార్థులు ఆచరణాత్మక అనుభవాన్ని పొందడం యొక్క ప్రాముఖ్యతను తెలియజేశారు. బాజా వంటి కార్యక్రమాలు విద్యార్థుల బహిర్గత విశ్వాసాన్ని పెంపొందించడం కంపెనీలు చురుకుగా కోరుకునే నైపుణ్యాల అభివృద్ధికి ఘననీయంగా దోహదపడతాయని ఆయన అన్నారు.పరిశ్రమ, విద్యాసంస్థల మధ్య బలమైన అనుబంధాన్ని ఏర్పరుస్తూ భవిష్యత్తు మొబిలిటీ సవాలను ఎదుర్కునే సామర్థ్యాన్ని విద్యార్థులు పెంపొందిస్తుందని తెలిపారు. విష్ణు ఎడ్యుకేషనల్ సోసైటీ కార్యదర్శి శ్రీ ఆదిత్య విస్సాం మాట్లాడుతూ బి వి ఆర్ ఐ టి లో సాంకేతిక అభివృద్ధి వినూత్న కార్యక్రమాలకు ఎల్లప్పుడూ ప్రాధాన్యంత ఇస్తూ వరుసగా మూడు సంవత్సరాల పాటు బాజా సే ఇండియా పోటీలు తమ కళాశాలలో నిర్వహించడం తమకు ఎంతో గౌరవంగా ఉందని తెలియజేశారు.మల్లికార్జున్.అన్ని విభాగాల డీన్ లు ఫ్యాకల్టీ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎరువులు పక్కదారి పట్టకుండా పటిష్ఠ చర్యలు

వ్యవసాయ శాఖ అధికారి స్వరూప రాణి



**ప్రజాపక్షం / గజ్వేల్:** రైతుల అభ్యున్నతిని దృ ష్టిలో పెట్టుకొని ఎరువులు పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకోవడంతో పాటు రాష్ట్రంలో వినూత్నంగా మొబైల్ ఎరువుల బుకింగ్ యాప్ ను అందుబాటులోకి తెచ్చినట్టు సిద్దిపేట జిల్లా వ్యవసాయ శాఖ అధికారి స్వరూప రాణి స్పష్టం చే శారు. బుధవారం గజ్వేల్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. రై తులకు సరైన కీలక సమయంలో, సరైన ఎరువులను ఈ యాప్ ద్వారా అందుబాటులోకి తేనున్నట్లు పేర్కొన్నారు. ఫర్టిలైజర్ దుకాణాల వద్ద పడిగాపులు పడకుండా అన్నదాతలు నేరుగా త మ ఇంటి నుండే అవసరం ఉన్న ఎరువులను బు క్ చేసుకోవచ్చని చెప్పారు. పంట ముఖ్య దశల్లో ఆలస్యం జరిగితే దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతుందని, అలాగే బ్లాక్ మార్కెటింగ్, ఆందోళనతో ఎక్కువగా కొనుగోలు చేయడం వంటి సమస్య నివారించేందుకు మొబైల్ ఎరువుల బుకింగ్ యాప్‌కు శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. రైతుల సౌలభ్యం, పారదర్శకత, శాస్త్రీయంగా ఎ రువుల కేటాయింపు లక్ష్యంగా దృష్టి పెట్టినట్లు స్పష్టం చేశారు. అపోహలకు వెళ్ళవద్దని, వారి సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని చర్యలు చేపట్టినట్లు తెలిపా రు. ఎరువుల వివరాలు తెలుసుకోవడంతో పా టు రోజుల తరబడి ఎదురుచూడకుండా, క్యూలైన్లలో నిలబడకుండా సదరు షాప్ నుండి అనుమతి వస్తుందని, ఈ యాప్ ద్వారా నిజమైన సా గుదారులకు న్యాయం జరుగుతుందని స్పష్టం చేశారు. పంటలు సాగుపై రైతులకు అవగాహన వస్తుందని, సమర్థ వంతమైన ఎరువుల వినియోంగ, పోషక పదార్థాల సమతుల్యత, పంట ఆరోగ్యం, ఎరువుల కొనుగోలు తదితర అధికారులు పర్యవేక్షణ చేయవచ్చని వివరించారు. ఎడిఏ బాబు నాయక్, వ్యవసాయ అధికారి నాగరాజు పాల్గొన్నారు.

# ఔట్ గోయింగ్ శిక్షణార్థుల కోసం 'ఆన్‌ది జాబ్ ట్రైనింగ్'

మారుతున్న కాలానికి అనుగుణంగా యువత తమ నైపుణ్యాలను అప్‌గ్రేడ్ చేసుకోవాలి : కలెక్టర్ ప్రావీణ్య




**పజాపక్షం /సంగారెడ్డి :** సంగారెడ్డి లోని ప్రభుత్వ ఐటిఐ ,ఏటీసీ సెంటర్‌లో అవుట్ గోయింగ్ శిక్షణార్థుల కోసం ఆన్‌ది. జాబ్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని బుదవారం విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉపాది ,శిక్షణ శాఖ డైరెక్టర్ ఎన్ కాంతి వేస్లీ ,జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ కాంతి వెస్లీ మాట్లాడుతూ ఆధునిక టెక్నాలజీతో రాష్ట్ర ప్రభుత్వం ఏటీసీ కేంద్రాలను ప్రారంభించిదని ,ఇక్కడ శిక్షణ పొందుతున్న విద్యార్థులు, భవిష్యత్తులో మంచి ఇంటర్ ప్రెన్యూర్లుగా ఎదగాలని ఆకాంక్షించారు. పరిశ్రమ వాస్తవ పని పరిస్థితులపై అవగాహన కల్పించడం ,ఆధునిక నైపుణ్యాల అభివృద్ధి శిక్షణ అనంతరం ఉపాది అవకాశాల మెరుగుదల ఈ కేంద్రాల ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా యువత తమ నైపుణ్యాలను అప్గ్రేడ్ చేసుకోవాలని సూచించారు. ఆధునిక టెక్నాలజీని అందిపుచ్చుకుంటే స్థానిక యువతకు మరిన్ని ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని అన్నారు. ప్రభుత్వ ఏటిసి సెంటర్లు ,యువత ఉపాది అవకాశాలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 13 విభిన్న ట్రేడ్‌లకు చెందిన 279 మంది శిక్షణార్థులు పాల్గొన్నారు. పరిశ్రమల ప్రతినిధులతో విద్యార్థులు ప్రత్యేక్షంగా చర్చించి తమ సందేశాలకు సమాదానాలు పొందారు. ఈ సందర్భంగా పలు పరిశ్రమలు ఎంపిక చేసిన శిక్షణార్థులకు ఆఫర్ లెటర్లు అందజేశారు. ఎంపికైన వారికి రూ. 10 వేల నుండి 15.500 వరకు స్టైపెండోల ఆన్‌ది జాబ్ ట్రైనింగ్ అవకాశాలు కల్పించారు. ఈకార్యక్రమంలో ప్రాంతీయ ఉపడైరెక్టర్ ఎస్ రాజా ప్రభుత్వ ఐటిఐ సంగారెడ్డి ప్రిన్సిపాల్ డి. తిరుపతి రెడ్డి, ప్రభుత్వ ఐటిఐ పటాన్‌చెరు ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, LET&F ప్రత్యేక అధికారి శ్రీనివాస్‌రావు ,ఏటిఓ కలీమ్, బెగ్ టీఓలు మహేష్ రాఘవేంద్ర బిల్లా ఈ ఎస్ కళ్యాణ జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## 5,000 లీటర్ల గుడుంబా ధ్వంసం



**ప్రజాపక్షం / కోటపల్లి :** మంచిర్యాల జిల్లా నీల్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలోని బుయ్యారం గ్రామంలో పోలీసులు, ఎక్సైజ్ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించి గుడుంబా స్థావరాలను ధ్వంసం చేశారు. బుధవారం చెన్నూరు రూరల్ సిఐ కృష్ణ, ఎస్ఐ జగదీశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో సుమారు 40 మంది సిబ్బందితో కలిసి గ్రామంలో ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. ఈ తనిఖీల్లో 20 గుడుంబా తయారీ కేంద్రాలను గుర్తించి, సుమారు 5,000 లీటర్ల పులియబెట్టిన బెల్లం మిశ్రమాన్ని (పానకం) నేలపాలు చేశారు.అక్రమంగా గుడుంబా తయారు చేయడం, విక్రయించడం చట్టరీత్యా నేరమని, ఎవరైనా ఇటువంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని, చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. గ్రామాల్లో గుడుంబా నిర్మూలనకు ప్రజలు సహకరించాలని కోరారు. చెన్నూరు ఎక్సైజ్ సిఐ హరి, మంచిర్యాల డిటిఎఫ్ సిఐ సమ్మయ్య, ఎస్ఐలు రమణ, శారద, పోలీస్, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

## అగ్నిప్రమాదంలో ఇల్లు దగ్ధం



ప్రజాపక్షం/రాయికల్ : రాయికల్ మండలం చెర్ల కొండాపూర్ గ్రామానికి చెందిన పెండల రజిని అనే మహిళా ఇల్లు విద్యుత్ వైర్లకు మంటలు రావడంతో రేకుల కింద ఉన్న బట్టలు నిత్యావసర సరుకులు పూర్తిగా దగ్ధమయ్యాయి కాగ స్థానికులు స్పందించి మంటలు ఆర్పడంతో ప్రాణ ప్రమాదం తప్పింది.ఇంట్లో నిత్యావసర సరుకులు బట్టలు తదితర గృహ వినియోగ విద్యుత్ పరికరాలు మంటల్లో కాలిపోవడంతో పూర్తిగా రోడ్డున పడ్డామని ఇల్లు బాగు చేసుకునే ఆర్థిక స్థోమత లేక బస్టాండ్ సమీపంలో ఖాళీగా వాటర్ ప్లాంట్‌లో జీవనం సాగిస్తున్నామని ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని మరియు తక్షణమే ఇల్లు మంజూరు చెయ్యాలని బాధితురాలు విజ్ఞప్తి చేసింది.

## ఎస్సారెస్పీ కెనాల్‌లో గుర్తు తెలియని మృతదేహం

ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్ : చొప్పదండి మండలం పెద్ద కురుమపల్లి గ్రామ శివారు ప్రాంతంలోగల జంగముని కుంట పక్కన ఎస్సారెస్పీ కెనాల్‌లో బుధవారం గుర్తు తెలియని పురుషుని మృతదేశం లభ్యమైందని ఎస్ఐ నరేష్ రెడ్డి తెలిపారు. వయస్సు సమారు 40 నుంచి 50 సంవత్సరాలు ఉంటుందని, ఎత్తు సుమారు 5 అడుగుల 6 అంగుళాలు, డెడ్‌బాడీ గుర్తు తెలియని విధంగా ఉబ్బి ఉందని పేర్కొన్నారు. తలపై తెల్ల వెంట్రుకలు, ఒంటిపై గ్రీన్ కలర్ లైట్ క్రీం కలర్ ఆఫ్ షర్ట్.. ఇలా మూడు ఫ్యాంట్స్ ధరించి ఉన్నాడని తెలిపారు. అందులో ఒకటి జీన్స్ షార్ట్ దరించి ఉన్నాడని తెలిపారు. ఒకటి జీన్స్ షార్ట్ నెక్కర్, నలుపు రంగు ప్యాంటు, మరొకటి లోయర్ ధరించి ఉన్నాడని పేర్కొన్నారు. ఇతని వేషధారణ బట్టి మతిస్థిమితం లేకుండా ఉన్నట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇట్టి విషయంపై గ్రామ పాలన అధికారి రమేష్ ధరఖాస్తు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ రెడ్డి తెలిపారు.

## అప్పుల బాధ భరించలేక వ్యక్తి ఆత్మహత్య



ప్రజాపక్షం/మల్యాల : కుటుంబ కలహాలతో తీవ్ర మనస్థాపనికి గురై యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన జగిత్యాల జిల్లా మల్యాల మండలం నూకపల్లి రెండు పడకల గది సముదాయంలో బుధవారం చోటు చేసుకుంది. మల్యాల ఎస్సై నరేష్ కుమార్ కథనం ప్రకారం జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్ గ్రామానికీ చెందిన వల్లేపు మహేష్ (38) తనకున్న అప్పుల కారణంగా తరచుగా ఇంట్లో గొడవ పడేవాడు. ఈ క్రమంలో మంగళవారం బార్య భార్య భర్తల మధ్య అప్పుల విషయంలో గొడవ జరిగింది. ఆ విషయాన్ని మనసులో పెట్టుకొని తీవ్ర మనస్థాపానికి గురై ఇంట్లో నుండి వెళ్ళిపోయి తనకు కేటాయింపబడిన నూకపల్లి డబుల్ బెడ్ రూమ్‌లో ఉన్న ఫ్యానుకు ఉరివేసుకొని చనిపోయినట్లు ఎస్సై వివరించారు. మృతుడి తండ్రి రాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## వాహనం ఢీకొని రైతు మృతి

ప్రజాపక్షం/హుస్నాబాద్ : హుస్నాబాద్ పట్టణానికి చెందిన రైతు తన వ్యవసాయ పనులు ముగించుకుని ఇంటికి వస్తున్న క్రమంలో పట్టణంలోని రోడ్డు దాటుతుండగా బొలెరొ వాహనం ఢీకొన్న సంఘటనలో రైతు తీవ్రగాయాలై మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం హుస్నాబాద్ పట్టణానికి చెందిన కేశవేణి సంపత్ (55) రైతు మంగళవారం సాయంత్రం సిద్దిపేట రోడ్డులోని వ్యవసాయ పనులు ముగించుకుని భార్యతో కలిసి ఇంటికి వస్తుండగా పట్టణ సమీపంలో ప్రభాకర్‌రావు విగ్రహం వద్ద రోడ్డు దాటుతుండగా సిద్దిపేట నుండి వస్తున్న బొలెరొ వాహనం అతి వేగంగా ఢీ కొట్టింది. దీంతో తీవ్రగాయాలు అయిన సంపత్‌ను 17 వార్డు కౌన్సిలరు గాదెపాక రవిందర్ సమాచారం తెలుసుకుని సంఘటన స్థలం వద్దకు వచ్చి బాధితుడిని వెంటనే ప్రభుత్వ అసుపత్రి తరలించి ప్రథమ చికిత్స చేయించి మెరుగైన వైద్యం కొసం కరీంనగర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. బుధవారం కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతునికి ఇద్దరు కుమారులు, భార్య ఉన్నారు.

## ఎసిబి తనిఖీల్లో మండల వ్యవసాయ అధికారి సస్పెన్షన్

### జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ : ఎసిబి తనిఖీల్లో చిక్కిన పెద్దపల్లి మండల వ్యవసాయ అధికారి కే.అలివేణిని సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పెద్దపల్లి మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో జరుగుతున్న అవకతవకల గురించి సమాచారం అందుకున్న ఎసిబి శాఖ ఫిబ్రవరి 24న ఆకస్మిక తనిఖీలు నిర్వహించిందని, ఆ తనీఖీలలో పట్టుబడిన పెద్దపల్లి మండల వ్యవసాయ అధికారి కే. అలివేణిని సస్పెండ్ చేస్తున్నామని, మండల వ్యవసాయ అధికారిపై క్రమశిక్షణ చర్యలు విచారణ ముగిసే వరకు ఈ సస్పెన్షన్ కొనసాగుతుందని, సస్పెన్షన్ కాలంలో అనుమతి లేకుండా హెడ్ క్వార్టర్ వదిలి వెళ్ళడానికి వీలు లేదని ఆ ఉత్తర్వులలో కలెక్టర్ పేర్కొన్నారు.

## బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం

### రేపటినుండి 13 రోజుల పాటు ఉత్సవాలు

### అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

ప్రజాపక్షం/ధర్మపురి : సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం జగిత్యాల జిల్లా ధర్మపురి శ్రీ లక్ష్మి నృసింహస్వామి, శ్రీ వెంకటేశ్వర స్వామి వారల వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 27 నుండి మార్చి 11 వరకు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. శుక్రవారం సాయంత్రం 6గంటలకు పుట్ట బంగారం సేకరణ కార్యక్రమంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. జాతర జరుగు 13రోజుల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని దేవాదాయ శాఖ, మున్సిపల్ అధికారులతో పాటు ఇతర శాఖల అధికారులను ధర్మపురి ఎమ్మెల్యే,రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్, జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్‌లు ఆయా శాఖల బాధ్యులను ఆదేశించారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు యుద్ధప్రాతిపదికన పూర్తి అవుతున్నాయి. ఈనెల 28న జరిగే ముప్వురు స్వాముల కళ్యాణ మహోత్సవ కార్యక్రమ వేదిక స్థలంలో పనులు వేగంగా సాగుతున్నాయి. స్థానిక రైస్ మిల్లర్లు, వ్యాపారుల సహాకారంతో 13 రోజుల పాటు ఉచిత అన్నదానానికి దేవస్థానం పక్షాన ఓల్డ్ టీటీడీ కళ్యాణమంటపంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. పోలీస్ శాఖ నుండి జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాలతో డిఎస్పీ రఘుచందర్ ఆధ్వర్యంలో ధర్మపురి సిఐ రాం నర్సింహ రెడ్డి, ఎస్సైలు గురుక మహేష్,మిర్యాల రవీందర్ లు,ప్రత్యేక పోలీసు బలగాలతో అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా బందోబస్తు చర్యలు తీసుకోనున్నారు. మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్, జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్‌లు అన్ని శాఖల అధికారులను సమన్వయంతో ముందుకు వెళ్లి ఉత్సవాలు విజయవంతం చేయాలని ఆదేశించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు జక్కు రవీందర్, దేవస్థానం ఈవో సంకటాల శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ ఎం.శ్రీనివాసరావు, ధర్మపురి సిఐ రాంనర్సింహారెడ్డి తదితరులు ఇప్పటికే పలు మార్లు క్షేత్రస్థాయిలో కావాల్సిన ఏర్పాట్లపై చర్చించారు.

# నాయకులుగా కాదు.. సేవకులుగా పనిచేయాలి

### సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మ ణ్ కుమార్



ప్రజాపక్షం/ధర్మపురి : ప్రజలిచ్చిన అధికారాన్ని దుర్వినియోగం చేయకుండా ఎవరినీ ఇబ్బందులకు గురిచేయకుండా పాలన కొనసాగించాలని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ వికలాంగులు, వయోవృద్ధుల శాఖా మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ అన్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే నాయకునిగా కాకుండా సేవకుడిలా పనిచేయాలని ఆయన తెలిపారు. జగిత్యాల జిల్లా ధర్మపురి మున్సిపల్ నూతన పాలకవర్గం బుధవారం బాధ్యతలు స్వీకరించగా మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ ఎన్నికల్లో ధర్మపురి లోని మొత్తం 15 వార్డుల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించిన ప్రజల రుణం తీర్చుకుంటానని మంత్రి అన్నారు. మరో మూడేళ్ల కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని ప్రభుత్వం నుండి అవసరమైన నిధులు తీసుకువచ్చి అన్ని మౌళిక సదుపాయాలు కల్పిస్తామని అన్నారు. వేసవిలో నీటి ఎద్దడి లేకుండా ప్రతీ ఇంటికీ తాగునీరు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులకు, కౌన్సిల్‌కు సూచించారు. పట్టణంలో రూ.30 కోట్లతో పనులు కొనసాగుతున్నాయని మరికొన్ని టెండర్లు దశలో ఉన్నాయని చెప్పారు. 2027 గోదావరి పుష్కరాలను ధర్మపురిలో బ్రహ్మాండంగా నిర్వహించేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో వుందని మంత్రి తెలిపారు. దీనిలో భాగంగా ఈనెల 27న ప్రతినిధులు క్షేత్రానికి వచ్చి అవసరమైన పనులకు అంచనాలు సిద్ధం చేస్తారని అన్నారు. బాసర నుండి భద్రాచలం వరకు గోదావరి నదీతీర పుణ్యక్షేత్రాలలో పుష్కరాలను వైభవంగా నిర్వహించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వేల కోట్ల నిధులు ఇస్తామని మాట ఇచ్చినట్లు మంత్రి అడ్లూరి చెప్పారు. త్వరలోనే తాను ధర్మపురిలో స్థిరనివాసం ఏర్పాటు చేసుకుంటానని తెలిపారు. మున్సిపల్ నూతన పాలకవర్గం ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా జవాబుదారీతనంతో పాలన అందించాలని మంత్రి లక్ష్మ ణ్ కుమార్ ఆకాంక్షించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి, వైస్ చైర్మన్ ఇందారపు రామయ్య, కౌన్సిల్ సభ్యులను మంత్రి శాలువలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.రాజగౌడ్, మున్సిపల్ కమిషనర్ ఎం.శ్రీనివాసరావు, తహసీల్దార్ ఏరుకొండ శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ చిలుముల లావణ్య, దేవస్థానం చైర్మన్ జక్కు రవీందర్ పాల్గొన్నారు.

## జిడికె 11 ఇంక్లైన్‌లో ప్రమాదం

### కార్మికుడికి గాయాలు

### పరామర్శించిన ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్



ప్రజాపక్షం/పెద్దపల్లి : సింగరేణి ఆర్జీ వన్ ఏరియాలోని జీడికే 11 ఇంక్లైన్ లో బుధవారం తెల్లవారుజామున ప్రమాదం జరిగి కోల్ కట్టర్ కార్మికుడు ఐలయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. గనిలో బ్లాస్టింగ్ అనంతరం చెటాయి చేస్తుండగా సైడ్ ఫాల్ కావడంతో కార్మికుడికి నడుము, కుడికాలుపై బొగ్గు పెల్లలు పడి తీవ్ర గాయాలయ్యాయి. గాయాలైన కార్మికున్ని గోదావరిఖని సింగరేణి ఏరియా హాస్పిటల్‌కి తరలించిన విషయం తెలిసిన వెంటనే గుర్తింపు సంఘం ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్, జి.ఎం.కమిటి మెంబర్ సిద్దమల్ల రాజు, గని ఫిట్ సెక్రటరీ నాయిని శంకర్‌లు ఏరియా హాస్పిటల్‌కు వెళ్లి గాయపడిన కార్మికుడిని పరామర్శించిన అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ కార్పొరేట్ హాస్పిటల్‌కు రెఫర్ చేయాలని వారు ఏరియా హాస్పిటల్ డాక్టర్ లకు కోరగా వారు కార్మికుడిని హైదరాబాద్‌కు పంపించారు.

## ఇంటర్ పరీక్షా కేంద్రాల్లో తనిఖీలు

### జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



ప్రజాపక్షం/కరీంనగర్ : జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రారంభమైన నేపథ్యంలో పలు పరీక్ష కేంద్రాలను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తనిఖీ చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల (ఆర్ట్స్ కామర్స్), ముకరంపురాలోని నారాయణ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన ఇంటర్ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సౌకర్యాలను, సీసీ కెమెరా వ్యవస్థను పరిశీలించారు. ఒకేషనల్ కోర్సులు కలుపుకొని జిల్లాలో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు 15,389 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా మొదటిరోజు 400 మంది గైర్హాజరయ్యారు. 14,989 మంది పరీక్షలు రాశారు. మాల్ ప్రాక్టీస్ వంటి ఘటనలు ఏమీ చోటు చేసుకోలేదు.

# మహిళల ఫిర్యాదులపై వెంటనే స్పందించాలి

### స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే



ప్రజాపక్షం/కరీంనగర్ : మహిళల నుంచి వచ్చే ఫిర్యాదులపై అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే ఆదేశించారు. లైంగిక వేధింపుల నిర్మూలన చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. బుధవారం కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళా సాధికారిత కేంద్రం ద్వారా పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిర్మూలన చట్టం 2013పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో లోకల్ కమిటీ మెంబర్ రాజా రెడ్డి ఈ చట్టంపై అవగాహన కల్పించారు. పని ప్రదేశాల్లో మహిళల రక్షణ కోసం ఈ చట్టం ఎంత ముఖ్యమో వివరించారు. లైంగిక వేధింపుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు పద్ధతులపై అవగాహన కల్పించారు. ఫిర్యాదులకు సంబంధించిన అంశంపై వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే హాజరై మాట్లాడారు. జిల్లాలో మండల స్థాయిలో ఎంపీడీవోలు నోడల్ అధికారులుగా, మున్సిపల్ పరిధిలో మున్సిపల్ కమిషనర్లు నోడల్ అధికారులుగా వ్యవహరించాలని తెలిపారు. ఇంటర్నల్ కంప్లైంట్ కమిటీలు (ఐసిసి) ఏర్పాటు చేసి, మహిళల ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ పరిష్కరించాలని పేర్కొన్నారు. నోడల్ అధికారులు చట్టం గురించి సందేహాలను అడిగి తెలుసుకున్నారు. పని ప్రదేశాల్లో మహిళలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ప్రశాంతమైన వాతావరణం కల్పించాల్సిన అవసరం అధికారులపై ఉందని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. ఇందుకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఎం.సరస్వతి, మున్సిపల్ కమిషనర్లు, సిడిపిఓలు, ఎంపీడీవోలు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

### నాణ్యతలేని ఆహారం వడ్డించటంపై సీరియస్

### ఎస్ఒపై చర్యలు తీసుకోవాలని డిఇఒకు ఫోన్ ద్వారా ఆదేశించిన కలెక్టర్



ప్రజాపక్షం/సిద్దిపేట : సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్ గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని జిల్లా కలెక్టర్ హైమావతి బుధవారం అకస్మీకంగా సందర్శించి మధ్యాహ్న భోజన ప్రక్రియను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. బిర్యాని అన్నం నాణ్యత సరిగ్గా లేదని, బిర్యానిలో ఆకు లేకుండా ఎలా వండారని వంట సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వంటల నాణ్యత రుచికరంగా ఉండాలని వంట సిబ్బందిని ఆదేశించారు. స్టోర్ రూంలో కూరగాయాలు, వంట సరుకులను పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్‌ను వెరిఫై చేశారు. వేసిన పంటలకు రిజిస్టర్ రాసినసరుకులను అస్సలు పొంతన లేదని ఎస్ఓ ఆగ్రహం వ్యక్తం చేస్తూ యాక్షన్ తీసుకోవాలని డిఈఓను ఫోన్ ద్వారా ఆదేశించారు.విద్యాలయంలో మరుగుదొడ్లు. చుట్టు ప్రక్కల ఎల్లప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని, ప్రహరిగోడపై సోలార్ ఫినిషింగ్ ఉండేలా చూసుకోవాలని ఎస్ఓను ఆదేశించారు.

**లక్ష్మిదేవిపల్లిలో జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలలను...**

సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట మండలం లక్ష్మి దేవిపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను బుధవారం అకస్మీకంగా తనిఖీ చేశారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన ప్రక్రియను పరిశీలించారు. మెనుప్రకారం ఆకుకూరలు, పప్పు ఎందుకు వేయటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కామన్ డైట్ మెనుపాటిస్తూ విద్యార్థులకు హాజరు ప్రకారం ప్రతి విద్యార్థికి సరిపోయేవిధంగా వడ్డించాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. మార్చి 14 నుండి జరుగనున్న పరీక్షలను అత్యంత పకడ్బందీగా సిద్ధం కావాలని. సిలబస్‌ను ఎక్కువ సార్లు రివిజన్ చేయాలని తెలిపారు. సోషల్ పీరియడ్‌లో చరిత్ర గురించి బట్టి పట్టకుండ ఏలా గుర్తించుకోవాలో పలు సూచనలు చేశారు. అనంతరం ప్రాంగణంలోని అంగన్‌వాడి కేంద్రాన్ని సందర్శించి మెనును తప్పనిసరిగా పాటించాలని విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని తెలిపారు.

## పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్‌గా నుగ్గిళ్ల మల్లయ్య బాధ్యతలు స్వీకరణ



### వార్డుల్లో సమస్యలు తీర్చండి

### పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు

ప్రజాపక్షం/పెద్దపల్లి : పెద్దపల్లి మున్సిపల్ కార్యాలయంలో బుధవారం రోజున గౌరవ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు సమక్షంలో నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్‌గా నూగిళ్ళ మల్లయ్య పదవి బాధ్యతలను స్వీకరించారు. తదుపరి నూతనంగా ఎన్నికైన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపిన అనంతరం ముందుగా ఎమ్మెల్యే విజయరమణరావును మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, వేదపండితులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం పెద్దపల్లి మున్సిపల్ వైస్ చైర్మన్‌గా ఎన్నికైన 36వ వార్డు కౌన్సిలర్ ముస్కాన్ నాజ్ నయ్యర్ ఎమ్మెల్యే విజయరమణ రావు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బందితోపాటు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## పుష్కరాల ఏర్పాట్లకు ప్రతిపాదనలు



### జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

ప్రజాపక్షం/పెద్దపల్లి : గోదావరి పుష్కరాల ఏర్పాట్లకు కట్టుదిట్టమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో 2027 గోదావరి నది పుష్కరాల ఏర్పాట్లపై ఇ.వై టీం నిశాంత్, సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2027 జూన్ 26 నుంచి 2027 జూలై 7 వరకు గోదావరి నదికి 12 సంవత్సరాలకు ఒకసారి వచ్చే మహా పుష్కరాలు జరుగుతాయని, దీనికి సంబంధించి మన జిల్లాలో భక్తులు పుణ్యస్నానాలు చేసేందుకు అవసరమైన ఘాట్ నిర్మాణం, రోడ్డు విస్తరణ, లైటింగ్, ఇతర ఏర్పాట్లు, ఆలయాల అభివృద్ధికి ప్రతిపాదనలు తయారు చేసి వీలైనంత త్వరగా సమర్పించాలని కలెక్టర్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డీసీపీ రాంరెడ్డి ,ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ సుప్రియ, డి. పి.ఓ. వీర బుచయ్య,గోదావరిఖని ఏ.సి. పి.రమేష్, ఈఈ ఆర్ అండ్ బి భావ్ సింగ్, ఈఈ మిషన్ భగీరథ ఇంట్రా శ్రీనివాస్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రణాళిక ప్రకారం రోడ్డు భద్రతా చర్యలు అమలు

### అదనపు కలెక్టర్ గడ్డం నగేష్

ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : ప్రణాళిక ప్రకారం రోడ్డు భద్రతా చర్యలు అమలు చేయాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. రోడ్డు సేఫ్టీ కమిటీ సమావేశాన్ని జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో బుధవారం ఆర్ అండ్ బీ, నేషనల్ హైవేస్, పీ ఆర్, పోలీస్, ట్రాన్స్ పోర్ట్, వైద్య, ఎక్సైజ్, విద్య, ఆర్టీసీ తదితర శాఖల అధికారులతో రోడ్డు సేఫ్టీ కమిటీ సమీక్ష సమావేశం అదనపు కలెక్టర్ నిర్వహించారు. ముందుగా గతనెలలో నిర్వహించిన రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశం సందర్భంగా చర్చించిన అంశాలపై సమీక్ష చేశారు. రవాణా, ఆర్ అండ్ బీ, నేషనల్ హైవేస్, పోలీస్ శాఖ సంయుక్తంగా చేసిన సర్వే వివరాలపై ఆరా తీశారు. వివిధ ప్రధాన రహదారుల్లో గుర్తించిన బ్లాక్ స్పాట్స్ వద్ద రంబుల్ స్ట్రిప్స్, సోలార్ సిగ్నల్స్, సైన్ బోర్డ్స్ ఏర్పాటు చేయాలని, రోడ్డు పైకి అడ్డుగా వచ్చిన చెట్ల కొమ్మలను తొలగించాలని సూచించారు. పలు జంక్షన్లు, రహదారుల్లో స్పీడ్ గన్స్, సీసీ కెమెరాల ఏర్పాటు చేయాలని, ఇప్పటికే ఉన్న వాటిని మరోసారి పరిశీలించాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని పెట్రోల్ బంక్ లలో కచ్చితంగా నో హెల్మెట్ నో పెట్రోల్ అమలు చేయాలని సూచించారు. పరిమితికి మించి విద్యార్థులను, ప్రయాణీకులను తరలిస్తున్న ఆటోలు, బస్సులను తనిఖీ చేయాలని, ఓవర్ లోడ్‌తో వెళ్ళే సరుకు వాహనాలపై దృష్టి సారించాలని రవాణా శాఖ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్టీఏ సభ్యుడు సంగీతం శ్రీనాథ్, ఈఈ ఆర్ అండ్ బీ నరసింహాచారి, ఈఈ నేషనల్ హైవేస్ సురేష్ రాథోడ్, డీటీఓ లక్ష్మ ణ్, ఈఈ పీఆర్ సుదర్శన్ రెడ్డి, నేషనల్ హైవే డీఈ అన్నయ్య, ఆర్ అండ్ బీ డీఈ శాంతయ్య, డీఈఓ జగన్ మోహన్ రెడ్డి, ఎక్సైజ్ అధికారి శ్రీనివాస్ రావు, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, సంపత్ కుమార్, ఆర్టీసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# చిన్న గాయాన్ని నిర్లక్ష్యం చేస్తే కాలుకే డేంజర్

### ప్రముఖ యశోద ఆసుపత్రి డాక్టర్ శ్రీకాంత్ రాజు



ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్ : డయాబెటిస్ రోగుల్లో కాళ్లకు రక్తప్రసరణ తగ్గడం (పిఏడి)పై అవగాహన అత్యవసరమని యశోద హాస్పిటల్స్ క్లినికల్ డైరెక్టర్, ప్రముఖ వాస్క్యులర్ సర్జన్ డాక్టర్ ఎస్. శ్రీకాంత్‌రాజు సూచించారు. బుధవారం కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మధుమేహం ఉన్న వారిలో పెరిఫెరల్ ఆర్టీరియల్ డిసిజ్ (పిఏడి) సమస్య వేగంగా పెరుగుతోందని, దీనివల్ల చిన్న గాయాలు సైతం మానకుండా పుండ్లుగా మారి ప్రాణాంతకమవుతాయని హెచ్చరించారు. నరాల సమస్య కారణంగా కొందరికి నొప్పి తెలియకపోవచ్చని, అందుకే నిరంతరం అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ముందస్తు గుర్తింపసుతోనే రక్షణ ఉంటుంటున్నారు. నడిచేటప్పుడు కాళ్లలో నొప్పి త్వరగా అలసిపోవడం, పాదాలు చల్లగా ఉండడం, వేళ్లు నల్లబడడడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని కోరారు. రక్తపోటు పరీక్ష, డాప్లర్ స్కాన్ ద్వారా సమస్యను ముందే గుర్తించి చికిత్స చేయవచ్చన్నారు. చక్కెర స్థాయిని అదుపులో ఉంచుకోవడంతో పాటు పొగతాగడం పూర్తిగా మానాలని హితవు పలికారు. అవసరమైతే మందులు లేదా యాం జియాప్లాస్టీ వంటి అదునాధతన చికిత్సలు అందుబాటులో ఉన్నాయని, స కాలంలో స్పందిస్తే కాలు కోల్పోయే ప్రమాదాన్ని నివారించవచ్చని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో యశోద హాస్పిటల్స్ సిబ్బంది పాల్గొన్నారు.

## పట్టణ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తా

### చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి



ప్రజాపక్షం/ధర్మపురి : ధర్మపురి పట్టణ సమగ్రాభివృద్ధికి కృషిచేస్తానని, మున్సిపల్ మెంబర్‌గా అవకాశం కల్పించిన వార్డు ప్రజలకు, పుర అధ్యక్షురాలిగా అవకాశం ఇచ్చిన మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్‌కు రుణపడి ఉన్నానని ధర్మపురి నూతన చైర్ పర్సన్ వేముల నాగలక్ష్మి అన్నారు. జగిత్యాల జిల్లా ధర్మపురి మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం మున్సిపల్ ఆవరణలో ఏర్పాటు చేసిన వేదికపై చైర్ పర్సన్ నాగలక్ష్మి మాట్లాడారు.. తనకు ఎలాంటి రాజకీయ నేపథ్యం లేకపోయినప్పటికీ తన భర్త రాజేష్ ప్రోత్సాహంతో రాజకీయాలలోకి వచ్చానని తెలిపారు. ఎంఏ ఇంగ్లీష్, బీఈడీ చేసిన తాను మొదట ఉపాధ్యాయురాలిని కావాలనుకున్నానని అలాంటి అవకాశం ఒకసారి వచ్చినప్పటికీ కొన్ని కారణలతో వదులుకున్నాని ఆమె చెప్పారు. అనుకోకుండా రాజకీయాల్లోకి వచ్చిన తాను గత మున్సిపల్ పాలకవర్గం కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్‌గా పనిచేసిన అనుభవం కూడా ఉందని అన్నారు. ఇప్పుడు ఆ అనుభవంతోపాటు మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ మార్గదర్శకంలో పట్టణాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేసేందుకు శాయశక్తులా కృషిచేస్తానని చెప్పారు. 2027లో ధర్మపురి కేంద్రంగా జరిగే గోదావరి నదీ పుష్కరాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని నాగలక్ష్మి తెలిపారు.

## కోతుల దాడిలో వృద్ధురాలికి తీవ్ర గాయాలు



ప్రజాపక్షం/శంకరపట్నం : శంకరపట్నం మండలం తాడికల్ గ్రామంలో బుధవారం జనగాం కనకవ్వ(65) అనే వృద్ధురాలు తన ఇంటి ఆవరణలో ఇంటి పనులు చేస్తుండగా ఒక్కసారిగా కోతుల మంద వచ్చి మీద పడి దాడి చేశాయి. ఈ కోతుల దాడిలో కనకం అనే వృద్ధురాలుకు కాలికి ఎడమ చేయి వేలి భాగాన్ని కరిచి కొరికి తీవ్రంగా గాయపరిచాయి. వృద్ధురాలు కేకలు వేయగా స్థానికులు గమనించి కోతులను వెళ్లగొట్టి 108కు సమాచారం అందించగా సిబ్బంది గూడూరు సతీష్‌రెడ్డి పైలెట్ గోపి హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని ప్రథమ చికిత్స అందించి కరీంనగర్ ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు.

# జట్టులోకి 'సంజూ శాంసన్'

## జింబాబ్వేతో ఆడే ఛాన్స్?

టి–20 వరల్ కప్, సూపర్–8లో భాగంగా దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో ఇండియా ఘోర పరాజయం పొందిన సంగతి తెలిసిందే. అయితే, ఈ మ్యాచులో ఓటమితో టీమిండియాలో మార్పులు జరిగే అవకాశం కని పిస్తోంది. ముఖ్యంగా యంగ్ ఓపెనర్ సంజూ శాంసన్ జట్టులో తిరిగి చేరే అవకాశాలున్నాయి. సంజూ శాంసన్‌ను ఆడించే అంశంపై టీమిం డియా బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ తీవ్రంగా ఆలోచిస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా బ్యాటింగ్ ఆర్డర్‌లో మార్పులు చేయాలని టీం భావిస్తోంది. ఇటీవల టీమిండియా బ్యాటింగ్‌లో విఫలమవుతోంది. ముఖ్యంగా బ్యాటర్లు త్వరగా వికెట్లు కోల్పోతున్నారు. తొలి ఓవర్లలోనే వికెట్లు పోతున్నాయి. దీంతో భారత్ భారీ స్కోరు సాధిం చలేకపోతుంది. అందుకే బ్యాటింగ్ ఆర్డర్‌లో మార్పులు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు



సితాన్షు కోటక్ తెలిపాడు. బ్యాటింగ్‌కు సంబం ధించి లెఫ్ట్ హ్యాండర్లు ఎక్కువగా ఉన్నారు. అందుకే రైట్ హ్యాండర్ అయిన సంజూను ఆడిస్తే మెరుగైన ఫలితం ఉంటుందని కోటక్ ఆలోచిస్తు న్నాడు. సంజూను తీసుకుంటే ఒక లెఫ్ట్ హ్యాండర్, ఒక రైట్ హ్యాండర్ బ్యాటింగ్ చేస్తారు. ఇది మంచి ఫలితం ఇస్తుందని జట్టు యోచన. ప్రస్తుతం సంజూతో నెట్స్‌లో బాగా ప్రాక్టీస్ చేయి స్తున్నారు. దీనర్థం సంజూ తుది జట్టులో ఆడటం గ్యారెంటీ అని కాదని కోటక్ అన్నాడు. సం జూను ఆడించాలంటే జట్టు బ్యాటింగ్ ఆర్డర్‌లో మార్పులు అవసరం. లోయర్ ఆర్డర్‌లో శివమ్ దూబేపై వేటు పడొచ్చు. లేదా తిలక్ వర్మను తప్పించి, అతడి స్థానంలో సంజూను తీసుకురా వొచ్చు. టి–20లో జట్టు ప్రదర్శనకు సంబం ధించి గత రెండేళ్లలో ఇదే అధ్వానం అనేది నిపు ణుల మాట. గురువారం జింబాబ్వేతో జరగ బోయే టీ20 మ్యాచ్ భారత్కు చాలా కీలకం. ఇండియా సెమీస్ రేసులో ఉండాలంటే ఈ మ్యాచులో గెలవడం చాలా ముఖ్యం.

### తండ్రి అనారోగ్యంతో
# వరల్డ్ కప్ క్యాంప్ విడిచిన సిక్సర్ల కింగ్

### ఆందోళనలో అభిమానులు

భారత క్రికెటర్ రింకూ సింగ్ కుటుంబ అత్య వసర పరిస్థితి కారణంగా ఐసిసి టి–20 వరల్ కప్ 2026 క్యాంప్‌ను విడిచి స్వగ్రామానికి వెళ్లాడు. అతని తండ్రి ఆరోగ్య పరిస్థితి తీవ్రంగా క్షీణించడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు బిసిసిఐ వర్గాలు వెల్లడించాయి. బిసిసిఐ సమాచారం ప్రకారం, రింకూ సింగ్ తండ్రి స్టేజ్–4 లివర్ క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. ప్రస్తుతం ఆయన వెంటిలేటర్ సపోర్ట్‌తో ఉన్నారని తెలుస్తోంది. ఈ క్లిష్ట సమయంలో కుటుంబంతో ఉండేందుకు రింకూ జట్టును తాత్కాలికంగా వీడినట్లు సమా చారం. రింకూ మళ్లీ జట్టులో చేరుతాడా? లేదా టోర్నమెంట్‌కు పూర్తిగా దూరమవుతాడా? అనే అంశంపై ఇంకా స్పష్టత లేదు. టీమ్ మేనేజ్‌మెంట్ పరిస్థితిని సమీక్షిస్తూ ఉంది. అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ఇటీవలి కాలంలో పరిమిత ఓవర్ల క్రికెట్‌లో రింకూ సింగ్ కీలక ఫినిషర్‌గా గుర్తింపు పొందాడు. ఒత్తిడి పరిస్థితుల్లో మ్యాచ్‌ను ముగించే సామర్థ్యం అతడికి ఉంది. అతడి గైర్హా జరు జట్టు కాంబినేషన్‌పై ప్రభావం చూపే అవకా శముంది. ఈ వరల్ కప్‌లో మాత్రం అతడికి ఎక్కువ అవకాశాలు రాలేదు. ఎక్కువగా చివరి ఓవర్లలో క్రీజ్‌లోకి రావాల్సి వచ్చింది. ఐదు ఇన్నిం గ్స్‌లలో 24 పరుగులు మాత్రమే చేశాడు. రెండు



సార్లు అజేయంగా నిలిచాడు. అత్యధిక స్కోరు 11*. ఈ ఏడాది 10 టి–20 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో 115 పరుగులు చేసి, సగటు 28.75, స్ట్రైక్రేట్ 132.18 నమోదు చేశాడు. బెస్ట్ స్కోర్ 44*. చెన్నైలో జింబాబ్వేతో జరగనున్న కీలక మ్యాచ్‌లో భారత్ తప్పనిసరిగా గెలవాల్సిన పరి స్థితి ఉంది. సూపర్–8 తొలి మ్యాచ్‌లో దక్షిణా ఫ్రికా చేతిలో ఘోర ఓటమి పాలైన తర్వాత జట్టు సమీకరణాలు కఠినంగా మారాయి. ఈ నేప థ్యంలో రింకూ సింగ్ గైర్హాజరు జట్టుపై మానసి కంగా కూడా ప్రభావం చూపవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రస్తుతం అయితే క్రికెట్ కంటే కుటుంబ పరిస్థితికే ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ క్లిష్ట సమయంలో రింకూ సింగ్ కుటుంబానికి క్రికెట్ ప్రపంచం మద్దతుగా నిలుస్తోంది. అభిమా నులు కూడా అతడి తండ్రి ఆరోగ్యం మెరుగుపడా లని ప్రార్థిస్తున్నారు.



### పాకిస్థాన్‌పై ఘనవిజయం
# సెమీస్‌కు ఇంగ్లాండ్

**పల్లెకెలె :** టి–20 ప్రపంచకప్‌లో మాజీ చాంపి యన్ ఇంగ్లాండ్ సెమీస్ బెర్తును ఖరారు చేసు కుంది. సూపర్–8 దశలో భాగంగా ఇదివరకే శ్రీలంకను ఓడించిన ఆ జట్టు.. మంగళవారం పల్లెకెలెలో జరిగిన 'లో స్కోరింగ్ థ్రిల్లర్'లో పాకి స్థాన్‌ను 2 వికెట్ల తేడాతో చిత్తుచేసి సెమీస్ చేరు కుంది. పాక్ నిర్దేశించిన 165 పరుగుల ఛేదనను ఆ జట్టు.. 19.1 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి పూర్తిచేసింది. 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' హ్యారీ బ్రూక్ (51 బంతుల్లో 100, 10 ఫోర్లు, 4 సిక్సర్లు) సూపర్ సెంచరీతో కెప్టెన్సీ ఇన్నింగ్స్ ఆడి ఒంటిచేత్తో ఆ జట్టును సెమీస్‌కు చేర్చాడు. పాక్ బౌలర్లలో షహీన్ అఫ్రిది (4/30), ఉస్మాన్ తారిఖ్ (2/31) రాణించినా బ్యాటింగ్, ఫీల్డింగ్ వైఫల్యాలతో ఆ జట్టుకు పరాభవం తప్పలేదు. మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన పాక్.. సాహి బ్జాదా ఫర్హాన్ (45 బంతుల్లో 63, 7 ఫోర్లు, 2 సిక్సు), ఫకార్ జమాన్ (16 బంతుల్లో 25, 2 ఫోర్లు, 2 సిక్సు) రాణించడంతో గౌరవప్రదమైన స్కోరు చేసింది. ఇక ఈ ఓటమితో సెమీస్ చేరే అవకాశాలను పాకిస్థాన్ సంక్లిష్టం చేసుకుంది.



# మట్టి కట్టడానికి గొప్ప ఉదాహరణ..

మొరాకో దేశంలోని అట్లాస్ పర్వ తాల పాదభాగంలో వెలసిన ఐత్ బెన్ హద్దూ ప్రపంచంలోనే అత్యంత విశిష్టమైన పురాతన కోటలలో ఒకటి. మట్టి తో తయారు చేసిన ఇటుకలు, ఎత్తైన గోపురా లు, సంక్లిష్టమైన నిర్మాణ శైలి దీనిని ఒక అద్భుతమైన కసార్‌గా (గోడలతో చుట్టుము ట్టిన పట్టణ కోట) నిలబెట్టాయి. కాలాన్ని తట్టు కుని నిలిచిన ఈ కట్టడం, ఉత్తర ఆఫ్రికా నాగరికతకు ప్రతీకగా నిలుస్తోంది. శతాబ్దాల పాటు ఐత్ బెన్ హద్దూ ఒక కీలక వాణిజ్య కేంద్రంగా విలసిల్లింది. ట్రాన్స్–సహారా వ్యాపార మార్గంలో ఇది ముఖ్యమైన విశ్రాంతి స్థావరంగా ఉండేది. సహారా ఎడారి దాటి మరాకేష్ వైపు ప్రయాణించే వర్తకులు ఇక్కడ ఆగి విశ్రాంతి తీసుకుని, తమ సరుకులను నిల్వ చేసేవారు. ఈ కారణంగా ఇది కేవలం ఒక నివాస ప్రాంతమే కాకుండా, ఆర్థిక, సాంస్కృతిక మార్పిడులకు కేంద్రంగా ఎదిగింది. ఈ కోట ప్రధానంగా 17వ శతాబ్దానికి చెందిన నిర్మాణ శైలిని ప్రతిబింబిస్తుంది. మట్టి, చెక్క, కలిపి వంటి సహజ పదార్థాలతో ఇక్కడ ఇళ్ళు, గోడలు, గోదాములు, మసీదులు, కర్వాన్సరైలు (వర్తకుల కోసం వసతి గృహాలు) ఉన్నాయి. ఇక్కడ ఒకటి ఇస్లాం సంప్రదాయానికి చెందినది, మరొకటి యూదు సంప్రదాయానికి చెందిన స్మశానాలు కూడా ఉండడం విశేషం. అప్పటి సమాజంలోని సాంస్కృ తిక సహజీవనాన్ని ఈ భిన్నత్వం సూచిస్తుంది. గోడలపై కనిపించే క్లే మోటిఫ్స్, కోణాలుగా నిర్మించిన ఆకృ తులు, గట్టి రామ్డ్ ఎర్త్ సాంకేతికత తదితర అంశాలన్నీ దక్షిణ మరోకోలోని మట్టి నిర్మాణాలకు ఒక సంపూర్ణ ఉదాహరణగా నిలుస్తాయి. ఈ నిర్మాణ విధానం తీవ్ర ఎండలు, చలికాల వాతావరణ మార్పులను తట్టుకు నేలా ఉంది. ఈ విశిష్టత కారణంగా 1987లో ఐత్ బెన్ హద్దూను యునెస్కో ప్రపంచ వారసత్వ స్థలంగా గుర్తించారు. అంతేకాదు, దీని ప్రత్యేక దృశ్యవైభవం హాలీవుడ్ దర్శకులను కూడా ఆకర్షిం చింది. గ్లాడియేటర్, బాబెల్, ప్రిన్స్ ఆఫ్ పెర్షియా వంటి ప్రసిద్ధ సినిమాలను ఇక్కడే చిత్రీకరించారు. దీంతో ఇది ప్రపంచ పర్యాటకుల దృష్టిని మరింతగా ఆకర్షించింది. నేడు ఈ కోటలో కొద్ది కుటుంబాలు మాత్రమే నివసిస్తున్నాయి. అయితే సమీప గ్రామాల్లో నివసించే ప్రజలు వ్యవసాయం, పర్యాటక రంగంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు.

# ప్రాచీన స్మారక నిర్మాణం గోబెక్లీ టెపే'

టర్కీ ఆగ్నేయ ప్రాంతంలోని గోబెక్లీ టెపే అనేది మానవ నాగరికత చరిత్రలో అతి ప్రాచీన మైన స్మారక నిర్మాణాలలో ఒకటిగా గుర్తింపు పొందింది. ఈ ప్రదేశం సుమారు 11,000 సంవత్స రాల కిందట, కుండలు వినియోగంలోకి వచ్చేనాటికి ముందున్న ప్రీపాటరీ నియోలిథిక్ యుగానికి చెంది నది. అప్పట్లో మనుషులు ఇంకా వ్యవసాయం, లిపి వ్యవస్థలను ఆవిష్కరించకముందే వేటగాళ్లుగా, సేక రించేవారిగా ఉన్న కాలం ఇది. గోబెక్లీ టెపే అంటే టర్కిష్ భాషలో 'గుండ్రటి కొండ' అని అర్థం. ఇది అనేక వలయాకార రాతి గదుల నుండి ఏర్పడింది. వాటి మధ్యలో 'టి' ఆకారంలో భారీ స్తంభాలు నిర్మించారు. ఈ రాతి స్తంభాలు నేటికీ నిలిచి ఉండడం విశేషం. ఒకొక్క స్తంభం దాదాపు 5.5 మీటర్ల ఎత్తుతో, పది టన్నుల కంటే ఎక్కువ బరువుతో ఉంటుంది. ఈ స్తంభా లపై జంతువుల ఆరాధనా రూపాలు, పాముల కలి బందల



రూపాలు, పక్షుల ప్రతీకలను చెక్కారు. ఇవి ఒక ప్రతీకాత్మక భాషను సూచిస్తు న్నాయని పురా వస్తు శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. గోబెక్లీ టెపే ధార్మిక కార్యకలా పాలకోసం నిర్మించిన ఆచార కేంద్రంగా శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. వ్యవసాయం, పట్టణాలు లేదా దేవాలయాల భావన రాకముందే ఇక్కడి ప్రజలు ఆధ్యాత్మికత, సమూహ ఆరాధనలను అభివృద్ధి చేసి నట్లు ఇది సూచిస్తుంది. తాజా సిద్ధాంతాలలో కొన్ని ఈ స్తంభాలపై ఉన్న సంకేతాలను ప్రారంభ వేద ధ్వనులతో లేదా సంస్కృత మూల పదాలతో పోలుస్తు న్నాయి. ఉదాహరణకు, వాటిలోని కొన్ని ఆకృతులను కుండలినీ శక్తి లేదా ప్రపంచ ఆత్మ శబ్దం ప్రతీకలుగా అధ్యయనం చేస్తున్నారు. ఇవి తాత్విక, ధ్యాన సంబం ధమైన ధార్మిక భావనలతో మిళితమై ఉన్నాయనే ఆస క్తికరమైన పోలికను శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. ఈ స్తంభాలపై చెక్కిన రూపాలు కేవలం కళాత్మక శిల్పాలు మాత్రమే కావు/ అవి మానవ భావన, ఆధ్యా త్మిక అన్వేషణ, విశ్వ సూత్రాల ప్రతీకలుగా నిలుస్తు న్నాయి. ఇది భాష పుట్టక ముందు ఉన్న భావ కమ్యూనికేషన్‌కి ఒక మానవజాతి సాక్ష్యం గా పరిగణించవచ్చు.




# ప్రాచీన వాయిద్యం 'టింపానన్

ప్రాచీన గ్రీకు నాగరికతలో సంగీతానికి, ఆచా రాలకు ఎంతో ప్రాధాన్యం ఉండేది. ఆ సంప్ర దాయానికి ప్రతీకగా నిలిచిన ముఖ్యమైన వాద్యాలలో టింపానన్ ఒకటి. ఇది ఈసాపూర్వం 8వ శతాబ్దానికి చెందిన బ్రాంజ్‌తో తయారైన డ్రమ్ వాద్యం. క్రీట్ ద్వీపంలోని ప్రసిద్ధ ఐడియన్ గుహలో ఈ అరుదైన వాద్యానికి సంబంధించిన ఆధారాలు లభించాయి. ఈ గుహ గ్రీకు పురాణాల్లో అత్యంత పవిత్ర మైన స్థలంగా పేర్కొన్నారు. టింపానన్ అనేది చుట్టుకొంగ ఆకారంలో ఉండే చిన్న డ్రమ్ లేదా టాంబురైన్ వంటిది. దీనిని అరచేతితో లేదా చిన్న కర్రతో వాయించేవారు. గ్రీకు సంగీతంలో ఇది లయను, ఉత్సాహాన్ని వ్యక్తపరచే వాద్యంగా ఉపయోగించబడింది. ముఖ్యంగా ధార్మిక వేడుకలు, సంప్ర దాయ ఉత్సవాలు, దేవతారాధన సందర్భాల్లో ఈ వాద్యం కీలక పాత్ర పోషించింది. ఈ టింపానన్‌పై చెక్కిన చిత్రాలు దీని సాంస్కృతిక విలువను మరింత స్పష్టంగా ప్రతిబింబి స్తాయి. ఇందులో ఒక వృద్ధుడు, రెక్కలు కలిగిన రెండు మానవరూప దేవతలు కనిపిస్తాయి. మధ్యలో ఉన్న వ్యక్తి ఒక సింహాన్ని పట్టుకుని ఉండగా, అతని కాళ్ల క్రింద ఒక ఎద్దు చిత్రితమై ఉంటుంది. ఈ దృశ్యం గ్రీకు పురాణాలలోని ఒక ముఖ్య కథను సూచిస్తుంది. గ్రీకు ధార్మిక, సాంస్కృతిక ఆచారా లలో టింపానన్‌ను ప్రధానంగా మహిళలు వాయించేవారు. ప్రత్యేకంగా డయోనిసస్, సైబెలే వంటి దేవతల పూజల్లో ఈ వాద్యం కీలకంగా ఉపయోగించబడింది. ఉల్లాసం, ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని వ్యక్తపరచే సాధనంగా ఇది నిలిచింది. సంగీతం, మతం, కళ అనే మూడు రంగాల సంగమంగా టింపానన్ ప్రాచీన గ్రీకు సంస్కృతిలో విశిష్ట స్థానం సంపాదించింది.



# మావోయిస్టుల అంతం అసాధ్యం

### మోదీ ప్రభుత్వానిది నియంతృత్వ పాలన
### అహంకారంతోనే కొమ్మెర ఘటన
### రాష్ట్ర ప్రభుత్వం రైతాంగానికి భరోసా ఇవ్వాలి
### సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



**ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్ :** దేశంలో మావోయి స్టుల ఏరివేత అసాధ్యమని, అసమానతలు, ఆకలి కేకలు ఉన్నన్ని రోజులు ఉద్యమాలు నడుస్తూనే ఉంటాయని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. మావోయిస్టులను అంతం చేయడం అసాధ్యమన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నియంతృత్వ ధోరణితో పరిపా లన కొనసాగిస్తుందని ఆయన అన్నారు. బుధ వారం కరీంనగర్ నగరంలోని సిపిఐ బద్దం ఎల్లా రెడ్డి భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావే శంలో చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడారు. మావోయి స్టుల ఏరివేతపై డెడ్‌లైన్ పెట్టి పోలీసులను ఉసిగొ ల్పడం అప్రజాస్వామికమన్నారు. రాజ్యాంగబద్ధ పాలన వీడి నియంతృత్వ పాలనతో దేశంలో అల జడి రేపేందుకు బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తోం దని ఆరోపించారు. వేలాదిమంది పోలీసులు బూట్ల చప్పుళ్లతో, తుపాకీ తూటాలతో సామాన్య అమాయకులు సమిదులవుతున్న నేపథ్యంతో మావోయిస్టులు తీసుకుంటున్న నిర్ణయం తాత్కా లిక విరామమే కానీ, ఉద్యమం అంతం కాదని తేల్చి చెప్పారు. కరీంనగర్ పార్లమెంట్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మావోయిస్టుల పట్ల చేస్తున్న అనుచిత వ్యాఖ్యలు సమర్థనీయం కాదని, ఆయన అవివేకానికి నిదర్శనమన్నారు. మావోయిస్టుల ఏరివేత బిజెపికి గగనకుసుమంగా మారుతుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలో వచ్చి రెండేళ్లు దాటినా మేనిఫెస్టోలో పొందుపరిచిన సంక్షేమ పథకాలు ఇప్పటికీ సక్రమంగా అమలు చేయకపో వడం సముచితం కాదన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ప్రతి పేద ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ యంత్రాంగాన్ని పటిష్టం చేసి భూభారతి పథకాన్ని వెంటనే అమలు చేయాల న్నారు. కాళేశ్వరంతో పాటు దేవాదుల, మల్లన్న సాగర్ ప్రాజెక్టులకు మరమ్మతులు చేసి నీటిని పంపింగ్ చేయాలని చాడ వెంకట్‌రెడ్డి ప్రభుత్వానికి సూచించారు. సమావేశంలో సిపిఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, జిల్లా కార్యవర్గ సభ్యులు కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, కొయ్యడ సృజన్‌కుమార్, బోయిని అశోక్, సమ్మయ్య, నాగెల్లి లక్ష్మారెడ్డి, బోయిని తిరుపతి, న్యాలపట్ల రాజు, ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణి కంఠరెడ్డి, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు, కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, బీర్ల పద్మ, నాయకులు గామినేని సత్యం, కూన రవి, శాంత కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కుల ఉన్మాదులను కఠినంగా శిక్షించాలి

**ప్రజాపక్షం/వనపర్తి టౌన్ :** నాగర్‌కర్నూల్ మండ లం కుమ్మెర సంఘటనపై సిపిఐ ఆధ్వర్యంలో వన పర్తి అంబేద్కర్ చౌక్‌లో అగ్రకుల ఉన్మాద నింది తుల దిష్టిబొమ్మను సిపిఐ జెండాకు ఉరితీసి నిర సన తెలిపారు. బుధవారం దిష్టిబొమ్మను సిపిఐ ఆఫీస్ నుంచి అంబేద్కర్ చౌక్ వరకు ఊరేగింపుగా తెచ్చి ఉరి తీసి, నిందితులను కఠినంగా శిక్షించా లని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఐ పట్టణ కార్యదర్శి రమేష్ తదితరులు మాట్లాడారు. కుమ్మెరలో మల్లన్న జాతరకు వెళ్లిన రజక కులా నికి చెందిన మహిళలు దైవదర్శనం చేసుకోకుండా అడ్డుపడి, బూతులు తిట్టి, గణేష్ అనే వ్యక్తిని కొట్టా రన్నారు. రెండు నెలల పసిపాపను కనికరం లేకుండా కాలితో తన్ని మృతికి కారణం అయ్యార న్నారు. సంఘటన ఫిబ్రవరి 18న జరిగిందని ఇప్పటికి వారం రోజులు అయినప్పటికి 8 మంది నిందితుల్లో కేవలం ముగ్గురిని మాత్రమే అరెస్టు చేసి తక్కిన ఐదుగురు పరారీలో ఉన్నారని పోలీ సులు చెబుతున్నారు. పోలీసులు తలుచుకుంటే 24 గంటల్లో అరెస్టు చేయవచ్చని జాప్యం జరుగు తుంటే పోలీసులు నిందితుల కొమ్ముకాస్తున్నారని అనుమానం కలుగుతుందన్నారు. నిందితులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబాన్ని అన్నిరకాల ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మాజీ సర్పంచ్ కళావతమ్మ, పట్టణ సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పృథ్వీనాదం, రమణ, వంశీ, శేఖర్ ఎన్‌ఎఫ్‌డబ్ల్యు పట్టణ కన్వీనర్ జయమ్మ, భువన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్న కురుమన్న, సిపిఐ మాజీ పట్టణ సహాయకా ర్యదర్శి ఎర్రకురుమన్న, రాంబాబు, వెంకటమ్మ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.




# అరాచక శక్తులపై కఠిన చర్యలు

### సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్ డిమాండ్

**ప్రజాపక్షం/ చింతకాని :** గ్రామ పంచాయతీ ఎన్నికల తర్వాత బస్వాపురంలో జరుగుతున్న అరాచక సంఘటనలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసు కోవాలని సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్ డిమాండ్ చేశారు బస్వా పురం గ్రామానికి చెందిన ఆవుల సైదమ్మకు సంబంధించిన వరిగడ్డి వామును సోమవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు నిప్పంటించారు. ఈ ఘటనలో 12 ట్రక్కుల వరిగడ్డి పూర్తిగా దగ్ధమైంది. విషయం తెలుసుకున్న సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి బుధవారం బస్వాపురం వెళ్లి సైదమ్మను పరామర్శించారు. ఘటనకు సంబంధించి వివరా లను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా దండి సురేష్ మాట్లాడుతూ ఎన్ని కలు పూర్తయిన తర్వాత ఇంటి ఆవరణలో ఉంచిన కారు టైర్లు దొంగిలించడం, గొర్రెల అపహరణ ఇలాంటి ఘటనలకు పాల్పడటం హేయమైన చర్య అన్నారు. గ్రామస్తులు వరిగడ్డి వాము దగ్ధమయ్యే సమయంలో పశువులను కాపాడి ఉండ కపోతే పెద్ద ఎత్తున నష్టం వాటిల్లేదన్నారు. ప్రశాంత వాతావరణానికి విఘాతం కలిగించేలా చర్యలకు పాల్పడుతున్న వారిని ప్రోత్సహించడం సిగ్గుచేటన్నారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి దుండగులను కఠినంగా శిక్షించాలని పోలీస్ అధికారులను కోరారు. సర్పంచ్ ఆవుల నర్సింహారావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కూచిపూడి రవి, జిల్లా కౌన్సిల్ సభ్యలు రాసాల మోహన్ రావు, మండల సహాయ కార్యదర్శి మార్గం శ్రీను, బొడ్డు కొండలరావు, ఉపసర్పంచ్ చంద్రకాని నర్సింహారావు వారి వెంట ఉన్నారు.



### శ్రమదోపిడీకి గురవుతున్న
# మెడికల్ కాంట్రాక్ట్ కార్మికులు




### యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎండి.యూసుఫ్, ఎం.నరసింహ

**ప్రజాపక్షం/ఆదిలాబాద్:** వివిధ విభాగాల్లో పనిచేస్తున్న మెడి కల్ కాంట్రాక్టు కార్మికులు శ్రమదోపిడీకి గురవుతున్నారని యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎండి. యూసుఫ్, ఎం.నరసింహ అన్నారు. బుధవారం ఆదిలాబాద్ జిల్లా కేం ద్రంలోని రిమ్స్ క్రిటికల్ కేర్ యూనిట్‌లో ఎఐటియుసి అను బంధ సంఘమైన తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా సహాసభలు ఘనంగా జరి గాయి. యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు సిర్ర దేవేందర్ ఆధ్యక్షతన నిర్వహించిన మహాసభకు ఎండి.యూసుఫ్, ఎం.నరసింహ, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులలో శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులు చాలీచా లని వేతనాలతో ఇబ్బందులు పడు తున్నారని, కార్మికులకు కనీస వేతనం రూ.26,000 రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం, పండుగ సెలవులు వంటి సమస్యల పరిష్కారం కోసం 28న వరంగల్‌లో జరిగే రాష్ట్ర మహాసభల్లో భవిష్యత్ కార్యాచరణను ప్రకటించి ఉద్య మాలు చేపట్టబోతున్నామన్నారు. వరంగల్‌లో నిర్వహించ నున్న రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. అనంతరం 16 మంది సభ్యులతో మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా సిర్ర దేవేందర్, అధ్యక్షుడిగా నల్ల శివన్న, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎండి.ముజీబ్, పెందూరు దిలీప్, కార్యదర్శి చందు, డిప్యూటీ జనరల్ సెక్రటరీగా ఎస్‌కె.అమీర్, ఉపాధ్యక్షులు లక్ష్మీ , దత్తాత్రి దాస్, కౌసల్య, సహాయ కార్యదర్శిగా ఆరిఫ్, సంగీత, రమేష్, ప్రవీణ్, కోశాదికారిగా ఖాసీం, సహాయ కోశాధికారిగా అర విందలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

### బీడీ కార్మిక రంగానికి
# గంగారాం సేవలు మరువలేనివి

### సిపిఐ జగిత్యాల జిల్లా కార్యదర్శి చెన్న విశ్వనాథం

**ప్రజాపక్షం/ కోరుట్ల :** మొదటి తరం కమ్యూనిస్టు పార్టీ సేనాని, బీడీ కార్మిక సంఘం జాతీయ నేత కడకుంట్ల గంగారం కార్మికుల హక్కులు, సంక్షే మం కోసం చేసిన సేవలు మరువలేనివి సిపిఐ జిల్లా కార్యదర్శి చెన్న విశ్వనాథం, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు సుతారి రాములు అన్నారు. బుధ వారం కడకుంట్ల గంగారం వర్ధంతి సందర్భంగా సి.ప్రభాకర్ భవన ఆవరణలో ఆయన చిత్రపటాని కి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనం తరం చెన్న విశ్వనాథం, సుతారి రాములు మాట్లా డుతూ 1965లో బీడీ కార్మిక సంఘాన్ని ఏర్పాటు చేసి రూపాయి పావలా కూలీ నుండి బీడీ యజ మానులతో పోరాటం చేసి వేతనాలు పెంచుతూ ఒప్పందాలు చేసిన గంగారంకు ఉందన్నారు. ఈ ప్రాంతంలో బీడీ కార్మిక సంఘంతో పాటు కమ్యూ నిస్టు పార్టీని నిర్మాణం చేస్తూ చేనేత సహకార సంఘాన్ని ఏర్పాటు చేసి వారి సమస్యలు సంక్షే మం కోసం ఎనలేని సేవ చేశారన్నారు. సూపర్ బజార్ మార్కెట్ ఏర్పాటు చేసి పేదలకు నిత్యావ సర సరుకులు సరఫరా చేసిన ఘనత కోరుట్లలో వీరికి దక్కుతుందన్నారు. కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నేతలు ఎండి మౌలానా, వామపక్ష నేతలు చింత భూమేశ్వర్, కొంచెం శంకర్, బీడీ కార్మిక సంఘం జిల్లా నేతలు కొక్కుల శాంత, ఎం ఎం.రాధ, ఎండి ముక్రం, మునుగోరి హనుమం తు, మహమ్మద్, ఉస్మాన్ కిరణ్, ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర నేత మహమ్మద్, అక్రమ్, భాష, న్యాయవాది కడ కుంట్ల సదాశివరాజు, ఎండి.సమీర్, అందే వంశీ కృష్ణ, మల్లాపూర్ రాజన్న పాల్గొన్నారు.



# పునరావాసం కల్పించాలని బాధితులు ఆందోళన

## పోలీసులు, బాధితుల మధ్య తోపులాట



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పునరావాసం కల్పించి తమను ఆదుకోవాలని కోరుతూ వెలుగుమట్ల భూదాన్ బాధితుల ఆందోళన ఉద్రిక్తతకు దారి తీసింది. పోలీసులు, బాధితుల మధ్య తోపులాట చోటు చేసుకుంది. వెలుగుమట్ల ప్రాంతంలో భూదాన్ భూముల్లో వేసుకున్న గుడిసెలను తొలగించి సామాన్లను ఖమ్మం నగరంలోని అంబేడ్కర్ భవన్, టిటిడిసి భవన్‌కు తరలించారు. అక్కడకు చేరుకున్న బాధితులు తమకు పునరావాసం కల్పించాలని కోరుతూ వైరా రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఎటువంటి సమాచారం లేకుండా పేదలమైన తమపై ప్రభుత్వం కనికరం చూపకుండా గుడిసెలు కూల్చి వేయడం దుర్మార్గమన్నారు. ప్రత్యామ్నాయంగా ఇండ్ల స్థలాలు కానీ, డబుల్ బెడ్‌రూం ఇండ్లు కానీ కేటాయించాలని కోరారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆ ప్రాంతానికి చేరుకుని ఆందోళనను విరమింపజేసేందుకు ప్రయత్నించారు. దీనితో బాధితులు, పోలీసుల మధ్య తోపులాట చోటు చేసుకుంది. కొద్దిసేపు ఆ ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

**అర్హులైన వారికి న్యాయం చేస్తాం : ఆర్‌డిఒ**

ఇండ్లు కోల్పోయిన వారిలో అర్హులు ఉంటే ప్రభుత్వ పరంగా న్యాయం చేస్తామని ఖమ్మం ఆర్‌డిఒ జి. నర్సింహారావు తెలిపారు. ఆందోళన సమాచారం తెలుసుకున్న ఆర్‌డిఒ నర్సింహారావు, ఎసిపి రమణమూర్తి బాధితులతో మాట్లాడారు. గుడిసెలు తొలగించే సమయంలోనే అక్కడ నివసించే వారి పేర్లు నమోదు చేసుకున్నామని, అక్కడ ఇవ్వని వారి పేర్లను తీసుకుని అందులో అర్హులైన వారు ఉంటే వారికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. దీనితో బాధితులు ఆందోళనను విరమించారు.

# వెలుగుమట్ల బాధితులకు నేడు కెటిఆర్ పరామర్శ

## ఎమ్మెల్సీ తాతా మధుసూదన్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ఖమ్మంలో నేడు పర్యటించి వెలుగుమట్ల భూదాన్ బాధితులను పరామర్శిస్తారని బిఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ తెలిపారు. బుధవారం బిఆర్‌ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 25 నెలల కాలంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ప్రతిపక్ష బిఆర్‌ఎస్ పార్టీపై బురద చల్లే కార్యక్రమాలకు తెర లేపిందన్నారు. కెసిఆర్ పాలనలో జరిగిన అభివృద్ధిని ధ్వంసం చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. వెలుగుమట్ల బాధితులందరికీ తక్షణమే పునరావాసం కల్పించాలని, డబుల్‌బెడ్‌రూం ఇండ్లు కేటాయించాలని, సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని బిఆర్‌ఎస్ ఖమ్మంజిల్లా పార్టీ తరుపున డిమాండ్ చేస్తున్నామన్నారు. కెటిఆర్‌తో పాటు మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపి వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపి నామ నాగేశ్వరరావు, ఇతర ముఖ్య నాయకులు పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో బిఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, డిసిసిబి మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, మండల పార్టీ అధ్యక్షుడు బెల్లం వేణుగోపాల్, వీరన్న, కార్పొరేటర్లు కర్నాటి కృష్ణ, మగ్బూల్, బిచ్చాల తిరుమలరావు, తాజుద్దీన్, ప్రసాద్, హన్మంతరావు, మురళీకృష్ణ, రఫీ తదితరులు పాల్గొన్నారు.

# భూదాన్ భూములపై ప్రతిపక్షాలు అసత్య ప్రచారం

## రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** కాంగ్రెస్ పార్టీ పేదల పక్షపాతి అని భూదాన్ భూములపై ప్రతిపక్షాలు అసత్య ప్రచారాలు చేయడం తగదని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థచైర్మన్ రాయల నాగేశ్వరరావు, మాజీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మేయర్ పునుకొల్లు నీరజ తదితరులు మాట్లాడుతూ వెలుగు మట్ల భూదాన్ భూములపై ప్రతిపక్షాలు అసత్య ప్రచారాలు చేయడంపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. అక్కడ పేదలు ఉంటే ప్రభుత్వం వారికి తగిన న్యాయం చేస్తుందన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రాజకీయ జీవితంలో ఎక్కడైనా భూమి కబ్జా చేశారా? అని బిఆర్‌ఎస్ నాయకులను ప్రశ్నించారు. భూదాన్ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని ప్రజా అవసరాలకు ఉపయోగిస్తుంది తప్ప ప్రైవేటు కంపెనీలకు అప్పగించడానికి కాదన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావుపై బిఆర్‌ఎస్ నాయకులు బురద చల్లే ప్రయత్నాలు చేస్తున్నారని వాటిని మానుకోవాలని హితవు పలికారు. గుడిసెలు కోల్పోయిన వారిలో అర్హులైన పేదలు ఉంటే ప్రభుత్వం తప్పకుండా న్యాయం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఫాతిమాజోహరా, మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హన్మంతరావు, కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షుడు బాలగంగాధర్ తిలక్, ఓబిసి సెల్ జిల్లా అధ్యక్షుడు పుచ్చకాయల వీరభద్రం, జిల్లా మహిళా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

# అనతికాలంలోనే అరుదైన గౌరవం

## దిశ కమిటీ సభ్యురాలిగా సర్పంచ్ హేమలత

**ప్రజాపక్షం/కారేపల్లి :** పువ్వు పుట్టగానే పరిమళిస్తుందని చందంగా సర్పంచిగా ఎన్నికైన స్వల్ప వ్యవధిలోనే గ్రామీణాభివృద్ధికి చేస్తున్న కృషిని గుర్తిస్తూ జిల్లా దిశ కమిటీ సభ్యురాలుగా పోలంపల్లి గ్రామ సర్పంచ్ హేమలతకు అరుదైన గౌరవం దక్కింది. సింగరేణి మండలం పోలంపల్లి గ్రామ పంచాయితీ సర్పంచిగా ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో హేమలత బాలాజీ గెలుపొందారు. పదవి చేపట్టినప్పటి నుండి గ్రామ పంచాయితీలో త్రాగునీటి సదుపాయం, రహదారుల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు వంటి అనేక కార్యక్రమాలను సమర్థంగా నిర్వహించారు. సర్పంచ్ నాయకత్వంలో గ్రామంలో పలు అభివృద్ధి పనులు వేగవంతమయ్యాయి. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని పరిష్కరించడంలో ఆమె ప్రత్యేక శ్రద్ధ చూపారు. జిల్లా దిశ కమిటీలో సభ్యురాలిగా ఆమె ఎంపిక కావడం పట్ల గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తూ ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ సమస్యలను జిల్లా స్థాయిలో ప్రస్తావించే అవకాశం లభించిందన్నారు. గ్రామ అభివృద్ధికి మరిన్ని నిధులు, పథకాలు అందే అవకాశ ఉందని తెలిపారు.

# రైతులు యార్డుల్లో సదుపాయాలను వినియోగించుకోవాలి

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం, ఏన్కూరు వ్యవసాయ మార్కెట్ యార్డు పరిధిలో ఉన్న సదుపాయాలను మిర్చి రైతులు వినియోగించుకోవాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి బుధవారం ప్రకటనలో తెలిపారు. ఖమ్మం జిల్లాలోని మిర్చి రైతులు మిర్చి పంటను ఖమ్మం, ఏన్కూరు మార్కెట్ యార్డులకు తీసుకువచ్చినప్పుడు పంట కొనుగోళ్లు, అమ్మకం జరిగే వరకు మార్కెట్ కమిటీలో అందుబాటులో ఉన్న షెడ్లలో నిల్వ చేసుకోవచ్చునని తెలిపారు. అకాల వర్షాల వల్ల పంట నష్టపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మార్కెట్‌కు తీసుకు వచ్చిన పంట తడిసిపోకుండా యార్డులలో అందుబాటులో ఉన్న టార్పాలిన్లను ఉపయోగించుకోవాలన్నారు. మిర్చి పంటను రైతులు బయట ప్రదేశాల్లో విక్రయించకుండా మార్కెట్ యార్డుకు తీసుకువచ్చి విక్రయించాలని సూచించారు. రైతుల సౌకర్యార్థం ప్రత్యేక సిబ్బందిని నియమించామని ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీలో ఉన్నతశ్రేణి కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ సెల్ నెం. 7330733375 (ఉదయం వేళల్లో), సహాయ కార్యదర్శి వీరాంజనేయులు సెల్ నెం. 7330733383 (రాత్రివేళల్లో), ఏన్కూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో రామారావు (సూపర్‌వైజర్) సెల్ నెం. 7330733408 అందుబాటులో ఉంటారని అదనపు కలెక్టర్ తెలిపారు.

# పేదల సొంతింటి కల ఇందిరమ్మరాజ్యంలో సాకారం

## ఎమ్మెల్యే రాగమయి దయానంద్



**ప్రజాపక్షం/సత్తుపల్లి :** పేదల సొంతింటి కల ఇందిరమ్మ రాజ్యంలో నెరవేరిందని, పేదల సొంతింటి కలను నిజం చేసిన సిఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి , మంత్రులు తుమ్మల, పొంగులేటిలకు కృతజ్ఞతలు తెలిపారు ఎమ్మెల్యే రాగమయి దయానంద్. బుధవారం మండల పరిధిలోని రామగోవిందపురం గ్రామంలో జరిగిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమానికి ఎమ్మెల్యే రాగమయి దయానంద్ ముఖ్య అతిథిగా హాజరై గాయం రమేష్‌భాగ్యలక్ష్మి దంపతులు, జక్కా సురేష్ జ్యోతి దంపతుల కొత్త ఇండ్లను రిబ్బన్ కట్ చేసి గృహప్రవేశం నిర్వహించారు. అనంతరం గృహ యజమానులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో పేదల జీవితాల్లో వెలుగు నింపుతున్నామన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి కొనసాగుతుందని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ప్రజల తరపున ఎమ్మెల్యే రాగమయి దయానంద్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, సత్తుపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శివా వేణు, సర్పంచ్ మౌనిక నరేంద్ర రెడ్డి, తోట రాజేష్‌తో పాటు రామగోవిందపురం గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/ సత్తుపల్లి :** సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ ఆసుపత్రిని ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి దయానంద్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ తో కలిసి ఆసుపత్రి సౌకర్యాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రి సేవలను మరింత బలోపేతం చేసే దిశగా సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో విలువైన వైద్య పరికరాలను నూతన ప్రభుత్వ ఆసుపత్రికి అందజేశారు. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందుబాటులోకి రావాలనే లక్ష్యంతో ఈ చర్యలు తీసుకున్నామని ఎమ్మెల్యే రాగమయి దయానంద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌ఓ, ఎంపిడిఒ, ప్రభుత్వ అధికారులు, సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ రిహాన బేగం, వైస్ చైర్మన్ బొంతు సుమలత, ఆసుపత్రి సూపరింటెండెంట్ సురేష్ నాయక్, సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాదె చెన్నారావు, కౌన్సిలర్లు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు ఇనపనూరి కుమారి, ఫయాజ్, మొరిశెట్టి సాంబశివరావు, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, మెడికల్ ఆఫీసర్లు, హాస్పిటల్ సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మొక్కజొన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

## సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు యర్రా బాబు



**ప్రజాపక్షం/ కొణిజర్ల :** గత రెండు రోజుల క్రితం అర్ధరాత్రి ఊహించని విధంగా ఒకేసారి గాలిదుమారంతో కూడిన భారీ వర్షం రావడంతో రైతులు తేరుకునే లోపే భారీ నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం మొక్కజొన్న రైతులను ఆదుకోవాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు యర్రా బాబు అన్నారు. బుధవారం రైతులతో కలిసి మండలకేంద్రం కొణిజర్లలో అకాల వర్షానికి దెబ్బతిన్న మొక్కజొన్న పంటను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు పది నుంచి పదిహేను రోజుల్లో కోతకువచ్చే దశలో ఉన్న మొక్కజొన్న పంట పూర్తిగా నేలకొరిగిందని తెలిపారు. కల్లాల్లో ఆరబోసిన లక్షలాది రూపాయల విలువైన మిర్చికూడా తడిసిపోవడంతో రైతులు కన్నీటిపర్యంతమవుతున్నారని అన్నారు. ప్రతియేటా ప్రకృతి రైతులపై పగపడుతుందని లక్షలాది రూపాయలుపెట్టుబడి పెట్టి తీరా నోటికాడికి వచ్చిన పంటను వరుణుడు దెబ్బతీస్తున్నాడని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎకరం మొక్కజొన్న పంటకు సుమారు రూ. 40 వేల నుంచి రూ.50 వేల వరకు పెట్టుబడి పెట్టారని దీనిని పరిగణలోకి తీసుకుని ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని ఆయన కోరారు.

# డిఫాల్ట్ రైస్‌మిల్లులపై క్రిమినల్ కేసులు నమోదు

## అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రభుత్వానికి సంబంధించిన ధాన్యం కస్టమ్ మిల్లింగ్ (సిఎంఆర్)లో ఒప్పంద నిబంధనలు ఉల్లంఘించి ప్రభుత్వానికి చెల్లించాల్సిన బకాయిలను చెల్లించకుండా డిఫాల్ట్ చేసిన రైసుమిల్లులపై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి బుధవారం తెలిపారు. ఖమ్మం రూరల్ మండలం మంగళగూడెంలోని శ్రీ సత్యనారాయణ సిల్కీ సార్టెక్స్ రైస్‌మిల్ యాజమాన్యం 2021–22 ఖరీఫ్, 2022–23 ఖరీఫ్, రబీ, 2023–24 ఖరీఫ్ సీజన్‌లో ప్రభుత్వానికి బియ్యం అందజేయడంలో విఫలమై రూ.9.49 కోట్లు అసలు బకాయి ఉండగా ఫెనాల్టీతో కలిపి రూ.13.84 కోట్ల వరకు డిఫాల్ట్ చేసినట్లు తెలిపారు. ఈ మిల్లు మేనేజింగ్ భాగస్వామి కన్నెటి జ్యోతి, మామిడాలి మానసలపై రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయబడిందన్నారు. నేలకొండపల్లి మండలం రాయిగూడెం గ్రామంలోని వెంకటేశ్వర రైస్‌మిల్ 2022–23 ఖరీఫ్, రబీ సీజన్లలో రూ.7.59 కోట్లు అసలు బకాయి కలిగి ఉండగా ఫెనాల్టీతో కలిపి రూ.10.88 కోట్ల వరకు డిఫాల్ట్ చేసినట్లు తెలిపారు. మిల్లు యజమాని మేకల రామారావు పై నేలకొండపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ ధాన్యం, నిధుల పరిరక్షణలో రాజీ పడబోమని డిఫాల్ట్ చేసే మిల్లర్లపై చట్టపరమైన కఠిన చర్యలు కొనసాగుతాయని అదనపు కలెక్టర్ హెచ్చరించారు. బకాయిల వసూలు చర్యలు వేగవంతం చేయడంతో పాటు సంబంధిత శాఖల ద్వారా తదుపరి విచారణ కొనసాగుతుందని అదనపు కలెక్టర్ తెలిపారు.

# టెన్నిస్‌లో ‘సర్వజ్ఞ’ విద్యార్థుల ప్రభంజనం

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** రాష్ట్ర స్థాయి టెన్నిస్ పోటీల్లో ఖమ్మం నగరంలోని సర్వజ్ఞ పాఠశాల విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబర్చి ప్రభంజనం సృష్టించారు. హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన సిఎం కప్ 2025 తెలంగాణ డిస్ట్రిక్ట్ మీట్ క్రీడల్లో టేకీడల్లో టెన్నిస్ డబుల్స్ విభాగంలో పాఠశాలకు చెందిన ఎనిమిదవ తరగతి విద్యార్థులు చార్విక్, ఫజల్ అత్యంత ప్రతిభ కనబర్చి కాంస్య పతాకాన్ని సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ నీలిమ ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించి పతాకాలు, ధృవీకరణ పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా డైరెక్టర్ నీలిమ మాట్లాడుతూ క్రీడలు శారీరక ధృడత్వానికే కాకుండా మానసిక ఉల్లాసానికి, క్రమశిక్షణకు దోహదపడతాయన్నారు. క్రీడల్లో గెలుపోటము సహజమని వాటిని సమానంగా స్వీకరించాలన్నారు. రాష్ట్ర స్థాయిలో తమ పాఠశాలకు, జిల్లాకు గుర్తింపు తీసుకు వచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# సింగరేణి కంపెనీ క్వార్టర్లు అన్యాక్రాంతం

## ఎఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి కామ్రేడ్ వై. రాంగోపాల్




**ప్రజాపక్షం/మణుగూరు :** సింగరేణి మణుగూరు ఏరియాలో కంపెనీ క్వార్టర్లలో ప్రైవేటు వారు యథేచ్ఛగా నివాసం ఉంటున్నారని గుర్తింపు కార్మిక సంఘం ఎఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి కామ్రేడ్ వై. రామ్ గోపాల్ ఆరోపించారు. పివి కాలనీ కామ్రేడ్ కెఎల్ మహేంద్ర భవన్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ మణుగూరు ఏరియా కంపెనీ క్వార్టర్లలో ప్రైవేటువారు యథేచ్ఛగా నివాసం ఉంటున్నారని, విచ్చలవిడిగా ఆక్రమించుకొని అన్ని సౌకర్యాలు అనుభవిస్తున్నారని అన్నారు. కంపెనీ క్వార్టర్‌లో కార్మికులు నివాసం ఉంటే మాత్రం పీనల్ రెంట్, ఛార్జిషీట్లు, పవర్ కట్, వాటర్ కట్ అంటూ మేనేజ్‌మెంట్ కార్మికులను వేధిస్తున్నారని అన్నారు. సింగరేణి కంపెనీ కోసం కష్టపడి పని చేసే కార్మికులను కాదని ప్రైవేటు వారికి అన్ని సౌకర్యాలు కలుగజేస్తూ అక్రమంగా కంపెనీ క్వార్టర్లలో నివాసానికి అనుమతిస్తున్నారని అన్నారు. ఖాళీగా ఉన్న క్వార్టర్‌ని టెంపరరీ అలాట్‌మెంట్ కోసం కార్మికుడు దరఖాస్తు చేసుకుంటే వంద షరతులు, అభ్యంతరాలు తెలియజేస్తున్న అధికారులు యథేచ్ఛగా ప్రైవేటువారు నివాసం ఉంటూ సింగరేణి కార్మికుడు అనుభవించవలసిన సౌకర్యాలు ప్రైవేటువారు అక్రమంగా అనుభవిస్తుంటే ఎలా ఊరుకుంటున్నారని ప్రశ్నించారు. మేనేజ్‌మెంట్, సెక్యూరిటీ వారు, ఎస్టేట్ వారికి అక్రమంగా సింగరేణి కంపెనీ క్వార్టర్లలో నివాసం ఉండే ప్రైవేట్ వారు వారి కండ్లకు కనబడటం లేదా? ఇది ఎలా సాధ్యపడుతుందని అన్నారు. ఈ సమావేశంలో బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ కామ్రేడ్ మల్లెల రామ నరసయ్య, ఆఫీస్ బేరర్స్ ఆధర్ల సురేందర్, ఆవుల నాగరాజు, ఫిట్ సెక్రటరీలు శనిగరపు కుమారస్వామి, ఈసం శ్రీనివాసరావు, ఆంతోని రవికుమార్, జానకి ప్రసాద్, ఇమాముద్దీన్, నాగుల సతీష్, ఎం. నాగరాజు, కె. రమేష్, అన్వర్ బేగ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాయాలి

## కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జిల్లాలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. గాంధీచౌక్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి బుధవారం తనిఖీ చేశారు. పరీక్ష జరుగుతున్న తీరు, పరీక్షా కేంద్రం నిర్వహణ విధానం, ప్రశ్నా పత్రాల భద్రత, హాల్‌టికెట్ల పరిశీలన ప్రక్రియలను కలెక్టర్ ప్రత్యేకంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలను ప్రశాంతంగా నిర్వహిస్తూ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామన్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా విద్యార్థులకు చల్లని త్రాగునీటిని సరఫరా చేయాలని, పరీక్షా కేంద్రానికి వచ్చే ప్రతి విద్యార్థిన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి లోపలికి అనుమతించాలన్నారు. పరీక్షా గదుల్లో వెలుతురు, త్రాగునీరు, మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా ఉండేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించ రాదని తెలిపారు. సిసి కెమెరాల పర్యవేక్షణ సక్రమంగా కొనసాగాలని, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు నిరంతరం తనిఖీలు నిర్వహించాలన్నారు. మొదటి రోజు ఇంటర్ మొదటి సంవత్సరం ద్వితీయ భాష పేపర్ 1పరీక్షకు జనరల్ ఒకేషనల్ కలిపి 18,258 మంది హాజరు కావాల్సి ఉండగా 17,667 మంది విద్యార్థులు హాజరయ్యారని 591 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు. ఎక్కడ మాల్ ప్రాక్టీస్ నమోదు కాలేదని, మొదటి రోజు పరీక్ష ప్రశాంతంగా జరిగిందని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని కలెక్టర్ తెలిపారు. పరీక్షా సిబ్బంది తమ విధులను నిబద్ధతతో బాధ్యతగా నిర్వహించాలని తెలిపారు. ఎలాంటి ఫిర్యాదులు వచ్చిన వెంటనే పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవిబాబు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కట్టు మల్లారం పోడు భూమి సమస్యపై ఎమ్మెల్యే పాయం చొరవ



**ప్రజాపక్షం/మణుగూరు :** మండల పరిధిలోని కట్టు మల్లారం గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న పోడు భూమి సమస్యపై ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రామ ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఫారెస్ట్ అధికారులను క్యాంపు కార్యాలయానికి పిలిపించి సమస్యను సమగ్రంగా చర్చించారు. గ్రామ ప్రజలకు న్యాయం జరిగేలా చట్టపరమైన పరిధిలో పరిష్కారం కనుగొనేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ అధికారులు, గ్రామ సర్పంచ్ జిగిడి ప్రసాద్ , కుంజా వీరభద్రం, కొర్సా చంద్రయ్య, కొర్సా వెంకటేశ్ , కుంజా ప్రసాద్, మడకం లక్ష్మయ్య, గ్రామ ప్రతినిధులు పాల్గొన్నారు. గ్రామ ప్రజల హక్కులు పరిరక్షించేందుకు తాను ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటానని ఎమ్మెల్యే తెలిపారు. గ్రామ ప్రజలు తమ సమస్యపై స్పందించి చొరవ చూపిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

# పెన్షనర్ల బకాయిలను తక్షణమే చెల్లించాలి

## ఎస్‌జిపిఎటి జిల్లా అధ్యక్షుడు పరిశ పుల్లయ్య



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఉద్యోగ విరమణ చేసిన పెన్షనర్ల బకాయిలను సత్వరమే చెల్లించి వారి మరణాలను నిలువరింపజేయాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పరిశ పుల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలపై ఎస్‌జిపిఎటి ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట గల ధర్నా చౌక్ వద్ద చేపట్టిన మూడవ రోజు శిక్షా శిబిరాన్ని జిల్లా అధ్యక్షుడు పరిశ పుల్లయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖమ్మంజిల్లాలో ప్రారంభమైన పెన్షనర్ల ఉద్యమం రాష్ట్రవ్యాప్తంగా రోజు రోజుకు బలోపేతమవుతుందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు పెన్షనర్ల ఉద్యమానికి మద్దతునిస్తున్నాయని పరిశ పుల్లయ్య తెలిపారు. రాబోయే వార్షిక బడ్జెట్‌లో పెన్షనర్ల బకాయిల కోసం రూ. 20వేల కోట్లు కేటాయించాలని, ప్రతి నెల ఉద్యోగ విరమణ చేస్తున్న పెన్షనర్ల బకాయిల చెల్లింపుకై నెలకు రూ. 500 కోట్లు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం తరుపున డిమాండ్ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వం తక్షణమే పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని లేని పక్షంలో పెన్షనర్లు రానున్న రోజుల్లో మరింతగా ఉద్యమించడానికి సిద్ధమయ్యారన్నారు. ఎస్‌జిపిఎటి రాష్ట్ర కార్యదర్శి మేరీ ఏసుపాదం, పోలీస్ అధికారుల సంఘం నాయకులు ఆర్. రాధాకృష్ణమూర్తి, వెంకటనారాయణ, టిపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంగళరావు, రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌కె కరీం, విశ్రాంత ట్రెజరీ అధికారి ఫణిరాజ్‌కుమార్ దీక్షా శిబిరాన్ని సందర్శించి దీక్షలకు సంఘీభావం తెలిపి పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాయల రవికుమార్, కనపర్తి వెంకటేశ్వర్లు, పెదమాళ్ల సత్యనారాయణ, కొలికొండ శరత్‌బాబు, ఊడుగు వెంకటేశ్వర్లు, ఎం. రామారావు, రామకోటేశ్వరరావు, విద్యాసాగర్, కనకదుర్గ, ఉషారాణి, ఉదయశ్రీ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పెన్షనర్ల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కోరుతూ జిల్లా అదనపు కలెక్టర్ డా॥ పి. శ్రీజకు వినతి పత్రాన్ని సమర్పించారు.

# రెజొనెన్స్‌లో ‘ఫేర్‌వెల్’ డే



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని శ్రీ నగర్ కాలనీలో గల స్టెమ్‌స్పార్క్ రెజొనెన్స్ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు వేడుక (ఫేర్‌వెల్ డే) ఘనంగా నిర్వహించారు. బుధవారం పాఠశాలలో నిర్వహించిన ఈ వేడుకలకు ప్రముఖ చిన్నపిల్లల వైద్య నిపుణులు కూరపాటి ప్రదీప్‌కుమార్, పాఠశాల డైరెక్టర్లు కొండా శ్రీధర్‌రావు, కొండా కృష్ణవేణి లు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కూరపాటి ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల ఉన్నతిలో తల్లిదండ్రులు, గురువుల పాత్ర చాలా గొప్పదన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల పట్ల శ్రద్ధవహించాలన్నారు. ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని అలవర్చుకోవాలన్నారు. సమాజం పట్ల బాధ్యత కలిగి ఉండాలన్నారు. డైరెక్టర్లు కొండా శ్రీధర్‌రావు, కొండా కృష్ణవేణి లు మాట్లాడుతూ విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉంటూ పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలన్నారు. పదవ తరగతి విద్యార్థులను చక్కటి ప్రణాళికతో పరీక్షలకు సిద్ధం చేసిన ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు. ప్రతి ఒక్కరూ మంచి మార్కులు సాధించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆటపాటలు, నృత్యాలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఇఎస్ఐ ఆస్పత్రికి మెరుగైన వైద్యసేవలు

వరంగల్ ఎంపి డాక్టర్ కడియం కావ్య



**ప్రజాపక్షం/వరంగల్ :** భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకోని, రోజు రోజుకు కార్మికుల సంఖ్యలో ఆస్పత్రికి పెరిగే అవకాలు ఉన్నందున ఈఎస్ఐ ఆస్పత్రికి మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కృషి చేయాలని వరంగల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ కడియం కావ్య అన్నారు. వరంగల్‌లోని ఈఎస్ఐ ఆసుపత్రిని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, జిల్లా కలెక్టర్ సత్య శారదతో కలిసి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని అవుట్‌పేషెంట్ విభాగం, ఇన్‌పేషెంట్ వార్డులు, మందుల సరఫరా, వైద్య సేవల పరిస్థితిని పరిశీలించారు. రోగులతో మాట్లాడి వారికి అందుతున్న చికిత్సపై వివరాలు తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఎంపి కడియం కావ్య మాట్లాడుతూ వరంగల్ జిల్లాకు త్వరలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, మెగా టెక్స్‌టైల్ పార్క్, విమానాశ్రయం వంటి మూడు ప్రధాన ప్రాజెక్టులు రానున్న నేపథ్యంలో కార్మికుల సంఖ్య భారీగా పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ కారణంగా చికిత్స కోసం ఈఎస్ఐ ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య మరింత పెరుగుతుందని, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆసుపత్రి సౌకర్యాలను ఇప్పటినుంచే బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలోనే ఈఎస్ఐ ఆసుపత్రిని తనిఖీ చేశామన్నారు. ఆస్పపత్రి వైద్యులు, నర్సులు, సిబ్బందితో ఎంపి, కలెక్టర్ లు సమావేశమై ఆసుపత్రి నిర్వహణ, సౌకర్యాలలోటు పాట్లు, సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. వైద్యుల ఖాళీల భర్తీ, మందుల కొరత, శానిటేషన్ పరిస్థితులపై ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రికి అవసరమైన నిధులు, వసతులు తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కార దిశగా కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. ఆసుపత్రి పరిసరాల్లో పరిశుభ్రతను మెరుగుపరచడంతో పాటు జంగిల్ క్లియరెన్స్ చేపట్టి తక్షణమే శుభ్రపరిచే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, డిఎంహెచ్ఓ డాక్టర్ బి. సాంబశివరావు, ఆసుపత్రి సివిల్ సర్జన్స్ డాక్టర్ స్వరాజ్యలక్ష్మి, డాక్టర్ అశోక్, డాక్టర్ రామచంద్ర, ఆర్ఎంఓ డాక్టర్ యుగేందర్ ఇతర వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మహబూబాబాద్ జిల్లాలో అకాల వర్షం

గూడూరులో భారీ నష్టం



**ప్రజాపక్షం/గూడూరు:** మహబూబాబాద్ జిల్లాలోని పలు మండలాల్లో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది.బుధవారం గూడూరు కొత్తగూడ మండలాల్లో కురిసిన అకాల వర్షం ప్రజలను రైతులను ఉలిక్కిపడేలా చేసింది.గూడూరు మండల వ్యాప్తంగా ఉన్న 41 గ్రామ పంచాయతీల్లో ఈదురు గాలులతో కూడిన అకాల వర్షం బీభత్సం సృష్టించింది. గాలి దుమారానికి తోడు భారీ వర్షం పడటంతో చేతికొచ్చిన మొక్కజొన్న మిర్చి పంటలు నేలమట్టమయ్యాయి.తీవ్రమైన పెట్టుబడి పెట్టి పంటను కాపాడుకున్న తరుణంలో ప్రకృతి ప్రకోపంతో పంటలు దెబ్బతినడంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. మరోవైపు కొత్తగూడ మండల కేంద్రంతో పాటు గూడూరు మడలంలో పలు గ్రామాల్లో మూస్తరు వర్షం కురిసింది.గత కొన్ని రోజులుగా ఎండ వేడిమితో అల్లాడుతున్న జనాలకు ఈ వర్షం ఆరుతడి పంటలకు మేలు చేస్తుందని కొందరు రైతులు భావిస్తుండగా కోత దశలో ఉన్న పంటలకు నష్టం వాటిల్లుతుందని మరికొందరు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## బాలసముద్రం ట్రాన్స్ఫర్ స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** చెత్త తరలింపు వాహనాలు నిర్దేశిత సమయానికి ట్రాన్స్ఫర్ స్టేషన్‌కు చేరుకోవాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులకు సూచించారు. బుధవారం హన్మకొండలోని బాలసముద్రంలో బల్దియా నిర్వహిస్తున్న ట్రాన్స్ఫర్ స్టేషన్‌లో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించి వాహన మరమ్మత్తుల తీరుతో పాటు తడి, పొడి చెత్త సేకరణ విధానాన్ని అధికారులను అడిగి తెలుసుకొని సమర్థవంతంగా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వెహికల్ షెడ్‌కు చేరే స్వచ్ఛ ఆటోలు వాహనాలు తడి, పొడి చెత్తను వేరుగా తీసుకువస్తున్నాయా? అని అడిగి తెలుసుకొని ఎన్ని వాహనాలు మరమ్మత్తులు చేపట్టుటకు షెడ్‌లో ఉన్నాయన్న కమిషనర్ కాంపాక్టర్‌ల స్థితిగతులను ఈఈని అడిగి తెలుసుకున్నారు. ఏ సమయానికి ట్రాన్స్ఫర్ స్టేషన్‌కు చేరుతున్నాయని, చెత్త తరలింపు ట్రాక్టర్లు జేసిబిలతో పాటు వివిధ శానిటేషన్ వాహనాల కదలికల గురించి ఏంహెచ్ఓను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, మాధవిలత, మహేందర్, రాజ్‌కుమార్, సానిటరీ సూపర్‌వైజర్ నరేందర్, పాల్గొన్నారు.

## ఇంటర్మీడియట్ పరీక్షలు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

**ప్రజాపక్షం/నెక్కొండ:** నెక్కొండ మండలంలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం(11వ తరగతి) పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించబడ్డాయి. మండల కేంద్రంలోని ప్రభుత్వ, ప్రయివేట్ కళాశాలల్లో పరీక్షలు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా సజావుగా సాగాయి. పరీక్షల సెంటర్ సూపరింటిండెంట్ పెండ్లి అశోక్ కుమార్, సిట్టింగ్ స్కాట్, పాలకొండ రవి(డిప్యూటీ తహసీల్దారు)లు తెలిపిన వివరాల ప్రకారం, మొత్తం 223 మంది విద్యార్థులు గైర్హజరయ్యారు. 220 మంది విద్యార్థులు హాజరయ్యారు. అదనంగా ఒక వృత్తి విద్య (ఒకేషనల్) విద్యార్థి హాజరు కావడంతో మొత్తం హాజరు సంఖ్య 221కి చేరింది. పరీక్షా కేంద్రాల వద్ద అధికారులు, పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టి మాస్ కాఫీయింగ్ వంటి అక్రమాలకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. పరీక్షలు ప్రశాంతంగా ముగియడంతో అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులు కూడా నిబంధనలు పాటిస్తూ ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసినట్లు అధికారులు తెలిపారు.

## జనగామ జిల్లాను పిఎండిడికెవైలో ఆదర్శ జిల్లాగా నిలబెట్టాలి

**ప్రజాపక్షం/జనగామ :** ప్రధాన్ మంత్రి ధన్ ధాన్య యోజన కార్యక్రమంలో జనగామ జిల్లాను ఆదర్శ జిల్లాగా నిలబెట్టాలని జనగామ జిల్లా అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. ధన్ ధాన్య యోజన పథకం అమలుపై కేంద్ర ప్రభుత్వ సంయుక్త కార్యదర్శి చిన్మయ్ పి గోట్మారే వీడియో కాన్ఫరెన్స్ నిర్వయించారు. ఈ సందర్భంగా వారు పలు అంశాలపై పలు సూచనలు చేశారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ ధన్‌ధాన్య యోజన పథకంలో ఆరు సంవత్సరాల కార్యాచరణ ప్రణాళిక అమలు, లక్ష్య సాధన, డ్యాష్‌బోర్డలో నమోదైన పురోగతి, భౌతిక, ఆర్థిక స్థితిగతులపై సమీక్షించారు. పంటల ఉత్పాదకత పెంచాలని, సుస్థిర వ్యవసాయ పద్ధతులు అవలంబించాలని, రైతులకు సులభతర రుణ సదుపాయలు కల్పించానలి, వ్యవసాయ రంగంలో ఆదునిక సాంకేతిక వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జిల్లా అధికారి అంబికాసోని పాటు ఉద్యానవన, భూగర్భ జల, మత్స్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ స్పోర్ట్స్ స్కూల్ 4వ తరగతి ప్రవేశాలకు ఎంపిక

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** తెలంగాణ ప్రభుత్వ స్పోర్ట్స్ స్కూల్లో హకీంపేట్‌లో 10 బాలురు, 10 బాలికలు చొప్పున 202627 సంవత్సరానికి గాను నాల్గవ తరగతిలో ప్రవేశానికి ఎంపిక కొరకు జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో మండల, జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి చిర్ర రఘు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన అయిన విద్యార్థిని, విద్యార్థులు https://tgss.telangana.gov.in/ వెబ్ సైట్ లో ఈ నెల 26 నుండి మార్చి 04 లోపు పేరు నమోదు చేసుకోగలరని తెలిపారు. ఎంపికలకు వచ్చే అభ్యర్థుల వయస్సు 4వ తరగతి కొరకు 8 సంవత్సరాలలోపు అనగా సెప్టెంబర్ 01 2017 నుండి 31–08–2018 లోపు మధ్యలో జన్మించి వుండాలని పేర్కొన్నారు.నాల్గవ తరగతి చదువబోతున్న విద్యార్థులు మండల స్థాయి పోటీలు మార్చి 13–2026 నుండి 17–03–2026 లోపు మండల విద్య అధికారి ద్వారా నిర్వహించబడునని తెలిపారు.మండల స్థాయిలో ఎంపికైన 4వ తరగతి విద్యార్థిని, విద్యార్థులకు జిల్లా స్థాయి ఎంపికల తేదిని త్వరలోనే తెలియచేస్తామని తెలిపారు. భూపాలపల్లి జిల్లా కేంద్రం లోని అంబేద్కర్ స్టేడియం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో జరుగు ఎంపిక లు 27–04–2026 నుండి 01–05–2026 వరకు జరుగునని తెలిపారు. మండల, జిల్లా స్థాయి క్రీడా పోటిలకు హాజరగు విద్యార్థిని, విధ్యార్థులు ఈ క్రింద తెలిపిన ధ్రువ పత్రములు ఒరిజినల్ మరియు జిరాక్స్ కాపీ తమ వెంబడి తిసుకోనిరగలని,కావున ఆసక్తిగల విద్యార్థిని, విద్యార్థులు ఆన్లైన్ లో పేరు నమోదు చేసుకొని మండల విద్య శాఖ అధికారిని సంప్రదించి పోటి లలో పాల్గొనాలని ఆయన తెలిపారు.ఇతర వివరాలకు మి మండల విద్య శాఖ అధికారిని సంప్రదించగలరని పేర్కొన్నారు.

## కలెక్టరేట్ భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి



**ప్రజాపక్షం/ములుగు:** జిల్లా కేంద్రానికి సమీపంలోని డిగ్రీ కళాశాల సమీపంలో నిర్మిస్తున్న కలెక్టర్ కార్యాలయ భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, అధికారులకు, ప్రజలకు అనుకూలంగా ఉండే విధంగా సుందరంగా తీర్చిదిద్దాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, ములుగు మున్సిపల్ చైర్మన్ చింతనిప్పుల చంద్రకళ బిక్షపతిలతో కలిసి నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ అన్ని నిర్మాణ పనులను నాణ్యతతో పూర్తి చేయాలని, అనుకున్న సమయానికి ముందుగానే అందుబాటులోకి తీసుకురావడానికి సంబంధిత అధికారులు, గుత్తేదారు చొరవ చూపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు: కలెక్టర్



**ప్రజాపక్షం/పరకాల :** పరకాల మున్సిపాలిటీ పరిధిలో వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. హనుమకొండ జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో పరకాల మున్సిపల్ కమిషనర్ అంజయ్య, ఇతర అధికారులతో పరకాల మున్సిపాలిటీకి సంబంధించి తాగునీటి సరఫరాకు సమ్మర్ యాక్షన్ ప్లాన్ పై కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పరకాల మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలకు తాగునీటి సరఫరా కి సంబంధించి తీసుకుంటున్న చర్యలు, ప్రతిరోజు నీటి సరఫరా గురించి ,కలెక్టర్ కు మున్సిపాలిటీ కమిషనర్, అధికారులు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ వేసవిలో తాగునీటి సరఫరా లో ఎక్కడా కూడా ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగానే ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. అవసరమైన చోట్ల నీటి ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలన్నారు. ఈ సమావేశంలో ఈఈ సుచరణ్, ఏఈ రంజిత్, పాల్గొన్నారు.

## బలైన బేబీ మౌనికకు న్యాయం చేయాలి

నిందితులను వెంటనే అరెస్ట్ చేసి కఠిన శిక్ష విధించాలి

ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఊట్కూరి ప్రణీత్ గౌడ్, జిల్లా కార్యదర్శి భాష బోయిన సంతోష్



**ప్రజాపక్షం/హనుమకొండటౌన్ :** నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర మల్లికార్జున స్వామి జాతరలో జరిగిన నవజాత శిశువు బేబీ మౌనిక మృతి ఘటనపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ, నిందితులను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య డిమాండ్ చేసింది. ఈ ఘటనకు నిరసనగా ఏఐఎస్ఎఫ్ కాకతీయ యూనివర్సిటీ కార్యదర్శి బొజ్జ జ్యోతి ఆధ్వర్యంలో యూనివర్సిటీ ఫస్ట్ గేట్ ముందు కొవ్వొత్తులతో నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఊట్కూరి ప్రణీత్ గౌడ్, జిల్లా కార్యదర్శి భాష బోయిన సంతోష్ మాట్లాడుతూ నాగర్ కర్నూల్ జిల్లాలో జరిగిన ఈ ఘటన కేవలం ఒక కుటుంబానికి జరిగిన విషాదం మాత్రమే కాకుండా, సమాజంలో ఇంకా కొనసాగుతున్న కుల వివక్షకు ప్రతిబింబమని అన్నారు. రెండు నెలల పసిపాప కూడా కుల దురహంకారానికి బలి కావడం అత్యంత దారుణమని పేర్కొన్నారు. నిందితులైన ఎనిమిది మందిని వెంటనే అరెస్ట్ చేసి కేసును ఫాస్ట్ ట్రాక్ కోర్టుకు అప్పగించాలని, బాధిత కుటుంబానికి తగిన ఆర్థిక సహాయం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనకు రాజకీయ రక్షణ కల్పించే ప్రయత్నాలు ఉంటే వాటిని తీవ్రంగా ఖండిస్తామని హెచ్చరించారు. గ్రామ సర్పంచ్, కాంగ్రెస్ నేత తుకారాం రెడ్డి సమక్షంలోనే దాడి జరిగిందన్న ఆరోపణలను సమగ్రంగా విచారించాలని కోరారు. బాధిత కుటుంబం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు కఠిన చర్యలు తీసుకోకపోవడం ఆందోళనకరమని తెలిపారు. నిందితులను వెంటనే అరెస్ట్ చేయకపోతే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బేబీ మౌనికకు పూర్తి న్యాయం జరిగే వరకు, దోషులకు శిక్ష పడే వరకు ఏఐఎస్ఎఫ్ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు జిల్లా ఉపాధ్యక్షులు జక్కుల భాను ప్రసాద్. జిల్లా సాయ కార్యదర్శి లావణ్య, యూనివర్సిటీ నాయకులు శ్రావ్య, సునీత, నవ్య, అనుశ్రీ, రాజు, విశాల్, అఫ్జల్, లతోపాటు తదితరులు పాల్గొన్నారు.

## త్వరగా అభివృద్ధి పనులు పూర్తి: ఎమ్మెల్యే నాయిని



**ప్రజాపక్షం/హనుమకొండ:** వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ తో కలిసి వివిధ శాఖల అధికారులతో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సమీక్షా సమావేశంలో కాజీపేట ఆర్వోబీ, ఇందిరమ్మ ఇండ్లు, హనుమకొండ కాజీపేట తహసీల్దార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలకు స్థలాల గుర్తింపు, బీసీ భవన్ , వెల్ నెస్ సెంటర్ లో వైద్యులు, సిబ్బంది కొరత, ఇతరత్రా అంశాలు, వడ్డేపల్లిలో నిర్మాణంలో ఉన్న ఆరోగ్య కేంద్రం, ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి, తదితర అభివృద్ధి పనుల పురోగతి పై ఎమ్మెల్యే, కలెక్టర్ సమీక్షించారు.ఈ సమావేశంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ కాజీపేట ఆర్వోబీ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆర్ అండ్ బీ ఈఈ సురేష్ బాబు కు తెలియజేశారు. ఏవైనా ఇబ్బందులు ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు బిల్లుల చెల్లింపు చేయాలని, కొత్తగా ఇండ్లు నిర్మించుకునే వారికి ప్రొసీడింగ్స్ ఇవ్వాలని గృహ నిర్మాణ శాఖ పీడీ సిద్దార్థ నాయక్ కు సూచించారు. అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలన్నారు. నిరుపేదలు నిర్మించుకుంటున్న ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు చిన్న చిన్న కారణాలతో బిల్లులు చెల్లించడం లేదని, అధికారులు బిల్లులు చెల్లింపులు చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా డయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు.ఈ సమావేశంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ హనుమకొండ, కాజీపేట మండలాల తహసీల్దార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలకు కోసం స్థలాలు గుర్తించాలని తహసీల్దార్లను ఆదేశించారు. అదేవిధంగా జిల్లాలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు కు ఉన్న అవకాశాలు పరిశీలించాలని డీఎంహెచ్వో డాక్టర్ అప్పయ్య ను ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, స్థానిక కార్పొరేటర్ ఏనుగుల మానస రాంప్రసాద్, బీసీ వెల్ఫేర్ అధికారి నరసింహ స్వామి, జీఎంహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి, తహసీల్దార్లు రాజు, రవీందర్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## మహిళా సాధికారతకు ప్రభుత్వం ప్రత్యేక కృషి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**ప్రజాపక్షం/భూపాలపల్లి:** మహిళా సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, మహిళ శక్తి దేశ అభివృద్ధికి పునాది లాంటిదని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. బుధవారం భూపాలపల్లి అంబేద్కర్ స్టేడియంలో జరిగిన బేటీ బచావో బేటీ పడావో మిషన్ శక్తి జిల్లా మహిళా సాధికారత కేంద్రం మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమెన్ ఎంపవర్‌మెంట్ ర్యాలీలో గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా పాల్గొని జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించినారు. అనంతరం ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆడబిడ్డల అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని, మహిళ సాధికారతే ప్రభుత్వ లక్ష్యంగా మహిళల విద్య, ఉపాధి అవకాశాలు, స్వయం ఉపాధి సంఘాల బలోపేతం చేయాలన్నారు. మహిళలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ముందుకు రావాలని పిలుపునిస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు. మహిళల భద్రత, స్వాభిమానంతో జీవించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట జాయింట్ కలెక్టర్ అశోక్ కు మార్, జిల్లా అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి మల్లీశ్వరి, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## చెల్పూరు మిల్లెట్ 'క్యూమార్ట్'లో



**ప్రజాపక్షం/భూపాలపల్లి:** చెల్పూరు మహిళ మిల్లెట్ యూనిట్ ఉత్పత్తులకు హైదరాబాద్ క్యూ మార్ట్‌లో మార్కెటింగ్ అవకాశం మహిళా సంఘాలకు నగర మార్కెట్ ఆదాయ వృద్ధికి కొత్త ది జిల్లాలోని చెల్పూరు మహిళ మిల్లెట్ యూనిట్ ద్వారా తయారుచేసిన పోషకాహార తినుబండారాలను హైదరాబాద్‌లోని క్యూ మార్ట్‌లో అమ్మకానికి ఉంచేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారులతో పాటు హైదరాబాద్ నుండి వచ్చిన క్యూ మార్ట్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మహిళా సమాఖ్య సంఘాల ద్వారా తయారవుతున్న నాణ్యమైన ఉత్పత్తులకు విస్తృత మార్కెటింగ్ అవకాశాలు కల్పించడం జిల్లా యంత్రాంగం లక్ష్యమని తెలిపారు. చెల్పూరు మహిళ మిల్లెట్ యూనిట్ ద్వారా తయారవుతున్న మిల్లెట్ పౌడర్, మిల్లెట్ రైస్, మిల్లెట్ ఉప్మా రవ్వ, రాగి లడ్డు, నువ్వుల లడ్డు వంటి పోషకాహార పదార్థాలు క్యూ మార్ట్‌లో విక్రయించ బడనున్నాయని పేర్కొన్నారు. ఈ ఒప్పందం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో తయారవుతున్న ఉత్పత్తులకు నగర మార్కెట్ అందుబాటులోకి వస్తుందని, తద్వారా మహిళా సంఘాల ఆదాయం పెరగడంతో పాటు స్వయం ఉపాధి అవకాశాలు మరింత విస్తరించనున్నాయని కలెక్టర్ వివరించారు. మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడమే కాకుండా, ఆరోగ్యకరమైన మిల్లెట్ ఆహారాలను ప్రజలకు అందించడంలో ఈ కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తుందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి బాలకృష్ణ, క్యూ మార్ట్ ప్రతినిధులు మరియు మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రెస్టన్ భూముల జోలికొస్తే ఊరుకోం

56 డాక్యుమెంట్లతో 200 కోట్లు కాజేసిన జగన్‌మోహన్‌రెడ్డి

ప్రెస్టన్ గ్రౌండ్ సమాజం అందరిది

అన్న కెఎం జాన్



**ప్రజాపక్షం/జనగామ:** జనగామ జిల్లా కేంద్రంలోని విలువైన ప్రెస్టన్ భూముల జోలికి ఎవరొచ్చినా ఊరుకునేది లేదని ప్రెస్టన్ స్కూల్ మాజీ కరస్పాండెట్ కెఎం జాన్, ప్రస్తుత కరస్పాండెంట్ బక్క ప్రవీన్‌కుమార్, ప్రాపర్టీ ప్రొడక్షన్ కమిటి చైర్మన్ దామెర జేమ్స్ హెచ్చరించారు. రూథర్‌ఫర్డ్, ఉంద్రుపుర జనగామ పోల సమాజానికి ఇచ్చిన గొప్ప వరం ప్రెస్టన్ భూములని వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. బుధవారం జనగామలోని ప్రెస్టన్ పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. దక్షిణ రష్యాకు చెందిన ఉంద్రు దంపతులు విద్యా, వైద్య, సువార్త వ్యాప్తి కోసం జనగామలోని హన్మకొండ, హైదరాబాద్ రోడ్డును అనుకొని 1901లో విలువైన భూములు కొనుగోలు చేయడం జరిగిందన్నారు. వివిఎస్ ట్రూట్ ప్రెస్టన్ చనిపోగా వారి పేర 1919లో ప్రెస్టన్ పాఠశాల ప్రారంభించడం జరిగిందని, ఈ పాఠశాలలో చదవిన వారు వేల మంది వివిధ స్థాయిలో, ఇతర దేశాల్లో స్థిరపడ్డారని, బడుగు, బలహీనవర్గాల కోసమే ఈ పాఠశాల ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 1960లో జనరల్ కౌన్సిల్ ఏర్పాటు చేసి, ఎస్‌టిబిసి సంస్థగా మారిందన్నారు. 1973లో కంపెనీ యాక్ట్ కింద పిఎబిసి ఏర్పాటు చేయగా కొందరు స్వార్థపరులు చొరబడి విలువైన భూముల్ని కొందరికి రిజిస్ట్రేషన్ చేయడం జరిగిందన్నారు. ఈ భూములపై 1994లో ఐదు రీజన్లుగా ఏర్పడి మద్రాస్ హైకోర్టుకు వెళ్లాయన్నారు. స్వార్థపూరిత ఆలోచనలు, నాయకత్వం సక్రమంగా లేకపోవడం వలన కొంత భూమి అన్యాక్రాంతం అయిన మాట వాస్తవమన్నారు. 2003లో ప్రెస్టన్ భూముల అమ్మకానికి వీలు లేదని, 2005లో ప్రెస్టన్‌మ భూములు కొనుగోలు చేసినా చెల్లదని మద్రాస్ కోర్టు తీర్పునిచ్చిందని గుర్తు చేశారు. ఈ భూముల విషయంలో పున్నయ్య కమీషన్ కూడా వేయడం జరిగిందని, 124 ఆర్డర్ ప్రకారం అనిల్ రాజ్, సుధీర్‌రాజ్‌కు నోటీసులు కూడా పంపడం జరిగిందన్నారు. తుమ్మ జగన్ మోహన్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డిలు తమకు హక్కులు ఉన్నాయని ఇష్టారాజ్యంగా అమ్మకాలు జరిపారని, అవి చెల్లవని గతంలోనే కోర్టు చెప్పిందన్నారు. దొంగ జిపిఎలు సృష్టించి ప్రెస్టన్ భూముల్ని కాజేయాలని చూస్తున్నారని 56 డాక్యుమెంట్లతో 200 కోట్ల లావాదేవీలు జరిపారని కరస్పాండెంట్ బక్క ప్రవీన్‌కుమార్ ఆరోపించారు. రూథర్‌ఫర్డ్ నిర్మాణం చేసిన హాస్టల్‌ను కబ్జా చేయాలని చూస్తున్నారా..గోడను పగలగొడతారా.. ఇది ఎవరి ఆస్తి అనుకున్నారు.. ప్రెస్టన్ స్కూల్‌కు ఒక్క రూపాయి సహాయం చేయని మీరు ఎంత ధైర్యంతో గోడకు పొక్క పెడతారని ప్రశ్నించారు. కోర్టు తీర్పును పక్కదారి పట్టిస్తున్నారని, ప్రెస్టన్ భూముల జోలికి ఎవరు వచ్చినా ఊరుకునేది లేదని వారు హెచ్చరించారు. ఈ విలేకర్ల సమావేశంలో రాజ్‌కుమార్, మేకల ఏసుపాదం, దేవదానం, రాజరత్నం, తూడి ఆనంద్, బెస్లింగ్‌టన్, దామెర ప్రసాద్, కరుణాకర్, ప్రసాద్, ప్రభాకర్, థామస్ తదితరులు పాల్గొన్నారు.

## పదవ తరగతి పరీక్షల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి: సిద్దార్థ రెడ్డి

**ప్రజాపక్షం/ములుగు:** మార్చి 14వ తేదీ నుండి పదవ తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలు నిర్వహించనున్న నేపథ్యంలో చీఫ్ సూపరింటిండెంట్, డిపార్మెంటల్ ఆఫీసర్లకు జిల్లా విద్యాశాఖ అధికారి ములుగు ఏ సిద్దార్థ రెడ్డి అధ్యక్షతన ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు నిర్వహించేలా చీఫ్ సూపరింటిండెంట్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు సంయుక్తంగా బాధ్యత వహించాలని వారు అన్నారు. పరీక్ష కేంద్రాలను ముందస్తుగా సందర్శించి విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కల్గకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకొని సిద్ధంగా ఉండాలని వారు అన్నారు. ఈ పదవ తరగతి పరీక్షలకు మొదటిసారిగా క్లాక్ రూమ్ నిర్వహణ ప్రవేశపెట్టినందున విద్యార్థుల వస్తువులు బ్యాగులు ఏమైనా ఉన్నట్లయితే క్లాక్ రూమ్ వద్ద భద్రపరచుటకు తగిన ఏర్పాట్లు చేయాలని అన్నారు.

హిట్ సినిమా దసరా తర్వాత నాని, శ్రీకాంత్ ఓదెల చేస్తున్న సినిమా ప్యారడైజ్. ఎస్‌ఎల్‌వీ సినిమాస్ ఆధ్వర్యంలో సుధాకర్ చెరుకూరి ప్రతిష్టాత్మకంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించిన ఆయాషెర్ అనే పాటను విడుదల చేశారు.

రీల్

## తెలంగాణ,మహారాష్ట్ర సరిహద్దులో జరిగే కథ 'భోగి'



శర్వానంద్, సంపత్ నందితో కలిసి భారీ పాన్ ఇండియా పీరియడ్ యాక్షన్ డ్రామా 'భోగి' సినిమా చేస్తున్నారు. శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కెకె రాధామోహన్ ఎపిక్ స్కేల్లో నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని లక్ష్మీ రాధామోహన్ సమర్పిస్తున్నారు. ఈ చిత్రం శర్వానంద్ కెరీర్లో అత్యంత ప్రతిష్టాత్మకమైన చిత్రలలో ఒకటిగా రూపొందుతోంది. ఈ సినిమాకు సంబదించిన ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఫస్ట్‌లుక్ శర్వా ఇప్పటివరకు కనిపించని రగ్గడ్, ఫెరోషస్ మాస్ అవతార్లో కనిపిస్తున్నారు. రగ్గడ్ గడ్డం, మీసం, కర్లింగ్ జుట్టుతో రా, రఫ్ లుక్లో కనిపించడం అదిరిపోయింది. భారీ మాచెట్లాంటి ఆయుధం వెనుక కూర్చుని ఉన్న శర్వా లుక్, సినిమాలోని హింసాత్మక ప్రపంచాన్ని సూచిస్తుంది. ఎంబర్స్, స్పార్క్స్‌నిండిన డార్క్ బ్యాగ్రవ్‌తో నిర్మిస్తున్నారు. ఈ సినిమాకోసం శర్వా పూర్తిగా ట్రాన్స్‌ఫార్మేషన్ అయ్యారు. ఇది ఆయనలోని కొత్త కోణాన్ని చూపించే కంప్లీట్ రీ ఇన్వెన్షన్. ప్రతి ఫ్రేమ్‌లోనూ శర్వా 'బీస్ట్ మోడ్'లోకి అడుగుపెడుతున్నారని స్పష్టమవుతోంది. డైరెక్టర్ సంపత్ నంది ఈ చిత్రాన్ని 1960ల కాలంలో ఉత్తర తెలంగాణ,మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతం నేపథ్యంలో తెరకెక్కిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో భారీ స్పె ముఖ్యమైన యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరిస్తున్నారు. ప్రముఖ స్టంట్ మాస్టర్ దిలీప్ సుబ్బరాయన్ ఈ భారీ యాక్షన్ ఎపిసోడ్లను డిజైన్ చేశారు. ఈ చిత్రంలో అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయతి కథానాయికలుగా నటిస్తున్నారు. ఈ చిత్రానికి ఆర్ట్ డైరెక్టర్ కిరణ్ కుమార్ మన్నె, సినిమాటోగ్రఫీ కిషోర్ కుమార్ అరోకియా నిర్వహిస్తుండగా, భీమ్స్ సిసిరోలియో సంగీతాన్ని అందిస్తున్నారు.ఈ చిత్రాన్ని ఆగస్టు 28న రక్షా బంధన్ సందర్భంగా తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషలలో ఒకేసారి గ్రాండ్ పాన్‌ఇండియా రిలీజ్ చేస్తున్నట్లు నిర్మాతలు ప్రకటించారు.

## రాయలసీమ కథతో 'ఉత్తుత్త హీరోలు'

'ఉత్తుత్త హీరోలు' సినిమాను ఎంవిఎం పిక్చర్స్ బ్యానర్ పై మహేష్ విట్టా నిర్మించారు . హాస్య నటుడిగా పేరుతెచ్చుకున్న మహేష్ విట్టా తొలిసారిగా నిర్మాణంలోకి అడుగుపెట్టారు. రాయలసీమ నేపథ్యంలో సాగే కథనాన్ని ఎంచుకున్నారు. ఈ చిత్రానికి హర్ష కొడాలి దర్శకుడు. ఫిబ్రవరి 27న థియేటర్స్ లో విడుదల కాబోతున్న ''ఉత్తుత్త హీరోలు'' సినిమా సక్సెస్ అయ్యి మహేష్ విట్ట కు అలాగే చిత్ర యూనిట్ సభ్యులకు మంచి పేరు రావాలని హీరో ప్రదీప్ మాచిరాజు తెలిపారు. మహేష్ విట్ట ఈ ప్రాజెక్ట్‌లో నిర్మాత మరియు హీరోగా రాబోతున్నాడు. ఈ రాయలసీమ నేపథ్యంలో సాగే ఈచిత్రంలో నాలుగు ప్రధాన పాత్రలు ఉంటాయి. ఉత్తుత్త హీరోలు రాయలసీమ ప్రాంతం నేపథ్యంలో హాస్యం, ఉత్కంఠభరితమైన అంశాలను మిళితం చేస్తూ ఆకర్షణీయమైన కథనాన్ని అందిస్తుందని చిత్ర యూనిట్ సభ్యులు చెబుతున్నారు, అలాగే 'రాయలసీమ నుండి వచ్చిన మొదటి కల్ట్ ఫిల్మ్' మరియు చిత్ర షూటింగ్ మొత్తం కడప జిల్లాలో చేసినట్లు, కడప జిల్లా నుండి ఎంచుకున్న 75 మంది నూతన నటీనటులను పరిచయం చేస్తున్నట్లు మహేష్ విట్ట తెలిపారు.



## 'ఆయా షేర్' సాంగ్ రిలీజ్



హిట్ సినిమా దసరా తర్వాత నాని, శ్రీకాంత్ ఓదెల చేస్తున్న సినిమా ప్యారడైజ్. ఎస్ ఎల్ వీ సినిమాస్ ఆధ్వర్యంలో సుధాకర్ చెరుకూరి ప్రతిష్టాత్మకంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించిన ఆయాషెర్ అనే పాటను విడుదల చేశారు. గేయ రచయిత కాసర్ల శ్యామ్ రాసిన సాహిత్యం షేర్ రాకను సూచిస్తూ ఆకలి, ఆధిపత్యం, టెర్రిటోరియల్ పవర్తో నిండిన అంథమ్లా వినిపిస్తుంది. ప్రముఖ తెలంగాణ జానపద గాయకులు అద్దుల జంగిరెడ్డి, అకునూరి దేవయ్య తమ శక్తివంతమైన గాత్రంతో పాటమాయిరున్త వినసొంపుగా ఆలపించారు. నాని ట్రాన్స్ఫర్మేషన్ ఈ పాటలో హైలెట్‌గా నిలిచింది. రెండు జడలతో కూడిన హెయిర్ స్టైల్, గడ్డం, రెడ్ బ్లేజర్తో రగ్గడ్ లుక్లో ఆయన వారియర్, ఐకాన్లా కనిపిస్తున్నారు. శ్రీకాంత్ ఓదెల ఇక్కడ సృష్టించిన విజువల్ యూనివర్స్ అద్భుతంగా, రఫ్గా కనిపిస్తున్నాయి. ఈ చిత్రంలో మోహన్ బాబు, బాలీవుడ్ నటుడు రాఘవ్ జుయాల్, సంపూర్ణేష్ బాబు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ సిహెచ్ సాయి, ఎడిటింగ్ నవీన్ నూలి, ప్రొడక్షన్ డిజైన్ అవినాష్ కొల్లా పని చేస్తున్నారు. ది ప్యారడైజ్ చిత్రం ఆగస్టు 21న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ, బెంగాలీ, స్పానిష్, ఇంగ్లీష్ భాషల్లో పాన్ వరల్ రిలీజ్కు సిద్ధమవుతోంది.

## మార్చి 6న 'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని'

ప్రముఖ నటుడు శివాజీ నిర్మాతగా, హీరోగా శ్రీ శివాజీ ప్రొడక్షన్స్ పతాకంపై రూపొందుతున్న క్రైమ్ కామెడీ ఫ్యామిలీ థ్రిల్లర్ చిత్రం 'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని'. ఇంతకు ముందు శివాజీతో పలు హిట్ చిత్రాల్లో నటించి హిట్ జోడిగా ఖ్యాతి పొందిన శివాజీ, లయలు ఈ సినిమాలో మరోసారి జోడిగా కనిపిస్తున్నారు. శివాజీ, ప్రముఖ ఓటీటీ ఫ్లాట్‌ఫామ్ ఈటీవీ విన్లు కలిసి నిర్మించిన ఈ చిత్రానికి సుధీర్ శ్రీరామ్ దర్శకుడు. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాతలు బన్నీ వాస్, వంశీ నందిపాటిలు తమ సంస్థల ద్వారా మార్చి 6న థియేటర్స్‌లో విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేశారు. హీరో, నిర్మాత శివాజీ మాట్లాడుతూ '' సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని' మార్చి 6న ప్రపంచవ్యాప్తంగా థియేటర్స్‌లో రిలీజ్ కానుంది. లక్కీ కాంబినేషన్ ఈటీవీ విన్, బన్నీవాస్, వంశీ నందిపాటి ఆధ్వర్యంలో ఈ సినిమా విడుదల కావడం ఆనందంగా ఉంది. ఈ సినిమాను మొదటగా థియేటర్ కోసమే ప్రారంభించాం. ఈసినిమాను అనుకున్నది అనుకున్నట్టుగా తీశాం. ఈటీవీ వాళ్లకు ఏది చెప్పమో అదే తీశాం. సినిమాకు ఉండే థియేటర్ ఎక్స్‌పిరెన్స్ మాజా వేరు. థియేటర్లో చూస్తేనే కిక్కు. కానీ ఈ సినిమాను థియేటర్ ఎక్స్‌పిరెన్స్ ఇవ్వాలనుకున్నాం. అందుకే థియేటర్లో విడుదల చేస్తున్నాం. ఈ సినిమానే తనకు కావాలిసింది చేసుకుంది. థియేటర్లోకి వస్తుంది. ఈ ప్రెస్ మీట్ లో ఈటీవీ విన్ బిజినెస్ హెడ్ సాయి కృష్ణ, నిర్మాతలు బన్నీవాస్, వంశీ , దర్శకుడు సుధీర్ శ్రీరామ్ , నటుడు, అలీ. లయ పాల్గొన్నారు.





## కథ విని సాయి కుమార్ షాక్

'కోర్ట్' ఫేమ్ హర్ష్ రోషన్, శ్రీదేవీ జంటగా మ్యాంగో మాస్ మీడియా సమర్పణలో కోన ఫిల్మ్ కార్పొరేషన్ బ్యానర్ మీద కోన వెంకట్ రూపొందించిన చిత్రం 'బ్యాండ్ మేళం'. సతీష్ జవ్వాజీ ఈ మూవీకి దర్శకత్వం వహించారు. కావ్య, శ్రావ్య నిర్మించిన ఈ సినిమాని మార్చి 13న విడుదల చేయబోతోన్నారు. ఈ క్రమంలో మంగళవారం నాడు టీజర్ను రిలీజ్ చేశారు. ఈ మేరకు నిర్వహించిన టీజర్ లాంచ్ ఈవెంట్కి తమన్, శివాజీ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ కార్యక్రమంలో కోన వెంకట్ మాట్లాడుతూ 'గుండెలోంచి వచ్చే ప్రేమ కథకు ఎలాంటి ఆదరణ దక్కుతుందని 'నిన్ను కోరి'తో తెలిసింది. ఈ 'నిన్ను కోరి' వల్లే ఇప్పుడు 'బ్యాండ్ మేళం' నిర్మించాను. నాని ఫిల్మోగ్రఫీలో 'నిన్ను కోరి' ఓ మెమరబుల్ ఫిల్మ్గా నిలిచింది.శివ నిర్వాణ ఈ కథను గుండెతో చెప్పాడు. నాకు సతీష్ ఈ కథను చెప్పినప్పుడు కూడా అదే ఫీలింగ్ కలిగింది. ఈ కథలోని సంఘర్షణ చాలా కొత్తగా ఉంటుంది. సాయి కుమార్ ఈ కథను విని షాక్ అయ్యారు. విజయ్ బుల్గానిన్ మాకు అద్భుతమైన సంగీతాన్ని అందించారు. మార్చి 13న ఈ చిత్రం రాబోతోంది. అందరూ సక్సెస్ చేసి ఇంకా కొత్త వారిని పరిచయం చేసే శక్తిని, సక్సెస్ను అందిస్తారని కోరుకుంటున్నాను' అని అన్నారు. ఈ కార్యక్రమంలో శివాజీ, తమన్, నందినీ రెడ్డి, శివ నిర్వాణ, వేణు, హర్ష్ రోషన్, శ్రీదేవి, సతీష్ జవ్వాజీ పాల్గొన్నారు.

## కొరియన్ అబ్బాయిని ప్రేమించిన అమ్మాయి కథ



రైజ్ ఈస్ట్ ఎంటర్టైన్మెంట్ నిర్మాణంలో, రా.కార్తిక్ రచించి దర్శకత్వం వహించిన ఈ చిత్రం మేడ్ ఇన్ కొరియా. ప్రియాంక మోహన్, దక్షిణ కొరియా నటుడు పార్క్ హైజిన్ ప్రధాన పాత్రల్లో నటించారు. తమిళనాడులోని ఒక చిన్న పట్టణానికి చెందిన శెన్బాకి దక్షిణ కొరియాకు వెళ్లాలని గొప్ప కల ఉంది. ఆ కల నిజమవుతున్న ప్రయాణాన్ని చూపించే 'మేడ్ ఇన్ కొరియా' చిత్రం మార్చి 12న నెట్‌ఫిక్స్‌లో విడుదల కానుంది. దర్శకుడు రా.కార్తిక్ మాట్లాడుతూ, కొరియన్, తమిళ సంస్కృతుల మధ్య ఉన్న చారిత్రక అనుబంధాలు నాకు ఎంతో ఆసక్తిని కలిగించాయి. అదే ప్రేరణతో ఈ కథను రూపొందించాను. 'మేడ్ ఇన్ కొరియా' హత్తుకునే స్లైస్‌ఆఫ్‌లైఫ్ చిత్రం. భాషల్ని దాటి ప్రపంచ సంస్కృతులను కలుపుతున్న కథలను ప్రోత్సహించిన నెట్ఫ్లిక్స్కు ధన్యవాదాలు అని అన్నారు. నెట్‌ఫిక్స్ ఇండియా కంటెంట్ వైస్ ప్రెసిడెంట్ మోనికా షెర్గిల్ మాట్లాడుతూ, దక్షిణాది కథలపై మా దృష్టిని మరింత బలోపేతం చేస్తూ, స్థానిక సంస్కృతిలో నాటుకు పోయినప్పటికీ ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను తాకే కథలను తీసుకురావడమే మా లక్ష్యం. తమిళనాడులోని ఒక చిన్న గ్రామం నుంచి వచ్చిన అమ్మాయి కలల కథగా 'మేడ్ ఇన్ కొరియా'ను అద్భుతంగా ప్రతిబింబిస్తుంది.

## గోదావరి పుష్కరాల భద్రత ఏర్పాట్లపై చర్యలు ప్రారంభించండి

### డిజిపి బి.శివధర్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** గోదావరి పుష్కరాలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు చేపట్టవలసిన భద్రత ఏర్పాట్లపై తగిన చర్యలు తీసుకోవాలని డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి.శివధర్ రెడ్డి అన్నారు. డిజిపి కార్యాలయంలో బుధవారం ఎండోమెంట్ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యార్ తదితరులతో కలిసి వివిధ జిల్లాల పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ మహాత్కార్యక్రమానికి సంబంధించి భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, భక్తుల సౌకర్యాలపై పోలీసు అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా డిజిపి మాట్లాడుతూ వచ్చే సంవత్సరం జూన్ 26 నుండి జూలై 7 వరకు జరగనున్న గోదావరి పుష్కరాలకు పకడ్బందీ భద్రత ఏర్పాటు చేయాలని సూచించారు. గోదావరి నది ప్రవహిస్తున్న జిల్లాల పోలీసు అధికారులు ఇప్పటి నుంచే పుష్కర పనులపై దృష్టి సారించాలని, ఏర్పాట్లను ముమ్మరం చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జరిగిన మొదటి గోదావరి పుష్కరాల సమయంలో ఉమ్మడి జిల్లాలు ఉండేవని, ప్రస్తుతం జిల్లాల సంఖ్య పెరిగిన దృష్ట్యా క్షేత్రస్థాయిలో పనులపై అధికారులు సమగ్ర నివేదికలు తయారు చేయాలన్నారు. ఇటీవలి మేడారం జాతరలో వినియోగించిన సాంకేతిక నైపుణ్యాన్ని, అనుభవాన్ని ఈ పుష్కరాల్లోనూ సమర్థంగా వాడాలని ఆయన సూచించారు. శైలజ రామయ్యార్ మాట్లాడుతూ గోదావరి నది ప్రవహిస్తున్న నిజామాబాద్, నిర్మల్, మంచిర్యాల, జగిత్యాల, పెద్దపల్లి జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం తదితర జిల్లాల్లో అధికారులు పనులను ప్రారంభించాలన్నారు. నది నీటి నాణ్యతను, గాలి, శబ్ద కాలుష్యాన్ని ఆన్‌లైన్ ద్వారా ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేసేలా వ్యవస్థలను ఏర్పాటు చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో శాంతిభద్రతల అదనపు డిజిపి మహేష్ ఎం భగవత్, ఐజిపిలు ఎస్.చంద్రశేఖర్ రెడ్డి, గజరావు భూపాల్, శాంతి భద్రతల ఎఐజి రమణ కుమార్, వివిధ జిల్లాల ఎస్‌పిలు, కమిషనర్లు , ఎండోమెంట్ శాఖాధికారులు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని తమ అభిప్రాయాలు తెలియజేశారు.

**క్రీడాకారులకు అసౌకర్యం కలగకుండా పకడ్బందీ చర్యలు**

దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల పోలీస్ ఫుట్‌బాల్ క్రీడాకారులు, కేంద్ర సాయుధ బలగాల నుండి వచ్చే వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి. శివధర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. తెలంగాణ పోలీస్ శాఖ ఆతిథ్యమిస్తున్న 74వ 'బి.ఎన్. ముల్లిక్ మెమోరియల్ ఆలిండియా పోలీస్ ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్ 2026' ఏర్పాట్లపై బుధవారం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించి, వచ్చే నెల మార్చి 23 నుండి ఏప్రిల్ 5వ తేదీ వరకు హైదరాబాద్ వేదికగా జరగనున్న ఈ క్రీడా సంబరానికి సంబంధించిన ఏర్పాట్లను డిజిపి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఉన్న ఫుట్‌బాల్ పోలీస్ క్రీడాకారులు ఈ పోటీల్లో తలపడనున్నారని, వీరికి స్వాగతం పలికేందుకు సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ రైల్వే స్టేషన్లతో పాటు శంషాబాద్ విమానాశ్రయం వద్ద ప్రత్యేక రిసెప్షన్ బృందాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ప్రతి జట్టుకు హిందీ, ఇంగ్లీష్ భాషల్లో ప్రావీణ్యం ఉన్న ఒక లైజన్ ఆఫీసర్‌ను కేటాయించాలని, వారు జట్ల రాక నుండి తిరుగు ప్రయాణం వరకు అన్ని బాధ్యతలను పర్యవేక్షిస్తారని తెలిపారు. క్రీడాకారులకు రవాణా కోసం ప్రత్యేక బస్సులను కేటాయించడమే కాకుండా, వారు బస చేసే చోట అవసరాలను కూడా లైజన్ ఆఫీసర్లు చూస్తారని తెలియజేశారు. ఈ మెగా ఈవెంట్ కోసం ప్రత్యేక వెబ్‌సైట్, సోషల్ మీడియా ప్రచారంతో పాటు లోగో, మాస్కట్, టీషర్టులు, మెడల్స్ వంటి బాధ్యతలను ఇమేజిల్ అడ్వర్టైజింగ్ సంస్థకు అప్పగించామని డిజిపి తెలిపారు. ఈ సమీక్షలో ఆర్‌బివిఆర్‌ఆర్ టిజిపిఎ డైరెక్టర్ అభిలాషా బిష్త్, అదనపు డిజిపిలు మహేష్ ఎం. భగవత్, అనిల్ కుమార్, సంజయ్ కుమార్ జైన్, సిపిలు అవినాష్ మహంతి, డాక్టర్ ఎం. రమేష్, ఐజిపిలు గజరావు భూపాల్, రమేష్ నాయుడు, అదనపు సిపి తఫ్సీర్ ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

## ఏప్రిల్‌లోపు 'విద్యార్థుల ఆధార్' బయోమెట్రిక్ నమోదు పూర్తి చేయండి

### ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 94 శాతం పూర్తి

### పాఠశాలల్లో 'ఆధార్ కిట్స్'



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థు లందరికీ ఆధార్ నమోదు తప్పనిసరి అని, బయోమెట్రిక్ అప్‌డేషన్‌ను ఏప్రిల్, 2026లోగా పూర్తి చేయాలని పాఠశాల విద్యాశాఖ లక్ష్యంగా పెట్టుకుంది.రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 94 శాతం విద్యార్థులు మాత్రమే ఆధార్ నమోదు ప్రక్రియ పూర్తయింది. విద్యార్థులకు విద్యా సేవలను నిరంతరం అందేలా చేయడం, భవిష్యత్‌లో జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షల సమయంలో ఎటువంటి సమస్యలు కూడా రాకుండా, ముందస్తు చర్యలు తీసుకోవడమే ఈ ప్రత్యేక డ్రైవ్ ఉద్దేశమని విద్యాశాఖ సంచాలకులు డాక్టర్ ఇ.నవీన్ నికోలాస్ తెలిపారు. 'విద్యార్థుల ఆధార్ నమోదు, తప్పనిసరి బయోమెట్రిక్ అప్‌డేషన్' పురోగతి పట్ల హైదరాబాద్‌లోని పాఠశాల విద్యాశాఖ సంచాలకుల కార్యాలయంలో బుదవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. డాక్టర్ ఇ.నవీన్ నికోలాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో విద్యాశాఖ జాయింట్ డైరక్టర్ పి.రాజీవ్, యుఐడిఎఐ ప్రాజెక్ట్ మేనజర్ నరేష్, విద్యాశాఖ ఆధార్ సాంకేతిక బృందం ప్రవీణ్ కుమార్, నరేందర్ ఆధార్ ఏజెన్సీలు, జిల్లా కో ఆర్డినేటర్లు తదితరులు హాజరయ్యారు. యుఐడిఎఐతో సమన్వయం చేస్తూ ఈ కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 94 శాతం విద్యార్థుల ఆధార్ నమోదు ప్రక్రియ పూర్తికాగ, మిగిలిన 6 శాతం విద్యార్థుల నమోదు తక్షణం పూర్తి చేయాలని విద్యాశాఖ ఆదేశించింది.5 ఏళ్లు పూర్తి చేసినప్పుడు (ఐరిస్, వేలిముద్రలు, ఫోటో), 15 ఏళ్లు పూర్తయిన తర్వాత బయోమెట్రిక్ అప్‌డేషన్ తప్పనిసరి అని నవీన్ నికోలాస్ స్పష్టం చేశారు. ప్రస్తుతం 05 నుంచి 15 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న మొత్తం 10,04,822 మంది విద్యార్థులు, 15 ఏళ్లు దాటిన వారు 6,75,672 మంది విద్యార్థుల బయోమెట్రిక్ అప్‌డేషన్ పెండింగ్‌లో ఉన్నది.

**పాఠశాలలకే ఆధార్ కిట్లు**

రాష్ట్ర వ్యాప్తంగా మూడు ఆధార్ మ్యాన్‌పవర్ ఏజెన్సీలను నియమించి, ఒక్కో ఏజెన్సీకి 11 జిల్లాల చొప్పున కేటాయించారు. పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులు సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు లేదా ప్రిన్సిపాల్‌ను సంప్రదిస్తే, ఆయా పాఠశాల ప్రాంగణంలోనే ఆధార్ నమోదు, బయోమెట్రిక్ అప్‌డేషన్ కిట్లను ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని విద్యా శాఖ సూచించింది. పాఠశాల స్థాయిలో ఆధార్ కిట్ అందుబాటు వివరాలు సంబంధిత జిల్లా విద్యాశాఖాధికారి (డిఇఒ) కార్యాలయంలో తెలుసుకోవచ్చని తెలిపారు. డిఇఒలు, ఎంఇఒలు ఏప్రిల్ 2026లోగా ఈ కార్యక్రమం పూర్తయ్యేలా పర్యవేక్షించాలని నవీన్ నికోలాస్ ఆదేశించారు. తల్లిదండ్రులు తమ పిల్లల ఆధార్ అప్‌డేషన్ స్థితిని వెంటనే పరిశీలించి, అవసరమైన మార్పులు చేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## సహకరించండి (మొదటి పేజీ తరువాయి)

శంతను నారాయణ్‌తో ముఖ్యమంత్రి చర్చించారు. వివిధ రంగాల్లో ప్రపంచవ్యాప్తంగా మారుతున్న పరిస్థితులు, అవకాశాలపై ప్రభుత్వపరంగా చేపట్టాల్సిన చర్యల గురించి కూడా వారు చర్చించారు. మాన్యుఫాక్చరింగ్ రంగంలో తెలంగాణను శక్తివంతంగా తీర్చిదిద్దేందుకు, ప్రముఖ సంస్థలను ఆకర్షించడానికి సరైన ప్రణాళికలను రూపొందించాల్సిన అవసరం ఉందని సమావేశంలో ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఎఐలో వస్తున్న విప్లవాత్మక మార్పులు ఆర్థిక వ్యవస్థపై చూపించే ప్రభావం, రానున్న రోజుల్లో ఎఐని సమర్థవంతంగా వినియోగించుకోవడానికి తీసుకోవలసిన చర్యలపై శంతను నారాయణ్‌తో ముఖ్యమంత్రి చర్చించారు.

## ధాన్యం దోపిడీ

(మొదటి పేజీ తరువాయి)

కందుకూరి పద్మ భార్యాభర్తలను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వీరు నల్లగొండ పట్టణంలోని రవీంద్రనగర్‌లో నివాసం ఉంటున్నారు.పరారీలో మరో మరో ఐదుగురు మాశెట్టి రాధాకృష్ణ, మేడమ్ కృష్ణమూర్తి, ఇడుకుళ్ళ దామోదర్, కందుకూరి రవికుమార్, బూరుగు బాలకృష్ణ నిందితులు పరారీలో ఉన్నట్లు ఎస్పి వెల్లడించారు. వీరి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి అన్నారు.అరెస్టు చేసిన నిందితుల నుండి రూ.1.09లక్ష నగదు మూడు సెల్ ఫోన్లు ఒక బెలెనో కారు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కస్టమ్ మిల్లింగ్ పేరుతో మోసం 2022-23 రబీ సీజన్‌లో ప్రభుత్వంతో కస్టమ్ మిల్లింగ్ ఒప్పందం కుదుర్చుకున్న సుమాంజలి పార్ బాయిల్డ్ ప్రైవేట్ లిమిటెడ్ ఆర్జాలబావి,నల్లగొండ నుండి సుమారు రూ.22 కోట్లు, వరలక్ష్మి పార్ బాయిల్డ్ మిల్ చిట్యాల రూ.19.33 కోట్లు,మనోహర ఆగ్రో ఫుడ్ ప్రాడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ మునుగోడు రూ.1.47 కోట్లు ఈ మూడు రైస్ మిల్లుల ద్వారా మొత్తం 13,170.061 మెట్రిక్ టన్నుల ప్రభుత్వ ఈ కేసులో నిందితులపై నల్లగొండ రూరల్, చిట్యాల, మునుగోడు పోలీస్ స్టేషన్‌లలో కేసులు నమోదు చేసి రిమాండ్‌కు పంపనున్నట్లు తెలిపారు. ఈ కేసు దర్యాప్తులో పాల్గొన్న నల్లగొండ టూ టౌన్ సీఐ రాఘవరావు, నార్కట్‌పల్లి సీఐ నాగరాజు, నల్లగొండ రూరల్ ఎస్ఐ సైదాబాబు,సిబ్బందిని ఎస్పి అభినందించారు.

## క్రెడిట్ కార్డుల లావాదేవీలు

(మొదటి పేజీ తరువాయి)

నుండి 2026లో 11.66 కోట్లకు పెరిగింది. క్రెడిట్ కార్డులు 3.4 కోట్లకు పైగా, అంటే దాదాపు 41 శాతం పెరిగాయి. ఈ విస్తరణ అధిక లావాదేవీలకు దారితీసింది. పాయింట్ ఆఫ్ సేల్ (పిఒఎస్) టెర్మినల్స్‌లో క్రెడిట్ కార్డ్ లావాదేవీల సంఖ్య 2023లో 14.09 కోట్ల నుండి 2026లో 26.75 కోట్లకు పెరిగాయి. ఇది నాలుగేళ్ళలో దాదాపు రెట్టింపు. విలువ పరంగా క్రెడిట్ కార్డుల ద్వారా పిఒఎస్ వద్ద చేస్తున్న వ్యయం 2023లో రూ. 48,934 కోట్ల నుండి 2026లో రూ.75,988 కోట్లకు పెరిగింది. ఇ-కామర్స్‌లో ఈ వృద్ధి మరింత వేగంగా ఉంది. ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లలో క్రెడిట్ కార్డ్ లావాదేవీలు 2023లో 11.84 కోట్ల నుండి 2026లో 26.93 కోట్లకు పెరిగాయి. ఈ లావాదేవీల విలువ రూ.1,23,021 కోట్లకు పెరిగింది. తద్వారా అధిక విలువ కలిగిన ఆన్‌లైన్ వినియోగంలో క్రెడిట్ కార్డులు తమ ఆధిపత్యాన్ని బలోపేతం చేసుకుంటున్నాయి.

దీనికి విరుద్ధంగా పిఒఎస్‌లో డెబిట్ కార్డ్ వినియోగం గణనీయంగా తగ్గింది. డెబిట్ కార్డ్-పిఒఎస్ లావాదేవీల పరిమాణం 2023లో 17.43 కోట్ల నుండి 2026లో 7.73 కోట్లకు తగ్గాయి. అదే కాలంలో డెబిట్ కార్డ్ పిఒఎస్ లావాదేవీల విలువ రూ.37,520 కోట్ల నుండి రూ.25,513 కోట్లకు పడిపోయింది.

డెబిట్ కార్డుల సంఖ్య 2023లో 94.56 కోట్ల నుండి 2026లో 103.77 కోట్లకు పెరిగినప్పటికీ, యుపిఐ, కార్డులతో పోలిస్తే యాక్టివ్ రిటైల్ వ్యయంలో వాటి పాత్ర తగ్గిపోతున్నట్లు కనిపిస్తోంది.

**3.8 లక్షలకుపైగా తగ్గిన ఎటిఎంలు**

2024లో ఎటిఎంల సంఖ్య గరిష్టంగా 19.80 లక్షలకు చేరుకోగా, 2026 నాటికి 15.99 లక్షలకు తగ్గింది. ఈ కాలంలో దాదాపు 3.8 లక్షల ఎటిఎంలు తగ్గించబడ్డాయి. 2023 స్థాయిలతో పోలిస్తే, 2026లో ఎటిఎం నెట్‌వర్క్ తక్కువగా ఉంది. ఎటిఎంల తగ్గుదల, డెబిట్ కార్డ్ పిఒఎస్ వినియోగం తగ్గడం, పిఒఎస్, క్రెడిట్ ఆధారిత లావాదేవీల ఆధిపత్యాన్ని సూచిస్తుంది.

## 'రెవెన్యూ' ఆధునీకరణ

(మొదటి పేజీ తరువాయి)

ఆర్‌డిఒ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని, శిథిలావస్థ, పాలనకు అనువుగా లేని భవనాల వివరాలను సేకరించామన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగడం సరైంది కాదని, ప్రజలకు సేవలందించే కేంద్రాలు గౌరవప్రదంగా ఉండాలన్న సిఎం రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు, ఏర్పడిన తర్వాత కూడా రెవెన్యూ కార్యాలయాలు ప్రజలకు సౌకర్యవంతంగా లేకపోవడంతో పాటు చాలా వరకు అద్దె భవనాలలోనే కొనసాగుతున్నాయన్నారు.

**గత ప్రభుత్వం ప్రజలకు దూరంగా జిల్లా కలెక్టరేట్లను నిర్మించింది**

గత ప్రభుత్వం ముందుచూపు లేకుండా, ప్రణాళికాబద్ధంగా కాకుండా మండలాల పునర్విభజన చేపట్టిందని, కొన్ని మండలాలు రెండు మూడు జిల్లాల పరిధిలోకి వచ్చే విధంగా రూపొందించిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి విమర్శించారు. అనేక కార్యాలయాల్లో కనీస వసతులు లేకపోవడం, సిబ్బంది కొరత తీవ్రంగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త మండలాలకు అవసరమైన పోస్టులు మంజూరు చేసి పరిపాలనను బలోపేతం చేశామని వివరించారు. ప్రజలకు దూరంగా కలెక్టరేట్లను నిర్మించి వాటి నిర్వహణను గాలికివదిలేశారని విమర్శించారు. స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖలో అత్యాధునిక వసతులతో సమీకృత భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. ఔటర్ రింగ్ రోడ్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల్లోని 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 12 క్లస్టర్లుగా విభజించి సమీకృత భవనాలు నిర్మిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే గచ్చిబౌలి, మేడ్చల్‌మల్కాజిగిరి, పఠాన్ చెరువులలో భవనాలకు శంకుస్థాపన పూర్తయ్యాయని, గచ్చిబౌలిలో నిర్మాణ పనులు తుది దశలో ఉన్నదని, మరికొద్ది నెలల్లో ప్రారంభానికి సిద్ధమవుతుందని వివరించారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com